# శ్రీ రాధా ధ్యానయోగము

## పన్నెండవ భాగము







శ్రీ రాధాదేవి

# శ్రీరాధా ధ్యానయోగం

(పన్నెండవ భాగము)

సమర్పణ

**రాధామహాలక్ష్మి దేవి**

ప్రకాశకులు

శ్రీరాధా మహాలక్ష్మి ఆశ్రమం

శ్రీ బృందావన ధామం, మధురజిల్లా

ఉత్తరప్రదేశ్

సర్వస్వామ్య సంకలితము

ప్రథమ ముద్రణ **జులై, 2021**

ప్రతులు : 100

**వెల : అమూల్యము**

ప్రతులకు

1) **శ్రీరాధాకృష్ణ మందిరము**
5/5 అరండల్‌పేట,
గుంటూరు - 522 002
ఫోన్ : 0863-2233933

2) **శ్రీరాధా మహలక్ష్మి ఆశ్రమ్**
బడేకుంజ్, గోపేశ్వర్ ఆలయ వీధి,
బృందావన్ (**U.P.**) - 281 121
ఫోన్ : 0565-2442583

ముద్రణ : **సుదర్శన్ ప్రింటర్స్,** గుంటూరు.
ఫోన్ : 2246245

డి.టి.పి. : **శ్రీవల్లి గ్రాఫిక్స్,** గుంటూరు. సెల్ : 9966043946.

# విషయసూచిక


ముందుమాట ........................................................ iv

ఉపోద్ఘాతం ........................................................ 1-13

1. సేవ - స్మృతి ........................................................ 14-21

2. భావస్థితి........................................................ 22-25

3. పంచమ పురుషార్థం........................................................ 26-37

4. ఆత్మార్పణ స్థితి ........................................................ 38-48

5. అమ్మతో అనుసంధానం........................................................ 49-59

6. దృఢ స్మృతి ........................................................ 60-70

7. అతీంద్రియ ఆనందం ........................................................ 71-81

శ్రీరాధే

# ముందుమాట

**29.04.2021, 4.15 P.M.**

**బృందావనధామ్**

ప్రేమస్వరూపులైన నాన్నగారు తమ దివ్యాశీస్సులతో 20వ ధ్యాన సప్తాహం మన చేత చేయించారు. ఇది 12వ భాగం! ఏదైనా గురుకృప, అమ్మ అనుగ్రహం ఉంటేనే కాని మనం ముందుకు సాగలేము.

ధ్యానానికి కావలసిన అవకాశాలు, అవసరాలు అన్ని ఏర్పాట్లు ఉన్నప్పటికీ మనసు స్థిరంగా అమ్మతో ఉండటానికి ప్రయత్నం చేయాలి! మనసు సరైన నిలకడగా ఉండదు. సద్గురు కృప ఉంటే తప్పకుండా ఆ అమ్మతో లింకు ఏర్పడుతుంది. మనసే అన్నిటికీ కారణం! ఆ మనసుతోటి మనం నాన్నగారు చెప్పినట్లుగా అమ్మతో ఉంటే అది వైకుంఠంగాను, ఈ జగత్తుతోఉంటే యమలోకంగాను అయిపోతుంది. మనకి అవకాశాలు, వసతులు కలిగి ఉండి కూడ ధ్యానానికి కూర్చోలేక పోతున్నామంటే మన మనసే కారణం!

రెహమాన్‌కి ఏ అవకాశమూ లేదు పాపం! ఏ వనరులు, వసతులులేవు. అయినప్పటికి కూడా తన మనసుని అమ్మతో నింపుకొని, అనంతమైన ఆనందాన్ని పొందాడు. కాబట్టి మనసుకి కావలసినది వసతులు, వనరులు కావు. అమ్మతో ఉండే గొప్ప అనుసంధానమే ధ్యానానికి ముఖ్యసూత్రం! ఆ ఆనందాన్ని ఎవరూ వర్ణించలేరు. తాను తన ఇష్టతోనే ఉంటుంది. కాబట్టి ధ్యానానికి అంతర్ముఖత్వంగా మన మనసును ప్రయాణింపజేసి, ఆ ఇష్టతో అనుసంధానం పొందాలి!

అందుకనే బృందావన మహాత్ములు అందరూ అమ్మతో లింకు పెట్టుకొని, ఆ ఆనందాన్ని పొందారు. భగవంతుడికి సేవాభావంతో మనం మనసుని నింపుకొని, సేవ చేస్తున్నట్లుగా భావం పొంది సేవ చేసుకోవాలి! ఆయన భావప్రియుడు! ఎన్నో జన్మల సంస్కారం ఉంటేనే ఆ అమ్మభావాన్ని పొందటానికి అవకాశం ఉంటుంది. ఆ పంజాబీ అతను ప్రాకృతికంగా జగత్తుతో తాదాత్మ్యం చెందుతూ, అమ్మ ఇంటిలో తిరుగుతున్నాడు. కాని తన ఇంటికి వచ్చినవాళ్ళు తన వాళ్లని ఆ భావాన్ని మార్చివేసి, తన సొత్తుగా చేసుకున్నది.

కాబట్టి మనం కూడా ప్రయత్నం చేద్దాం! "బృందావనంలో అమ్మ ఇంట్లో ఉన్నాను. అమ్మ నామాన్నే నేను జపిస్తున్నాను. అమ్మ చరణాల యొక్క సేవాభాగ్యమే కలగాలి నాకు" అనే భావంతో ధ్యానం చేస్తే ఎప్పటికైనా మనయందు కనికరం చూపిస్తుంది అమ్మ. అహేతుకమైన ప్రేమని కూడా మనపై చూపిస్తుంది. కాబట్టి అనన్యమైన నిష్ఠతో అమ్మభావాన్ని మనం భావించుకొని ధ్యానం చేయటమే మన ధ్యేయం! అక్కడ మంత్రం అక్కరలేదు, నామం అక్కరలేదు, రూపం అక్కరలేదు; కేవలం భావం మాత్రమే! అందుకనే నాన్నగారు దీనిని "రాధాభావ ధ్యానయోగం" అని చెప్పారు.

రాధే! రాధే!

శ్రీరాధాసఖీ చరణరేణువు,





శ్రీరాధే

# ఉపోద్ఘాతం

మనం రాధాభావ ధ్యానయోగం సప్తాహాన్ని చేయటానికి నాన్నగారు ఇచ్చిన ఒక సంకల్పంతో రేపటి నుంచి మొదలవుతుంది. ఈ సప్తాహం క్రిందటి సంవత్సరం అంతా ఈ కరోనా గొడవ వలన ఎవరింట్లో వాళ్ళు చేసుకున్నాము. ఇప్పుడు కూడా అదే గొడవగా ఉండడంవలన ఎవరింట్లో వాళ్ళు చేసుకునేటట్లుగా ఏర్పాటు జరుగుతున్నది. నిజంగా బృందావనంలో చేసుకోవటం చాలా విశేషం! కానీ పరిస్థితులన్నీ మనకు అననుకూలంగా ఉన్నాయి, అనుకూలంగా లేవు. ఇది ఎందుకిలా వస్తున్నదో మరి మనకు తెలియదు. ప్రపంచం అంతా ఉన్నది, మన ఒక్కరికేకాదు.

కానీ ధ్యానం మటుకు చాలా highest, మనం ఎలాగైనా చేసుకోవాలి. ప్రతిరోజూ మీరు ఇంట్లో చేస్తున్నారో లేదో తెలియదుకానీ ఈ ఏడు రోజులైనా మనం శ్రద్ధగా అమ్మ ధ్యానం చేసుకుందాం. అమ్మ ధ్యానంలో ఉండే విశేషం చాలా గొప్పది! బృందావనధామంలో మహాత్ములందరూ నిరంతరం అమ్మతో link పెట్టుకుని అమ్మ యొక్క చింతనలో ఉన్నారు. ఆ అమ్మ చింతన చాలా highest అని చెప్పారు. నాన్న కూడా ఆ భావంలో ఎప్పుడూ నిమగ్నమై ఉండేవారు. నాన్నగారు మనతో మాట్లాడుతూ ఉన్నా, మాట్లాడుతూ మనవైపు చూస్తూ ఉన్నా లిప్తకాలంలో మళ్ళీ ఎటో వైపుకి వెళ్ళిపోయేది ఆ చూపు, ఆ మాట! మౌనంగా అయిపోవటం అంటే అమ్మ యొక్క touch ఆలోపలకి వెళితే బయట ఏదీ ప్రదర్శన జరగదు. అలా ఉండేది నాన్న భావస్థితి!

ఆ భావస్థితి రావాలి అంటే ఆయన కృప వలన రావలసిందే! మనం ఇంట్లో ఉండికూడా 'మాకు అవకాశం లేదండీ చేసుకోవటానికి, ఎక్కడ

చేసుకోగలుగుతాము, ప్రొద్దునలేస్తే సాయంత్రం దాకా ఏవో పనులు' అంటారు. ఈ పనులతోటి మనం ఎక్కువ శ్రద్ధ చూపిస్తున్నాంకానీ అమ్మ ధ్యానానికి మనసు లగ్నం అవటం లేదు. ఈ ఏడు రోజులు కూర్చోవాలన్నా అలవాటు లేకపోతే కూర్చోలేరు. పిల్లవాడిని స్కూలుకు పంపించాలంటే వాడికి అలవాటు చేయాలి. ఇప్పుడు మూడేళ్ల పిల్లలప్పటి నుంచి స్కూలు అలవాటు చేస్తున్నారు. వాడు చదవకపోయినా ఆడుకోవటమో, అలా బొమ్మలు చూసి వేలు తిప్పటమూ ఇవన్నీ చేస్తున్నారు. ఎందుకంటే అలవాటు కావటం కోసం. అలాగే ధ్యానం కూడా మనం చేసేటప్పుడు ప్రతిరోజు మనసుకు కుదిరినా కుదరకపోయినా ఆ timings లో కూర్చొని మన మనసును అమ్మ యందు లగ్నం చేసుకోవటానికి ప్రయత్నం చేయాలి!

ఎందుకంటే చీకటి పడిపోతుంది. వెలుతురు ఉన్నప్పుడే మనం సామాను సర్దుకోవాలి. చీకటిలో సామాను సర్దలేము. ఎందుకనేది మనకు తెలియదు. కాబట్టి జీవితంలో మనకు time దొరికినప్పుడే అమ్మతో ఎక్కువ గడుపుతూ ఉండాలి. ఇవాళ వచ్చిన time రేపు ఉండదు. రేపు ఉండే time ఎల్లుండి ఉండదు, క్షణక్షణం మనకు ఆ time మారిపోతూ వెళ్ళిపోతూ ఉంటుంది. కానీ అది అంతా వృథా అయిపోతుంది. కాబట్టి మనం అమ్మతో లింకు! నువ్వు మంత్రం చేస్తున్నావా, జపం చేస్తున్నావా, ఎంత జపం చేస్తావు, ఎంతమంత్రం చేస్తున్నావు, కాదు! నీమనసు అమ్మతో ఎంత సేపు ఉన్నది అనేది గమనించుకోవాలి. ఎట్టి మంత్రాలైనా, ఎట్టి తంత్రాలైనా ఎట్టి యోగాలైనా అమ్మను చేరలేవు. నీ మనసును నిరంతర స్మృతితోటి లింకు చేసుకుంటూ ఉండాలి. ఆ స్మృతి, ఆలింకు ఎంతో highest అని చెప్పారు.

గోపికలంతా సంసారంలో ఉన్నారు. వాళ్ళు ప్రతి పనీ చేస్తున్నారు. భర్తకు సేవ చేస్తున్నారు, పిల్లలకు సేవ చేస్తున్నారు, పశువులకి చేస్తున్నారు,

ఇంట్లో పనులు చూసుకుంటున్నారు. కానీ వాళ్ళ మనసు complete గా కన్నయ్యతో నిండిపోయింది. కన్నయ్యతో నిండి, వాళ్ళు ఈ పనులన్నీ చేస్తున్నారు. ఎలా చేయగలుగుతున్నారు ? అదే సాధన అన్నారు. అందుకనే నాన్నగారు చెప్పారు. జీవితమే ఒక సాధన అని చెప్పారు. జీవితంలో ప్రతిపనినీ, ప్రతి విషయాన్నీ, ప్రతిక్రియనీ అమ్మతో link చేసుకోవాలి. అదంతా అమ్మలీలగా భావించుకోవాలి. కష్టం వచ్చిందనుకో, ఎందుకు వచ్చిందో, అమ్మలీలలో ఒక భాగం; సుఖం వచ్చిందనుకో, ఎందుకు వచ్చిందో, అమ్మలీలలో ఇది ఒక భాగం అని అమ్మతో link వేసుకుని ఉంటే మనసుకి శాంతి, అమ్మతో attachment ఎక్కువగా ఉంటుంది. కానీ మనం అలా ఉండలేము. ఈ ప్రపంచంతో attachment ఉండటం వలన అమ్మతో మనం పెట్టుకోలేకపోతున్నాం. మనసు ఒప్పదు. ఎందుకు ఒప్పదు అంటే నాది, నేను అనే ఈ రెండు ముడులు ఒప్పనివ్వవు.

కాబట్టి అమ్మతో attachment కావాలి. అమ్మతో ఉన్న attachment జగత్తులో ఎవ్వరితో లేదు. ఏదీ మనకు ఆనందం కలిగించదు. కలిగించేదల్లా ఒక్క అమ్మతోనే, అమ్మతో లింకే! కాబట్టి ధ్యానం కూడాను! 'ధ్యానానికి కూర్చోవటానికి నాకు ధ్యానం కుదరటం లేదండీ, ధ్యానం ఎలా చేయాలి ? రోజుకు 8 గం॥ అంటే కుదరదు కదా! ఒక గంట కూర్చోవచ్చునా ? ఒక్క గంట కూర్చొని చేసుకోవచ్చునా ?' ఒక గంట అట! ఒక్క గంటే ఉపయోగిస్తున్నారు చూడండి! ఎందుకు అంటే ఈ ప్రపంచంతో అంత link ఉన్నది. ప్రపంచంతో అంత అటాచ్‌మెంట్ ఉన్నది. అమ్మతో అటాచ్‌మెంట్ పెట్టుకోవటానికి time ని limit చేసుకుంటున్నాం.

కాబట్టి మనసును అమ్మతో పెట్టుకోవాలి. ఈ ధ్యానం అనేది ఒక అలవాటు. కూర్చోవటం అనే అలవాటు. ఆ కూర్చొని అమ్మతో మనసును

నింపుకోవాలి. అందుకనే ప్రతిరోజు మన ఇంట్లో కూడా ఆ time లో నీ మనసు కుదరనీ కుదరకపోనీ, తిష్ఠకుదిరితే కానీ నిష్ఠ కుదరదన్నారు. ఆ తిష్ఠ కుదుర్చుకో, కూర్చో అంతే! కూర్చున్నప్పుడు అమ్మతో పెట్టుకో. మళ్ళీ ప్రపంచ విషయాలన్నీ వచ్చాయనుకో, 'ఛీవద్దు, అవతలికి వెళ్ళిపొండి' అని అవన్నీ avoid చేస్తూ ఉండాలి. అమ్మతో గడుపుతూ ఉండాలి. ప్రతివాళ్ళకు వస్తుంది. ఎంత వాళ్ళకైనా కూడా ఆ విషయాలు కొంచెం touch అవుతూ ఉంటాయి. ఉండకుండా ఉండవు. కానీ వాటిని మనం avoid చేస్తూ ఉండాలి. ఆ avoid చేయటానికి మనం ప్రయత్నం చేయాలి. ఎందుకంటే అమ్మతో link కలగాలి అంటే ఈ ప్రపంచంలో విషయాదులను avoid చేస్తూ ఉండాలి. అదే నాన్నగారు చెప్పారు. "విషయకామముతో నిండిన మనమును అక్షయమగు పరా ప్రేమతో నింపుచు సాక్షాత్ పరమేశ్వరి భావం జీవజగతికే మూలం" అన్నారు. ఈ విషయాదులతో ఉండే ఈ మనసును అక్షయమైన ఆ ప్రేమతో నింపాలి. ఆ ప్రేమతో నింపినప్పుడే మనకు ఆనందం, సుఖం! ఆ అమ్మ భావాన్ని feel ఔతూ ఉండాలి. అక్కడ మంత్రం అక్కరలేదు, నామం అక్కరలేదు, జపం అక్కరలేదు. 'తల్లితోనే ఉన్నాను, నా తల్లి చూస్తున్నది, నా తల్లి నాకిచ్చింది ఈ భాగ్యం! అమ్మ ఇచ్చిన భాగ్యాన్ని నేను సద్వినియోగం చేసుకోవాలి' అని అమ్మతో link తో ఉండాలి!

కాబట్టి ధ్యానం అనేది కూర్చొని కళ్ళుమూసుకుని ప్రథమంగా గురువును, గురువు మనకు చాలా ముఖ్యం! "గురుర్బ్రహ్మ గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః గురుస్సాక్షాత్తు శ్రీరాధే" – ఆ గురువైన అమ్మకు, నాన్నగారికి మనం నమస్కారం చేసుకుని ఆ భావాన్ని feel ఔతూ ఉండాలి. 'అమ్మ ఎదురుగా ఉన్నది. అమ్మ నన్ను చూస్తూ ఉన్నది. అమ్మ చూపులో ఉన్నాను. అమ్మను పిలుస్తున్నాను. రాధే రాధే రాధే రాధే రాధే అని అమ్మను

పిలుస్తున్నాను. అమ్మ వింటున్నది. నేను అమ్మను చూడలేకపోయినా అమ్మ వింటున్నది' అనే భావపరంగా ఆరాధా నామాన్ని చేసుకోవాలి! కానీ ఎప్పుడైతే భావం చాలా తీవ్రంగా ఉంటుందో అమ్మ నామం కూడా ఉండదు అక్కడ. కేవలం అమ్మ భావమే ఉంటుంది. ఆ భావ స్పందన ఎంత ఆనందమో చెప్పలేము. 'అతీంద్రియ ఆనందము' అంటారట దానిని. ఈ ఇంద్రియాలకు అది అందదు. ఇంద్రియాలకు సంబంధించినది ఈ ప్రాపంచికమైన ఆనందం. ఇంద్రియాలకు అతీతమైనది ఆ ఆనందం. ఆ ఆనందమే అమ్మ స్వరూపం! కాబట్టి మనం ముందు అమ్మతో link పెట్టుకుని ఈ ఏడురోజులు ధ్యానం చేసుకోవాలి. చాలా రుచిగా ఉంటుంది. లేవబుద్ధికాదు. ఇంకా కూర్చుంటే బాగుంటుంది, ఇంకా కూర్చుంటే బాగుంటుంది అనిలోపల ఒక రకమైన తృష్ణ కలుగుతుంది. ఆశ కలుగుతుంది. రుచి కలుగుతుంది. అలాంటిది ధ్యానం అంటే!

అది ఎలా కుదురుతుంది అంటే రోజూ చేసుకుంటే ఈ ఏడు రోజులు కూడా మనకు ఎంతో అవలీలగా అమ్మతో ఎక్కువ time గడపటానికి అవకాశం ఉంటుంది. మనం ఇంట్లో ఎప్పుడు కూర్చుంటున్నాము ? కూర్చోవటానికి టైమే లేదు. ఎక్కడ ఉందండీ time ? time లేదు. కాబట్టి మనకు అమ్మతో link పెట్టుకోవాలి. ఇలాంటి అవకాశం మనకు దొరికింది, నాన్నగారు ఇచ్చారు. అసలు ప్రతినెలా ఇలాంటి ధ్యాన సప్తాహం చేసుకోవాలి అన్నారు. మనకు అవకాశం కుదరకపోవటం వలన సంవత్సరానికి రెండు సార్లు పెట్టుకుంటున్నాము. కానీ ఈ విధంగా ఎవరి ఇళ్ళల్లో వాళ్ళు ధ్యాన సప్తాహం చేసుకోవటం అనేది ఉంటే ప్రతినెలా పెట్టుకోవచ్చు. అప్పుడు బాగా అలవాటైపోతుంది. Daily కూడా కూర్చోవటానికి వాళ్ళకు ఎంతో సాధనకు అవకాశం కలుగుతుంది. అలాంటి అవకాశాన్ని మనం సద్వినియోగం చేసుకోవాలి.

రేపటిరోజు మనం ధ్యానం తెల్లవారుఝామున 4.30 నుంచి అమ్మతో link పెట్టుకోవాలి. ఇప్పుడు ఎలాగైతే ఈ Phone లో అందరికీ link ఎలా ఇచ్చారో చూడండి! ఈ ప్రాపంచికమైన ఈ ఫోన్‌తోనే ఎలాంటి link ఇచ్చారో చూడండి. జగత్తుకు అతీతమైన ఆ తల్లి link ఇంకెంత హైయ్యెస్టో చూడండి. ఆ link మనకు కావాలి. అది శాశ్వతమైన లింకు, అది సత్యమైన లింకు, అది నిత్యమైన లింకు, సుందరమైన లింకు అది! అలాంటి ఆ link తో మనం పెట్టుకున్నాం. ఈ link ఎప్పటికైనా మనకు దుఃఖాన్ని ఇస్తుంది. ఈ ప్రపంచ సంబంధమైన link దుఃఖాన్నే ఇస్తుంది. అందుకనే నాన్నగారు చెప్పారు "నీ మనమే శ్రీవైకుంఠముగా నీమనమే యమలోకంబుకదా - మనమే శ్రీవైకుంఠముగా" అమ్మతో పెట్టుకున్న మనసు వైకుంఠం!, విషయదులతో పెట్టుకున్న మనసు యమలోకం! కాబట్టి విషయాదులతో మనం తాదాత్మ్యం చెందకుండా అమ్మతో తాదాత్మ్యం చెందుదాం. విషయాదులు ఉంటాయి. ఎందుకంటే మనము కోరుకుని ఇక్కడికి వచ్చాము. కోరుకుని ఈ ప్రపంచంలోకి వచ్చాము. కాబట్టి వీటన్నిటిని మనం అనుభవం పొందుతూనే ఉన్నాము. కానీ వీటన్నిటిని మనం avoid చేస్తూ, అమ్మతో link పెట్టుకోవాలి. అంటే విడిచిపెట్టవద్దు. విడిచిపెడితే మళ్ళీ ఎన్ని జన్మలకైనా మనవెంటే వచ్చేస్తాయి. ఈ మనసుకు, ఇంగువ డబ్బాలో ఇంగువ వాసన కడిగితే పోకుండా ఉండేటట్లుగా ఈ వాసన అనేది, ఈ కర్మవాసన అనేది మనకు ప్రతి జన్మకు touch అవుతుంది. కానీ ఆ కర్మ వాసనను నిర్మూలన చేసేది ఒక్కటే. అమ్మ ఒక్కటే! ఎలాంటి అహేతుకమైన ప్రేమ చూపిస్తుంది! ఆ ప్రేమ సామాన్యంకాదు. అహేతుకమైన ప్రేమను అమ్మ చూపిస్తుంది. ఆ అమ్మ ప్రేమ మనకు తెలియదు.

ఎలాగు అని అంటే బర్సానా రాధారాణి పుట్టిన రోజు. ఒక అమ్మాయిని వాళ్ళ పిన్ని తీసుకుని వెళ్తానన్నది బర్సానాకు. 'అమ్మా! మనం రేపు బర్సానా వెళ్దాము పుట్టిన రోజుకు' అని చెప్పింది. సరే అని అన్నీ తయారు చేసుకుని బట్టలన్నీ పెట్టేసుకున్నది. ఇంతలోకి వాళ్ళింట్లో వాళ్ళకు ఎవరికో బాగా జ్వరం వచ్చేసి బాగుండకపోయేసరికి ఆ Programme Cancel చేశారు. ఆ ప్రోగ్రామ్ కాన్సిల్ అయిపోగానే ఆ పిల్ల ఏడవటం మొదలుపెట్టింది. 'నాకు యోగ్యతలేదు, నాకు అదృష్టం లేదు, నేను దురదృష్టవంతురాలిని. ఎలా వచ్చింది నాకు ఈ కర్మ ? నేను అమ్మ పుట్టినరోజు చూడలేకపోతున్నానే, అమ్మ పుట్టినరోజు చూడలేకపోతున్నానే' అని ఏడ్చేస్తున్నది పాపం ఆ అమ్మాయి. మేడమీద కూర్చొని ఏడుస్తున్నది చిన్నపిల్ల. ఒకరాత్రి 12 గం॥లకు ఒక అమ్మాయి వచ్చి చేయిపట్టుకొని "ఎందుకు ఏడుస్తావు ? మనం వెళదాం. ఆవిడ పుట్టినరోజు చూపిస్తా నీకు, రా!" అని ఆ అమ్మాయిని చేయి పట్టుకుని తీసుకుని వెళ్ళింది.

బర్సానా తీసుకువెళ్లింది. ఆ కొండ మీద కోలాహలం! Full గా జనం ఉన్నారు. 'రాధే రాధే రాధే రాధే' అని నామ సంకీర్తన జరుగుతున్నది. ఆ నామ సంకీర్తన సామాన్యమైనది కాదు. ఆ నామ సంకీర్తనలో అందరూ భావప్రేమ ఉన్మతులైపోయి ఉన్నారు. ఆ అమ్మాయి వెళ్ళింది, చూసింది, ఏడుస్తున్నది. 'ఇంత మంది జనం! ఇంతమంది జనం అమ్మ కోసం ఎదురు చూస్తున్నారు, అమ్మ ఆవిర్భావం కోసం!' అని ఆ అమ్మాయి చాలా ఆనందపడిపోయింది. తెల్లవారు ఝామున 5 గం॥లు అయింది. 5 గం॥లకు ఆవిర్భావం టైము! "జైజై శ్రీరాధే! జైజై శ్రీరాధే! వృషభానులాడిలీకీ!" అని ఇలా జైజైలు కొడుతున్నారుట అమ్మకి. ఆ అమ్మాయి ఏడ్చేస్తున్నది ఏడుపు తప్పితే ఆ అమ్మాయికి ఇంకేమీలేదు. ఏమి ఏడుపు అది! 'అమ్మ దగ్గరకు

వచ్చాను. అమ్మ నాకు తన ఉత్సవాన్ని చూపిస్తున్నది. నేనెంత అదృష్టవంతురాలిని! యోగ్యతలేకపోయినా యోగ్యత కలిగించింది నాకు' అని ఆనందపడుతున్నది. తెల్లవారుఝామున అమ్మకు పాలాభిషేకం చేశారు. పాలాభిషేకం అయిన తర్వాత శృంగారం అలంకారం చేశారు. ఉయ్యాలలో కూర్చోపెట్టి అమ్మను ఊపుతున్నారు. ఉయ్యాల పాటలు పాడుతున్నారు అందరూ ఆనందంగా. ఆ అమ్మాయికూడా చాలా ఆనందంతో ఆ దృశ్యం అంతా చూసింది. ఆ దృశ్యం చూచి ఆనందపడిపోయింది. 'నాకు ఎంత భాగ్యం కలిగింది! నేను నోచుకోలేకపోతానే, నేను చూడలేకపోతానే' అని బాధపడుతున్న అమ్మాయిని తల్లే స్వయంగా వచ్చి తన పుట్టినరోజు చూపించింది. చూడండి ఎంత అహేతుకమైన ప్రేమో!

కారణంలేదు, ఈమెను ఉద్ధరించాలి అని కారణంలేదు. తనకోసం తపనపడుతున్నది పాపం! ఈ అమ్మాయికి చూపించాలి అని తీసుకుని వెళ్ళింది తల్లి. ఉత్సవం అంతా అయిపోయిన తర్వాత మళ్ళీ తీసుకునివచ్చింది. ఆమేడమీద కూర్చోబెట్టింది. అప్పుడు ఆ అమ్మాయి ఏడ్చేసింది. 'ఎంత ప్రేమ అమ్మా నీది! ఎంత ప్రేమ తల్లీ నీ ప్రేమ! అనంతమైన ప్రేమనాపైన చూపించావమ్మా! నీ పుట్టిన రోజు దృశ్యాన్ని నాకు చూపించావు తల్లీ!' అని ఆ చిన్నపిల్ల ఏడ్చేసింది. కాబట్టి హేతువు లేదు, కారణం ఉండదు. ఎప్పుడైతే అమ్మతో అలాంటి లింకు మనం పెట్టుకున్నామో నిరంతరం తను చూసుకుంటూ ఉంటుందిట. "భక్తానుగ్రహకాతరామ్" భక్తులను అనుగ్రహించటానికి తాను ఎదురుచూ...స్తూ ఉంటుందిట తల్లి. 'ఎవరు ఉన్నారు నావాళ్ళు, ఎవరు నాకోసం ఏడుస్తున్నారు, ఎవరు నాకోసం ఉన్నారు' అని అలా ఎదురుచూస్తూ ఉంటుందట. కాబట్టి అమ్మ ప్రేమ అలాంటిది! అలాంటి అమ్మతోటి మనం లింకు పెట్టుకుందాం. ఆ లింకు

మంచిది! ఈ లింకులన్నీ శాశ్వతంకాదు. ఎప్పటికైనా ఈ లింకులు అన్నీ విడిపోతాయి. ఎన్నాళ్లో, ఎన్ని జన్మలో అయిపోయినాయి. ఇలాంటి తల్లిద్రండులు ఎంత మందో ఉన్నారు. ఇలాంటి అన్నదమ్ములు ఎంతోమంది వచ్చారు. ఇలాంటి జన్మలు ఎన్నో వచ్చాయి మనకి. ఈ జన్మకి ఈ తల్లిదండ్రులు, ఈ జన్మకి ఈ అన్నదమ్ములు. కానీ ఇలాంటి అన్నదమ్ములు, ఇలాంటి తల్లిదండ్రులు ఎన్నో జన్మల నుంచి మనకు వేరువేరుగా ఎంతోమంది అయినారు.

కాబట్టి మనం అమ్మతో పెట్టుకుంటే ఈ జన్మలు, ఈ కర్మలు, ఈ బంధాలు ఇవన్నీ మనకు ఉండవు. అమ్మ తెంచేస్తుంది. తెంచేస్తుంది. అలాంటి శక్తి ఉన్న తల్లి! కాబట్టి మనం ఇలాంటి శక్తివంతమైన అమ్మ, అలాంటి ప్రేమమయి అయిన అమ్మతో లింకు పెట్టుకుందాము. ఆ లింకు శాశ్వతమైన లింకు! ఆ లింకు విడిపోదు. ఒక్కసారి అమ్మచూపు పడిందంటే ఆ అమ్మ చూపులోనుంచి విడిపోలేము. వాళ్ళు ఎప్పుడూ చూసుకుంటూ ఉంటారు. కాబట్టి అమ్మతో లింకు పెట్టుకోవటానికి ప్రయత్నం చేద్దాం. ప్రతిరోజూ మనం అవకాశాన్ని బట్టి ధ్యానం చేసుకుందాం. ఆ ధ్యానం విడువక్కరలేదు, మంత్రంవద్దు. ఇన్ని లక్షలు మంత్రం చేస్తాను. ఈ మాల పట్టుకుంటాను – ఇవన్నీ అక్కరలేదు. 'అమ్మా! నీతోనే నేనుంటానమ్మా! నీచింతనలోనే ఉంటానమ్మా నేను. నీవు వినా నాకు జగత్తులో ఎవ్వరూలేరు' అనే భావంతో జీవించు. ఆ భావంతోనే అమ్మను చింతన చేసుకో. అమ్మ చింతన అలాంటిది. ఎలాగైతే తాబేలు నీళ్ళల్లో ఉండి, ఒడ్డున ఉండేపిల్లలను చింతన చేసుకుంటుంది. ఆ పిల్లలు పెద్దవి అయిపోతాయిట, అవి పెరుగుతూ ఉంటాయిట. కాబట్టి చింతనలో చాలా విశేషం ఉన్నది అని చెప్పారు.

అందుకనే శ్రవణ, మనన, నిధిధ్యాస, ధారణ, ధ్యాన, సమాధి అన్నారు. శ్రవణం – వినాలి! అది మననంచేసుకోవాలి, మననం! అది repeat చేసుకోవాలి. అదిచింతన చేసుకోవాలి. దానిని మనం అనుభవంలోకి తెచ్చుకోవాలి. కాబట్టి అమ్మ మంత్రం ఎంత హైయెస్టో, అమ్మ నామం ఎంత హైయెస్టో, అమ్మ ధామం ఎంత హైయెస్టో! అమ్మతో లింకు పెట్టుకోవాలి. అదే ప్రబోధానంద సరస్వతిగారు 3 points చెప్పారు. 1) రాధాచరణనిష్ఠ, 2) రాధాదేవి నిరంతరం నడయాడే బృందావననిష్ఠ, 3) రాధానామనిష్ఠ. అమ్మనామనిష్ఠ! ఈ మూడూ చాలా విశేషమైనవి అని చెప్పారు ప్రబోధానంద సరస్వతిగారు. నిజంగా ఆధామం, ఆధామంలో ఉండే అమ్మ, ఆ అమ్మనామం మూడు ఎంత గొప్పవో! బృందావనమే highest అని చెప్పారు. అందుకనే నాన్నగారు కూడా ఒక పాట వ్రాశారు "బృందావనమే నీ రూపంబు కాదే" అని. అమ్మ రూపం బృందావనం! అందుకనే కన్నయ్యకు ప్రీతి! కన్నయ్యకు బృందావనం అంటే అందుకే ప్రీతి అమ్మరూపం అని. అమ్మ ఎందుకు అలా రూపధారణ చేసుకున్నది అంటే కన్నయ్యప్రీతి కోసం! కన్నయ్యకు ఇష్టంకాబట్టి ఆ రూప ధారణ చేసుకున్నది. అక్కడ ఉండే వృక్షాలు, పర్వతాలు, అక్కడ ఉండే పొదలు అవన్నీ complete అమ్మ ప్రేమ భావంతో నిండిపోయి ఉన్నాయిట ప్రబోధానంద సరస్వతిగారు వ్రాశారు. సామాన్యం కాదు. అలా ప్రీతిగా అమ్మ భావంతో నిండిపోయినాయిట. అక్కడ చెట్టుచెట్టుకాదు, పుట్టపుట్టకాదు, అవన్నీ అమ్మ భావంతో ఉన్నాయిట. ఎందుకంటే అమ్మ ఆ రూపంతో ఉన్నదన్నమాట! అమ్మ ఆ రూపధారణ చేసుకున్నదిట. ఎంత విచిత్రమో చూడండి!

ఒక వృక్షం ఉన్నది. ఆ వృక్షానికి లతలు తీగెలు ఉన్నాయి. అవి అమ్మ చేతులట. ఆ పువ్వులున్నాయిట అవి అమ్మ చేతులట. ఆ పువ్వులున్నాయిట

అవి అమ్మతలలో ఉండే పువ్వులట. ఆ మొదలులో ఉన్నాయి అవి అమ్మ శరీరం యొక్క పాదాలుట. ఇలా ఆ వృక్షానికి అమ్మతో లింకుట. అమ్మ యొక్క రూపాన్ని తలపింప చేస్తుందట. కాబట్టి 'బృందావనం అమ్మ యొక్క స్వరూపం! ఆ బృందావనాన్ని ఆశ్రయించు. బృందావనంలో ఉండే అమ్మపాదాలను ఆశ్రయించు. అమ్మ నామాన్ని ఆశ్రయించు. ఈ మూడు highest' అని చెప్పారు. మనం కూడా ఇంట్లో కూర్చున్నా బృందావనాన్ని చింతన చేసుకుంటూ, బృందావనంలో ఏదో ఒక Place – నిధివనమో. సేవాకుంజో, నాన్నగారి ఆశ్రమమో ఎక్కడో ఒక Place మనసులోనే మనం నిర్ణయం చేసుకుని; 'అక్కడ కూర్చున్నాను, అమ్మ తిరుగాడుతూ ఉన్న Place ఇది, అమ్మ ఉన్న Place' అని ఆ భావంతో అమ్మతో లింకుతో ధ్యానం చేసుకోండి. ఈ అవకాశం మనకు దొరకదు. ఇంకకొన్ని కోట్ల జన్మలు ఎత్తినా కూడా రాధాతత్వము యొక్క విషయము ఎవరికీ తెలియదు. ఒక వేళ రాధాతత్వాన్ని గురించి ఉపన్యాసాలు ఎన్ని చెప్పినా దానిలోపల ఉండే రుచిని ఎరుగలేరు, తెలియదు. 'నేను రాధాదేవిని గురించి research చేస్తున్నానండి, వాటిని గురించి research చేస్తున్నాం'. రీసెర్చే కానీ రీసెర్చ్ లోపల ఉండే భావం touch కాదు. అది చాలా కష్టం! ఎంత రీసెర్చ్ చేసినా లోపల అసలు అంతర్భావం వాళ్ళకు తెలియదు. అంతర్భావం తెలియాలంటే బ్రహ్మదేవుడికే తెలియదు అన్నారు. ఆదిశేషుడికే తెలియదు అన్నారు. ఎవరికీ తెలియదని చెప్పారు. అలాంటి అమ్మ యొక్క దివ్యమైనతత్వం! ఆ తత్వాన్ని నాన్నగారు మనందరికీ అందించారు. ఆ అమ్మని ఈ విధంగా ధ్యానం చేసుకోండమ్మా, ఎప్పుడూ మీకు తోడుగా ఉంటుంది. ప్రతిక్షణం తోడుగా ఉంటుంది. నిజమే! అది అనుభవంలోనుంచి వస్తేనే దానిని నమ్మగలుగుతాం, లేకపోతే నమ్మలేము. అనుక్షణం అమ్మతో లింకు ఉంటే కూర్చొని పూజ

చేయనక్కరలేదు. అమ్మకు ఇన్ని పూలు పెట్టి, కొబ్బరికాయలు కొట్టి, పండ్లుపెట్టి, మిఠాయిలు పెట్టి చేయనక్కరలేదు. భావంతో link చేసుకో. ఆ భావం కుదరనప్పుడు మనం సాకారరూపాన్ని అర్చించాలి. ఆ రూపాన్ని అర్చిస్తూ ఉంటే ఆ రూపం ద్వారా భావానికి అందిస్తూ ఉంటుంది. ఆ రూపం భావానికి అందిస్తుంది.

కాబట్టి మనం అమ్మతో లింకు పెట్టుకుందాం. అమ్మతో లింకు పెట్టుకుని మనం ధ్యానం చేసుకుందాం రేపు తెల్లవారుఝాము నుంచి. రోజూ ఒక 10 ని॥లు సాయంత్రం 7 గం॥ల నుంచి అమ్మను గురించి, ధ్యానాన్ని గురించి చెప్పుకుందాం. మీరు ఈ విధంగా ధ్యానం చేసుకోండి. “అమ్మ ఉన్నది. అమ్మ చూస్తూ ఉన్నది. అమ్మ చూపులో ఉన్నాను. నేను అమ్మను చూడలేకపోయినా నా తల్లి చూస్తున్నది. అమ్మను పిలుస్తున్నాను. ‘రాధే రాధే రాధే రాధే’ అని అమ్మను పిలుస్తున్నాను” అనే భావంతో కూర్చోండి. ఆ భావం అలా Continue గా ఉంటుంది. విషయాదులు వస్తాయి ఎలాంటి వాళ్ళకి అయినా. ‘ఎట్టిమౌనులకైనా ఎట్టియోగులకైనా గోచరింపని దేవి వచ్చినావా తల్లీ!’ ఎంతోమంది యోగులు, మౌనులు అమ్మను గురించి చేశారు. వాళ్ళకు గోచరించలేదు. వాళ్ళకు అది తెలియలేదు, కనిపించలేదు. అలాంటి కనిపించని అమ్మని మనకు నాన్నగారు అరటిపండు ఒలిచినట్లుగా అందించారు.

కాబట్టి అలాంటి అమ్మ మనకు దొరికిందంటే ఎంత అదృష్టం! ఎవరికీ, ఈ రాధాతత్వం ప్రపంచంలో ఎవరికీ తెలియదు. కేవలం బృందావనంలో ఉండే మహాత్ములకే ఈ తత్వంతెలుసు. ఈ తత్వ భావం తెలుసు. నాన్న అమ్మ దగ్గరనుండి వచ్చారు కాబట్టి, నాన్నకు తెలుసుకాబట్టి మనకు చెప్పగలిగారు. ఇంకా ఎంత ఉన్నదో నాన్నగారి దగ్గర! మనకు చెప్పింది

ఇంతే! ఆ ఇంతను మనం చాలా వృద్ధి చేసుకోవాలి. కాబట్టి మనం ధ్యానానికి రేపటి నుండి కూర్చొని, అమ్మ భావంతో ఫీల్ ఔతూ, అమ్మను స్మరిస్తూ, 'నాతల్లి ఉన్నది. నేను ఒంటరిగాలేను.' నిజమే ఒంటరిగా లేము అమ్మతో ఉన్నాము. ఒంటరి అనే ఫీలింగ్ వచ్చింది అంటే జగత్తుతో మనం తాదాత్మ్యం చెందినట్లే. అమ్మతో ఉన్నాను అని అంటే జగత్తు అంతా నీతో ఉన్నట్లే. అది ఒక్కటే! అమ్మతో లింకు అలాంటి highest అని చెప్పారు. కాబట్టి మనము ధ్యానానికి రేపటి నుండి అమ్మతో లింకు పెట్టుకుని ఈ ఏడు రోజులు చేసుకుందాం. ఈ ఏడు రోజులే కాదు; ప్రతీరోజూ, ప్రతిరోజూ అమ్మతో లింకుతో, ప్రతిక్షణం అనుక్షణం అమ్మతో లింకు పెట్టుకుని మనం జీవితంలో సాధన చేసుకోవాలి. నిజంగా తల్లి అనుగ్రహిస్తుంది. ఆ అనుగ్రహానికి మనం పాత్రులం అవుదాము. నాన్నగారిచ్చిన ఈ గొప్ప అవకాశాన్ని మనం ధ్యానం చేసుకుని తప్పకుండా అమ్మ ప్రేమను పొందాలని నాన్నగారిని ప్రార్థిస్తున్నాను.

– o –

# సేవ - స్మృతి

పరమపూజ్యులైన నాన్నగారి దివ్య ఆశీస్సులతో మనం 20వ రాధాభావ ధ్యానయోగ సప్తాహం! కరోనా వలన రెండు సప్తాహాలు ఇలా అయిపోయినాయి. ఇది 20వ సప్తాహం! ఈ రోజు మొదటి రోజు. నాన్న యొక్క దివ్య ఆశీస్సులతో మనం ధ్యానానికి అందరమూ కూర్చోవటానికి అవకాశం దొరికింది. ధ్యానం చాలా విశేషమైనది. ఈ ధ్యానం కూడాను గొప్పసేవతో కూడా కూడి ఉంటే ఇంకా చాలా బాగుంటుంది అన్నారు నాన్నగారు. సేవ చాలా important అని చెప్పారు. సేవలో పూర్తి ధ్యానం ఉంటుంది. పూర్తి స్మృతి ఉంటుంది. పూర్తిగా దానికి అంకితమైపోయి ఉంటారు సేవలో. ధ్యానంలో మనం కూర్చున్నప్పుడే అది touch అవుతూ ఉంటుంది. తర్వాత మళ్ళీ విషయాదులలోకి వచ్చేస్తూ ఉంటాము. సేవలో అలా ఉండదు. సేవ చాలా highest అని చెప్పారు. ఆ సేవ చేయటానికి అమ్మ అనుగ్రహం కూడా ఉండాలి!

శ్యామానంద ఆసేవలో పూర్తిగా నిమగ్నమైపోయి వాళ్ళ సుఖం కోసం తాను అమ్మసేవ చేస్తూ కుంజసేవ చేస్తున్నాడు. అంటే 24 గం॥లు అదే స్మృతి ఉంటుంది. 'అమ్మ, కన్నయ్య వస్తారు. వాళ్ళకు చాలా శుభ్రంగా ఉండాలి. ఇదంతా శుభ్రం చేసి నీళ్ళు చల్లి, చక్కగా అక్కడ cleaning చేసి, చెట్లకు నీళ్ళుపోసి ఆచెట్లు పువ్వులన్నీ పూస్తే అమ్మకు, కన్నయ్యకు ఇష్టం!' ఇలా పూర్తిగా ఆ స్మృతితో అక్కడ కుంజసేవ చేస్తున్నాడు. అది పూర్తిగా నిమగ్నమైపోయి ఆ స్మృతి కలిగి ఉంటుంది. అలాగే ధ్యానంలో కూడా ఆ స్మృతి చాలా విశేషం! "అమ్మ నా దగ్గర ఉన్నది. నన్ను చూస్తూ ఉన్నది.

అమ్మ చూపులో ఉన్నాను నేను. అమ్మను పిలుస్తున్నాను. అమ్మ వింటున్నది" అనే పూర్తి భావంతో మనం ధ్యానం చేయాలి. ఆ ధ్యానంలో అనేకమైన ఆలోచనలతో కూడుకొని అనుకుంటే కాదు, ఆలోచనా రహితమైన మనసులో ఈ భావం కలిగి ఉండాలి. అప్పుడే అది అమ్మకు చేరుతుంది. ఆలోచన ఉండకూడదు. ఆలోచిస్తూ మనం అనుకుంటే కాదు. ఆలోచన లేకుండా, అనుభూతితోటి ఆ స్మృతిలో ఉండాలి అని చెప్పారు. చాలా కష్టం, ఎంత కష్టమో! అయినప్పటికీ ప్రయత్నం చేయాలి. మనం కూర్చోగానే పిలవని పేరంటం ముత్తయిదువుల్లాగా వస్తూ ఉంటాయి ఆలోచనలు అన్నీ. ఒకదాని వెంబడి ఒకటి రీలు తిరిగిపోతూ ఉంటుంది సినిమారీలులాగా ఆలోచనలన్నీ. వాటిని తట్టుకోలేక, కూర్చోలేక లేచి వెళ్ళిపోతూ ఉంటాము. అసలైన అమ్మ స్మృతిని మరచిపోయి, ఆ స్మృతి చేసుకోవటానికి అశక్తులం అయిపోయి, ఈ ఆలోచనలకు బద్ధులమైపోయి అక్కడ కూర్చున్న వాళ్ళం లేచి వెళ్ళిపోతూంటాము. అం...త బలీయమైనవి అన్న మాట ఆ ఆలోచనలు! ఆలోచనలు ఆ విధంగా లాగేసుకుంటూ ఉంటాయి.

కానీ పూర్తిగా అమ్మతో link చేసుకున్న వాడికి ఎంత ఆలోచన వచ్చినప్పటికీ దానిని avoid చేస్తూ ఉంటాడు. 'ఛీ నాకు వద్దు. నాకు దీనితో పనిలేదు. నాకు అమ్మతోనే లింకు' అనే భావంతో కూర్చుంటాడు. అలా భగవచ్చింతన, భగవత్ జిజ్ఞాస, భగవత్ స్మృతి కలిగి ఉండాలి. ఆ కలిగి ఉంటే అమ్మ చక్కగా మనలను చూసుకుంటూ ఉంటుంది. భాగవతంలో రంతిదేవుడి కథ వస్తుంది. రంతిదేవుడు చాలా గొప్ప మహనీయుడు! భార్య, పిల్లలు అందరూ ఉన్నారు. కానీ నిరంతరం భగవంతుని యొక్క స్మృతి

కలిగి ఉన్నాడు ఆ రంతిదేవుడు. నిరంతరం ఆయనకి అదే స్మృతి! భార్య ఉన్నా, పిల్లలు ఉన్నా, ఎవరు ఉన్నా తన మనసును ఆ భగవత్ చింతనతో గడుపుతున్నాడు. అతనికి పాపం 3, 4 రోజులు అయింది భోజనం లేక. ఎవరో ఇంత భోజనం ఇచ్చారు. ఆ భోజనం, మంచినీళ్ళు అన్నీ పెట్టుకున్నారు. అలా పెట్టుకుని సరీగ్గా మంచినీళ్ళు తాగుదామని అనుకునేటప్పటికే 'నాకు దాహం వేస్తున్నద'ని ఒకతను వచ్చాడు. మంచినీళ్ళు ఇచ్చారు. 'మాకు మూడు రోజులయింది, ఆకలి వేస్తున్నది నాయనా, అన్నం పెట్టండి' అన్నారు. భార్య పిల్లలు ఎవ్వరికీ పెట్టకుండా, తాను కూడా తినకుండా ఆ వచ్చినతనికి ఇచ్చారు. అంటే పూర్తిగా 'వచ్చినవాడు నా స్వామి! నా స్వామి స్వయంగా అడుగుతున్నప్పుడు నేను ఇవ్వకపోతే ఎలాగు ? నా స్వామియే, ఆయన సుఖంగా ఉండి, ఆయనకు తృప్తిగా ఉంటే చాలు' అని ఆయనకు లోపల పూర్తిగా ఆ స్మృతి ఉన్నది. ఆ భోజనం ఇచ్చేశాడు. వీళ్ళు పిల్లలు, తాను ఆకలితో ఉన్నారు. ఉన్నప్పటికీ కూడా వాళ్ళ సుఖాన్ని వాళ్ళు మరచిపోయి, ఆ వచ్చిన వ్యక్తి ఆయనే భగవంతుడు అనుకున్నారు. ఈయన యొక్క త్యాగభక్తికి, తనయందు నిరంతర స్మృతి కలిగినందుకు ఆయన సంతసించాడు. రంతిదేవుడికి తగిన స్థితి ఇచ్చాడన్నమాట!

కాబట్టి లోపల నీవు ఎంత తింటున్నావు, నీవు ఏం చేస్తున్నావుకాదు, నీవు ఎంత పెడుతున్నావు ? ఎంత తృప్తి తీరగా పెడుతున్నావు అది చూస్తాడు. కాబట్టి భగవంతుడి యొక్క తృప్తిని మన తృప్తిగా భావించుకోవాలి అని చెప్పారు నాన్న. నాన్న రాసిన 'ఆత్మార్పణమె' పాటలో ఉన్నది 'దేవి ప్రీతియె సదా నీ ప్రీతిగ నెంచి' – అమ్మకు ఏది ప్రీతియో ఆప్రీతి ప్రకారంగా జీవించాలి.

ఆ ప్రీతి ప్రకారంగా జీవిస్తూ అమ్మను నిరంతరం స్మృతిలో ఉంచుకోవాలి అన్నారు. అమ్మకు ఏది ప్రీతియో ఆ ప్రీతి ప్రకారంగా జీవించటమే మన ధ్యేయం! నాప్రీతిగా నేను జీవిస్తానంటే అమ్మకు చాలా దూరమైపోతారు. నాప్రీతి కోసం కాదు అమ్మ ప్రీతి కోసం! ఆ విధమైన స్మృతి కలిగి ఉంటే మనకు ధ్యానం బాగా సాగుతుంది.

కాబట్టి ధ్యానానికి ఆలోచనలు ఉండకూడదు. అమ్మ ప్రీతి ఏదో ఆ ప్రీతి ప్రకారంగా మనం జీవిస్తూ ఉండాలి. ఆ ప్రీతి ప్రకారంగా మనం ఈ బాహ్య ప్రపంచంలో సంచరిస్తూ ఉండాలి. ఎందుకంటే నటన కాదు. నటనతో ఉంటే దానికి మనం దూరమైపోతాము. నటనవద్దు, పూర్తిగా నీవు మనసు అమ్మకు అంకితంచేయి. నీకు అమ్మ అ...న్ని వనరులు కూరుస్తుంది. నీకు అన్ని అవకాశాలు ఇస్తుంది. ఆ అవకాశాన్ని మనం దుర్వినియోగం చేసుకోకూడదు. తల్లి ఇచ్చిన పాత్ర కాబట్టి ఆ భావంతో మనం చేస్తూ ఉండాలి. ఒకటి ధ్యానానికి మనసుకు ఏ అడ్డంకులు లేకుండా మనం కూర్చోవాలి. అదే నాన్నగారు చెప్పారు ధ్యానానికి పెద్ద అడ్డుగోడట నాది, నేను అనేది. అది ఎంత పెద్ద ఎత్తు ఉన్నదో తెలియదు. కానీ ఆ అడ్డుగోడ పోవాలి  అంటే, తొలగిపోవాలి అంటే అమ్మనే స్మృతిలో పెట్టుకుంటే ఆ అడ్డుగోడ వెళ్ళిపోతుంది. అందుకనే చెప్పారు నాన్నగారు 'అహంకారమును త్యాగము చేసి అమ్మప్రీతియె నీదు సుఖంబని అన్ని రూపముల దేవిని గాంచక సర్వేశ్వరి కృపరాదుకదా'. అంటే దానిని అమ్మకు త్యాగంచేయాలి. 'నేను, నాది' అనేది త్యాగం అయితేనే కాని అమ్మ వచ్చి కూర్చోదు. అమ్మ కూర్చుంటే ఇంక మనకు ఆస్మృతే ఉండదు. అది పోవాలి, ఇది రావాలి. ఎలాగు ?

పిచ్చి కుదిరితేకానీ పెళ్ళి కుదరదు అని అంటారు. అది పోవటం ఎలాగు ? ఇది రావటం ఎలాగు ? కేవలం నిరీక్షణ! అమ్మకోసం ఆ దీనత్వంగా నిరీక్షణతో ఉంటే తప్పకుండా అమ్మ మనలోపల ఉన్న లోపాలను తీసేస్తుంది. ఆ లోపాలన్నీ అప్పుడు తొలగిపోతాయి. అమ్మతో అంటిపెట్టుకుంటే ఆలోపాలన్నీ మనకు అడ్డురావు. అలా త్యాగంతో ఉండాలి అని చెప్పారు. ఆ స్మృతి కలిగి ఉండాలి అనిచెప్పారు. కాబట్టి సేవ అనేది highest! ఆ సేవలో స్మృతి ఉంటుంది. ఇది చాలా important అని చెప్పారు.

కాబట్టి ఈ లోపల ఉండే కోరికలు, లోపల ఉండే ఆలోచనలు వీటి అన్నిటిని మనకు సాధ్యమైనంత వరకు avoid చేస్తూండాలి. అది మన ప్రబోధానంద సరస్వతిగారు చెప్పారు. 'మనలోపల ఉన్నవన్నీ పోవటానికి బయట ఏది విన్నా చెవిటివాడిలాగా ఉండు. బయట ఏది మాట్లాడాలన్నా మూగవాడిలాగా ఉండు, బయట ఎలాంటివి జరుగుతున్నా గుడ్డివాడిలాగా ప్రవర్తించు.' అంటే లోపలకు వీటన్నింటిని తీసుకోకుండా ఆ మనస్సును లోపల control చేసుకోమని చెప్పారు ఆయన. మూగవాడిలాగా ఉండు, గుడ్డివాడిలాగా ఉండు, చెవిటి వాడిలాగా ఉండు. ఈ విషయాదులను లోపలకు తీసుకోవద్దు. కనిపిస్తున్నా కూడా నీవు అమ్మ దగ్గరకు వెళ్ళిపో. ఇక అక్కడ ఉండదు. ఎలాగయ్యా అంటే నాన్నగారు చెప్పారు. నాన్నగారి గురువుగారు సిద్ధారూఢ స్వాములవారు శివపంచాక్షరి ఇచ్చారు. ఆయన చిన్నపిల్లవాడిగా ఉన్నారు. కళ్ళు తెరిచే ఉన్నాడు. ఆయన నడుస్తూ ఉన్నాడు. ఆ కొలిమిదగ్గర ఉన్న అతను "నా ఎద్దుపోయింది. నువ్వు ఏమన్నా చూశావా" అని అడిగాడు ఒక రైతు. చూడలేదని చెప్పలేదు, చూశానని చెప్పలేదు.

ఆ మాట వినబడలేదు. కళ్ళు మాత్రం తెరిచే ఉన్నాయి. చెవులు మటుకు ఉన్నాయి, నోరు ఉన్నది. నోరు చెప్పలేదు, కళ్ళకు కనబడలేదు. కళ్ళు తెరిచి ఉన్నా కూడా తన మనసు, తన యొక్క చిత్తము తన ఇష్టయందు లగ్నం అయి ఉన్నది. చెవులకు వినపడదు, కళ్ళకు కనపడదు, నోటికి తెలియదు చెప్పటానికి. ఆస్థితిలో ఉన్నాడు ఆయన చిన్నపిల్లవాడుగా ఉన్నప్పుడు. వాడికి (ఆ రైతుకు) కోపం వచ్చి అక్కడ కొలిమి దగ్గర నిప్పు తీసుకువచ్చి అతని నెత్తి మీద పోశాడు. దానికి కూడా అతను చలించలేదు. ఆ స్థితిలో ఉన్నప్పుడు అతనికి నిప్పు, నీళ్ళు అనేది ఏమీ తెలియదు. కానీ నిప్పు సహజమైన గుణం కాలిపోయి రక్తం కారింది. అతనికి చాలా బాధ పుట్టింది. అయినప్పటికీ కూడా శరీరంతో తాదాత్మ్యం చెందలేదు అతను. అలాంటి స్థితిని పొందాడు ఆయన!

కాబట్టి మనసును ఆవిధమైన control లో పెట్టుకుంటేనే కానీ, అమ్మ స్మృతి కలిగి ఉంటేనే కానీ అమ్మతో link ఏర్పడదు. అమ్మతో link ఏర్పడటం చాలా కష్టం! నిజంగా అమ్మతో link ఏర్పడితే మనం బ్రతకలేము. నాన్న చెప్పారు "క్షణమైన నిను విడచి బ్రతుకలేనే ప్రియా" అన్నారు. 'నీతోడు క్షణం కూడా విడిచిపెట్టి నేనుండలేనమ్మా' అని అన్నారు నాన్న. ఆ యొక్క స్థితి అలా ఉంటుంది. కాబట్టి ధ్యానానికి కూడా మనం కూర్చున్నప్పుడు ఆలోచనా రహితమైన మనసుతో అమ్మను మనసు యందు లగ్నం చేసుకుని, మనసులో స్థిరం చేసుకుని, ఆ భావాన్ని feel ఔతూ; "అమ్మ ఉన్నది, చూస్తూ ఉన్నది, రాధే రాధే రాధే అని అమ్మను పిలుస్తున్నాను, అమ్మ వింటున్నది, అమ్మ కరుణామయి" అనే భావాన్ని లోపల స్థిరం చేసుకోవాలి. ఇది

continue గా సాగుతూ ఉంటే ఒక అతీంద్రియమైన ఆనందం మన లోపల touch అవుతుంది. ఆ ఆనందం touch అయినప్పుడు ధ్యానంలో నుండి ఎంతసేపటికీ లేవాలనిపించదు. ఎంతసేపు కూర్చున్నామా, ఎంతసేపు ఉన్నామా అనేది అనిపించదు అసలు. అలా ధ్యానానికి చేసుకోవటం బృందావనంలో ఉండే మహాత్ములందరూ ఆవిధంగా చేసుకుంటూ ఉంటారు. వారికి కేవలం రాధాకృష్ణులు వినా రెండవ దృశ్యం వారికి లేదు, రెండవ ఆలోచనలేదు, రెండవ స్మృతిలేదు వాళ్ళకు. అలాంటి అనన్యమైన భావంతో, అనన్యమైన నిష్ఠతో, అనన్యమైన స్థితిలో వాళ్ళు మహాత్ములందరూ ఉన్నారు. అమ్మ కనిపించకపోతే బ్రతకలేరు. అమ్మ యొక్క చింతన లేకపోతే బ్రతకలేరు. అలాంటి స్థితిలో బృందావన మహాత్ములందరూ రాధాదేవిని, కన్నయ్యను మనసులో చింతన చేసుకుంటూ; పూర్తిగా వాళ్ళ దివ్యలీలలను అనుభూతి పొందుతూ ఉండేవారు.

మనం కూడా అదే స్థితిగా అదే స్మృతిలో ధ్యానం చేసుకుంటూ ఉంటే ఆ దివ్యలీలలన్నీ మనకు కూడా స్ఫురిస్తూ ఉంటాయి. మనకుకూడా అనుభూతిలోకి వస్తాయి. కానీ ఎప్పుడు ? ఈ 'నేను' అనే దేహం ఇక్కడ కూర్చున్నది, ఇలా ఉన్నది, ఇక్కడ కూర్చున్నాను, కూర్చోవటానికి సిద్ధం చేసుకుంటున్నాను అనే feeling ఆవిధమైన భావం ఉండకూడదు. దేహాత్మభావం అదే పెద్ద అడ్డుగోడ అని అన్నారు నాన్న. ఆ భావం లేనప్పుడు ఆ దివ్యలీలలన్నీ మనకు స్ఫురిస్తాయి. ఆ భావంలో అనుభూతిగా వస్తూ ఉంటాయి. కాబట్టి ధ్యానానికి కేవలం అమ్మతో లింకు! 'అమ్మ ఉన్నది, అమ్మ చూస్తూ ఉన్నది, అమ్మ చూపులో ఉన్నాను, అమ్మను పిలుస్తున్నాను' అనే

భావంతో ధ్యానం చేసుకోవటం highest అని చెప్పారు. అవకాశం దొరికింది, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుందాం. ఇంటి దగ్గర కూర్చొని చేసుకున్నా కూడా limit గా ఒక గంటే, ఒక్క అర గంటే, రెండు గంటలే, మూడు గంటలే అని పెట్టుకోవద్దు. మీ అవకాశం కొద్దీ ఎన్ని గంటలున్నా అది చాలా మంచిదని చెప్పారు. కాబట్టి అందరమూ రోజూ అమ్మ చింతన విడవకుండా ఈ ఏడు రోజులు సాధ్యమైనంత వరకు రోజుకు 8 గం॥లు చొప్పున చేసేటట్లుగా ప్రయత్నం చేయండి. ఎందుకంటే బృందావనం వచ్చి ఇక్కడ చేసుకున్నారు. దీనిని ఇలాగే maintain చేస్తూ ఉండాలి. ఒక్కరోజు కాదు, రెండు రోజులు కాదు, ప్రతిరోజు మనం 8 గం॥లు చేయలేకపోయినా కొన్ని గంటలు అమ్మకు కేటాయించి మనం ధ్యానం చేసుకోవటానికి ప్రయత్నం చేద్దాం! కానీ తర్వాత కూడా కూర్చున్నా, నిల్చున్నా, పడుకున్నా ఏం చేస్తున్నా అమ్మ మన దగ్గర ఉన్నది, చూస్తూ ఉన్నది, అమ్మచూపులో ఉన్నాము. నిజంగా ఆ భావమే కనక ఉంటే మనం ఏతప్పూ చేయలేము. ఏదీ చేయలేము, ఏదీ మాట్లాడలేము. ఎలాంటి విషయాలలోకి మనం తలదూర్చలేము. ఆ భావం అలాంటి highest అని చెప్పారు. కాబట్టి నాన్న దయవలన మనందరికీ ఈ అవకాశం ఇచ్చారు. ఈ ఏడు రోజులు మనం అమ్మ ధ్యానం, అమ్మతో, అమ్మలింకుతో, అమ్మ చూపులో, అమ్మ భావంలో ధ్యానం చేసుకుందాము!

- o -

# భావస్థితి

పరమపూజ్యులైన నాన్నగారి దివ్య ఆశీస్సులతో మనం ఈ రోజు 20వ రాధాభావ ధ్యానయోగ సప్తాహం, 2వ రోజు. నాన్నగారు మనకు ఇచ్చిన అవకాశాన్ని మనం సద్వినియోగం చేసుకోవాలి!

ధ్యానం వలన మనసు ప్రశాంతత, అమ్మతో లింకు, జీవితం విచిత్రమైన బాణిలో అమ్మ మలచుకుంటుంది. ధ్యానం అలాంటిదని చెప్పారు నాన్నగారు. 'నా జీవితం నాకే తెలియదు, అమ్మే నడిపిస్తుంది నా జీవితం' అని చెప్పారు నాన్నగారు. అమ్మతో లింకు ఉంటే చాలు, జీవితం అమ్మమయం చేసుకుంటే చాలు, ఆ జీవితం అమ్మే చూసుకుంటుంది. అది ధ్యానం చాలా highest అని నాన్నగారు అనుభవించి చెప్పారు. "నాకు కళ్ళకు operation చేయాలి అని అన్నారు 20, 30 ఏళ్ళ క్రిందట. కానీ నేను ధ్యానం చేయటం వలన నాకు ఆపరేషన్ లేకుండా ఉన్నది. అమ్మ నాకు చక్కని చూపు ఇచ్చింది" అన్నారు నాన్నగారు. అంటే ఏది తన వస్తువుకు కావాలో అది అమ్మ arrangement చేస్తుంది. ఎప్పుడు ? పూర్తిగా అమ్మతో లింకు ఉన్నప్పుడే! అనేక రకాల సాధనలు ఉన్నాయి. ప్రతి సాధనను ఒక కోరికతో చేస్తున్నారు. ఇక్కడ మనకు కోరిక లేదు. ఒకటే కోరిక, అమ్మకావాలి అనే కోరిక! అమ్మ కావాలి అనే కోరిక కూడా మనకు ఏదో పొందాలి అమ్మ ద్వారా అనేది కూడా లేదు. అమ్మ నిత్యసేవలో ఏదో విధంగా అంకితం కావాలి అనే భావంతో ఉన్నాము. కోరికలేదు. అన్ని సాధనలు చేసే వాళ్ళకు కోరిక ఒకటి ఉంటుంది. ఆ కోరిక సిద్ధింప చేసుకోటానికి వాళ్ళు చేస్తూ ఉంటారు.

మనకు ఒకే ఒక కోరిక! ఏ కోరిక ? అమ్మకావాలి! అమ్మకావాలి అనే కోరిక అంత highest అని చెప్పారు నాన్న. ధ్యానానికి మనసు నిలవడానికే చేయాలి. మనసు నిలిస్తే దాని రుచి తెలుస్తుంది. మనసు నిలవకపోతే దాని రుచి తెలియదు. ఎలాంటిదంటే మనసు చాలా టక్కరిది. దానికి ఏది స్వసుఖంగా కావాలనుకుంటుందో అదే కోరుతుంది కానీ దివ్యమైన ఆ భగవంతుని వైపుకు వెళ్ళటానికి ఆ మనసు ఒప్పదు. కానీ మహాత్ముల యొక్క సాంగత్యం, లోపల పూర్వజన్మ యొక్క సుకృతం ఇవన్నీ తోడైతే అప్పుడు అమ్మ వైపుకు వెళ్ళటానికి కుదురుతుంది అన్నారు. 'నేను ధ్యానం చేస్తున్నానండీ రోజూ కూర్చుని, జపం చేస్తున్నాను, మంత్రం చేస్తున్నాను'. చేస్తున్నామేకానీ దానికి తగిన భావంలేదు. భావం ప్రధానం! నాన్నగారు అందుకే భావరూపిణి అని చెప్పారు అమ్మను. ఆవిడ భావ స్వరూపిణి! ఆవిడను భావంతోటే పొందాలి!

హితహరివంశకు అమ్మ సాక్షాత్కరించి మంత్రదీక్ష ఇచ్చింది. "అమ్మా! ఈ మంత్రం ఎలా చేయాలమ్మా ?" అని వెంటనే అడిగాడు ఆయన. "నేను నీ కుంజలో ఒక పరికరాన్ని అనే భావంతో". అంటే అమ్మకుంజలో ఒకానొక పరికరాన్ని అనే భావంతో! ఆ పరికరం ఎలాంటిదై ఉండాలి ? అమ్మ సేవకు అంకితమై ఉండి ఉండాలి. అమ్మ సేవా భావాన్ని చింతన చేస్తూ ఉండాలి ఆ పరికరం. ఆ భావంతో మంత్రం చేయమని చెప్పింది అమ్మ రాధారాణి హితహరివంశకి. ఆయన అప్పుడు అనుకున్నారు. నేను సఖిగా అయితే అమ్మ సేవలో పాల్గొనటానికి అవకాశం ఉంటుంది. సఖీ భావాన్ని పొంది అమ్మకు ఏది కావాలో ఆ సేవ నేను చేస్తూ ఉండటానికి తగిన భావాన్ని

లోపల ఏర్పరచుకున్నారు హితహరివంశులు. ఆ భావంతో అమ్మ ఇచ్చిన మంత్రాన్ని చేశారు. అమ్మ ప్రత్యక్షం అవటం ఏమిటి ? అమ్మ కనిపించింది కదా! కనిపించిన తర్వాత ఇంక వేరే ఎందుకు ? కనిపించటంకాదు. కనిపించటానికి పైన ఉన్నది ఇంకా స్థితి, భావస్థితి! భావలోకంలో ఉండే ఆ యొక్క భావసేవ వేరే! అందుకని అమ్మ ఆ సేవ అంకితం కావటానికే ఆయనకు చెప్పింది. ఏమని ? 'నీకుంజలో ఒకానొక పరికరంగా ఉన్నాను నేను' – ఆ భావంతో మంత్రం చేయమని అమ్మ చెప్పటానికి అదే కారణం. అప్పుడు ఆయనకు సఖీభావం రావటం, అమ్మ కుంజలో ఉండడం అదంతా భావపరంగానే. ఆ కుంజలో ఉండి అమ్మ యొక్క మంత్రాన్ని జపించారు. ఆ భావంతో ఆ మంత్రాన్ని ఆ సఖీభావంతో జపించటం వలన అమ్మకు బాగా ఆంతరంగిక సఖి అయిపోయింది. ఆంతరంగిక సఖీభావాన్ని ఆయన పొందారు. అప్పుడు తన దగ్గర ఉండే దివ్యమైన లీలా సుఖాన్ని అతనికి అందజేసింది అమ్మ.

కాబట్టి భావంలో అంతగొప్ప విశిష్టత ఉన్నది. అంతశక్తి ఉన్నది. అలాగే మనం మంత్రం చేసేటప్పుడు, ధ్యానం చేసేటప్పుడు అమ్మతో లింకు పెట్టుకుని అమ్మసేవకు సేవాభావంతో 'అమ్మ దగ్గర ఉన్నాను, అమ్మ సేవ చేస్తున్నాను. అమ్మకు ఈ సేవ చేస్తున్నాను, ఆ సేవ చేస్తున్నాను' అని లోపల భావాన్ని ఉంచుకుని ఆ భావపరంగా ధ్యానం చేసుకోవాలి. ఇంక మంత్రం ఉండదు, జపం ఉండదు, నామం ఉండదు, కేవలం భావం మాత్రమే ఉంటుంది. ఆ భావం అమ్మకు ప్రీతి! అందుకనే నాన్నగారు 'భావరూపిణివి నీవు, భావదేహాన్ని పొంది నీకు సేవ చేస్తానమ్మా. భక్తజన మందార ముక్తి

వలదమ్మా నాకు భావదేహము పొంది సేవింతునో తల్లీ!' భావదేహాన్ని పొంది నీకు సేవ చేస్తూ ఉంటాను'. అంటే భావదేహంతో సేవ చేయటం అనేది అది ఎంత సూక్ష్మాతి సూక్ష్మమైన విషయమో తెలియదు. అంత గొప్ప విషయం అది. ఆ భావం అంత highest అని చెప్పారు.

కాబట్టి అమ్మ మంత్రాన్ని, అమ్మ నామాన్ని, అమ్మ జపాన్ని, అమ్మ ధ్యానాన్ని భావపరంగా మలచుకోండి! ఆ భావాన్ని ఫీల్ ఔతూ ధ్యానం చేసుకోవాలి. ఎన్ని గంటలు కూర్చున్నా ఊరికే కూర్చుంటే ప్రయోజనం రాదు. ఆ భావాన్ని ఫీల్ కావాలి. కూర్చోవటం మొదట బాగా రావాలి. కూర్చొని, మనసును భావపరంగా చేసుకుంటూ అమ్మ యొక్క చింతన చేసుకోవాలి. అమ్మ ధ్యానం చేసుకోవాలి. ఇదే ఈ రోజు సందేశం!

- o -

# పంచమ పురుషార్థం

పరమపూజ్యులైన నాన్నగారి దివ్య ఆశీస్సులతో 20వ రాధాభావ ధ్యానయోగ సప్తాహం, 3వ రోజు ఈ రోజు. నాన్న యొక్క కృపచే ఎవరెవరి ఇళ్ళల్లో వాళ్ళు ధ్యానం చేసుకుంటూ ఆనందాన్ని పొందుతూ ఉంటారని అనుకుంటా!

నిజంగా బృందావన ధామం, ఆ ధామంలో చేసింది చాలా విశేషం! అయినప్పటికీ అక్కడ కూర్చొని, బృందావన ధామంలో ఏదో ఒక Place నిర్ణయం చేసుకుని ఆ Place లో కూర్చున్నాననే భావంతో చేసుకోవటం అదీ గొప్ప విషయమే! కానీ మన మనసు నిలిచి ఉండాలి. బృందావనంలో ఫలానా చోట కూర్చుని మనం ధ్యానం చేసుకుంటున్నాము అనే భావం నిలిచి ఉండాలి. ధ్యానం ఏడు రోజులు ఇక్కడ చేసినా మళ్ళీ ఇంటికి వెళ్ళి చేస్తున్నాంకదా, చేసినప్పుడు ఆ భావంతోనే బృందావనంలో ఉన్నట్లుగా చేసుకోవటం మంచిది. ఆ ధామం యొక్క విశేషం అలాంటిది. నాన్న దయ వలన మనకు రాధారాణిని, అమ్మను చూపించారు. ఎంత మందో గొప్ప గొప్ప మహాత్ములు ఉండవచ్చు. పండితులు, జ్ఞానులు, యోగులు ఎంతమందైనా ఉండవచ్చు. కానీ పంచమ పురుషార్థమైన ఈ ప్రేమతత్వం, ఇందులోకి రావటం, తెలుసుకోవటం, అనుభవించటం అనేది తెలియదు. కేవలం అమ్మ కృప వలన మాత్రమే పంచమ పురుషార్థం అయిన ఈ ప్రేమతత్వం యొక్క అనుభవం కలుగుతుంది. ప్రేమ అంటే అది దివ్యమైన అలౌకికమైన ప్రేమ! పంచమపురుషార్థం అది! ధర్మార్థ కామ మోక్షాల కంటె highest అని చెప్పారు. కరపత్రస్వామి అని ఆయనకు తాగటానికి చెంబు

చేంతాడు, తినటానికి ఏమిలేవు. ఎక్కడికి వెళ్ళితే అక్కడ మంచి నీళ్ళు తాగటం ఎక్కడికి వెళ్ళితే ఆచేతుల్లో పెట్టిన ప్రసాదాన్ని స్వీకరించటం. అలాంటి గొప్ప జ్ఞానయోగి! జ్ఞానానికి సంబంధించిన యోగి, అద్వైత యోగి! అద్వైతానికి సంబంధించిన ఆయన. ఆయనపై అమ్మ అనుగ్రహం, చూపు ఎలా కలిగిందో కానీ రాధాసుధానిధిలో ఉండే రససారాన్ని ఆయన గ్రహించి జీవుడు తరించటానికి తగిన మార్గం ఏదయ్యా అంటే ప్రేమతత్వంతో, పంచమ పురుషార్థమైన ప్రేమతత్వంతోనే జీవుడు తరించగలడని చెప్పారు ఆయన. చాలా గొప్ప మహనీయుడు ఆయన అద్వైతపరంగా. అలాంటి ఆయన రాధాసుధానిధి యొక్క సారాంశాన్ని అంతా గ్రహించి ఉపన్యాసాలు చెప్పారు. ఒక్క "యస్యాః కదాపి వసనాంచల ఖేలనోత్థ" అనే శ్లోకానికి ఒక పెద్ద ఇంత పుస్తకం రాశారు. అమ్మ యొక్క చేలాంచలం గాలికి మధుసూదనుడైన ఆయన ఎంత ఆనందంగా అనుభవించి ఆనందాన్ని అనుభవించాడో దానిని గురించి ఆయన వర్ణించి వర్ణించి వర్ణించి వర్ణించి చెప్పారు.

కాబట్టి ఆ పంచమ పురుషార్థమైన ప్రేమ చాలా విశేషమైనది. అది ఆయన అనుభవించారు. కానీ అద్వైతపరంగా చూస్తే అది అందుకోవటం చాలా కష్టం! అయినప్పటికీ ఆ మహనీయుడు అలా పొందారు. కాబట్టి మన అమ్మ ప్రేమతత్వం యొక్కసారం! అమ్మకు రూపం లేదు. ప్రేమ ఆవిడ రూపం, ప్రేమే ఆవిడ యొక్క స్వరూపం, ప్రేమే ఆవిడ యొక్క క్రియ! అలాంటి దివ్యమైనది అమ్మ రాధారాణి అంటే! అలాంటి అమ్మ భావాన్ని పొందటానికి అమ్మే ఇవ్వాలి. అదే నాన్నగారు వ్రాశారు పాట. "నీ దివ్య ధామమును చేర నీవే సాధనమమ్మా". 'నీ దివ్యమైన ధామానికి వెళ్ళాలంటే

నువ్వే సాధన! ఇంకసాధనలు ఏమీ లేవు. ఏ ఉపాసనలు లేవు. ఏ మంత్రాలు లేవు. ఏ యోగాలు లేవు, ఏ క్రియలు లేవు, ఏ కర్మకాండలు లేవు. నీ దగ్గరకు రావాలంటే నువ్వే సాధన నువ్వేనమ్మా' అని నాన్నగారు చెప్పారు. నిజమే! ఆవిడ కృపే! ఆవిడ కృప ఉంటేనే ఆవిడ రాజ్యంలోకి వెళ్ళగలము, ఆవిడ నిత్యసేవలోకి వెళ్ళగలము, ఆ అనుభవాన్ని పొందగలము, అలాంటి పంచమ పురుషార్థం అమ్మ రాధారాణి అంటే!

ఆ ప్రేమ యొక్క భావాన్ని కన్నయ్య పొంది తాను నిరంతరం ఆ ప్రేమను ఆరాధిస్తున్నాడుట. ఎక్కడ ఉన్నది ఆ ప్రేమ ? తన లోపలే ఉన్నది. ఆ ప్రేమ తనలోనే ఉన్నది. తనలో ఉండే ప్రేమనే తాను ఆరాధన చేసుకున్నాడుట. ఎంత చిత్రమో చూడండి! ఆ భావాన్ని ఆరాధన చేశాడట. ఆ ఆరాధన చేసిన భావమే రాధ! కాబట్టి ప్రేమ స్వరూపం ఆవిడ! నాన్నగారు ఒక పాటలో కూడా రాశారు. 'కృష్ణరూపంబునే గాంచి మోహించిన జీవులెల్లరు శ్యామునే భజియించిరి'. కృష్ణరూపాన్ని చూసి జీవులందరు శ్యాముడిని భజించారుట. "అట్టి శ్యాముడే నీ ప్రేమరూపుగాంచి నీదు రూపంబునే పొందే విరహంబుతో". 'నీరూపాన్ని చూసి, ఆ రూపభావన పొందుతూ పొందుతూ నీ రూపాన్ని ధరించేశాడు'. చూడండి! ఆ ప్రేమభావమే, సాధనే ఆ రూపానికి కల్పించిందట. ఎంత విచిత్రమో చూడండి. కాబట్టి అమ్మ దగ్గరకు వెళ్ళాలంటే అమ్మే సాధన! ఇంకొక సాధన లేదు. ఎలాగైతే కన్నయ్య ప్రేమరూపాన్ని తాను అనుభవిస్తూ విరహంతో ఉన్నాడో, ఆ రూపాన్ని పొందగలిగాడో, అంటే ఆ రూపాన్ని అనుభవపూర్వకంగా పొందగలిగాడో అలా అమ్మే సాధన, వేరేలేదు. అందుకనే నాన్నగారు ఎలా రాశారో మనకు

తెలియదు. ఆయన అనుభవం ఉండబట్టి, ఆయనకు అనుభవం ఉన్నది కాబట్టి అలా రాయగలిగారు. 'నీ దివ్యధామము చేర నీవే సాధనమమ్మా'. నీవే సాధనం అని చెప్పారు. అలాంటి అమ్మను పొందటానికి అమ్మే సాధన! అమ్మనే పట్టుకోవాలి! ఇంక ఎవరినీ లేదు. అందుకనే అమ్మను మనం ధ్యానం చేసుకోవాలి. అమ్మ ధ్యానానికి అమ్మే ఇస్తుంది. మనం ఎంత శ్రద్ధగా చేస్తే ఎంత అచంచమైన మనసుతో చేస్తే అమ్మ తప్పకుండా ఆ భావాన్ని మనకు ఇస్తుంది. కన్నయ్యకు ఇవ్వలేదా ? అమ్మ ప్రేమరూపాన్ని చింతన చేస్తూ ఉంటే ఆ ప్రేమరస భావాన్ని పొంది ఆ రూపాన్ని ధరించాడే! తప్పకుండా అమ్మే ఇస్తుంది. కాబట్టి చేయటం మనధర్మం! మనం చేస్తూ ఉంటే అమ్మ ఇవ్వక తప్పదు, ఇస్తుంది తప్పకుండా. ఎలాగు ? విషయాదులన్నిటిని avoid చేస్తూ, ఈ దేహంతో తాదాత్మ్యం చెందకుండా, విషయాదులతో తాదాత్మ్యం చెందకుండా మనసును ఏకాగ్రత చిత్తంతో అమ్మను, అమ్మ భావాన్ని, అమ్మ మంత్రాన్ని, అమ్మ నామాన్ని, అమ్మ ప్రేమ భావాన్ని చింతన చేస్తూ ఉండాలి. అమ్మను చింతన చేస్తూ ఉంటే అమ్మే ఇస్తుంది తప్పకుండా. ఇంకెవ్వరూ ఇవ్వలేరు ఆ భావాన్ని.

బృందావనంలో ఫూల్‌బాబా అని అన్ని తోటలకు వెళ్ళి పూలన్నీ కోసుకుని వచ్చేవాడు. దొంగతనమే, ఎక్కడ తోటలో పూలుంటే ఆ తోటలో పూలన్నీ కోసుకురావటం, మాలలు గుచ్చటం, బాంకీబిహారీకి ఇవ్వటం. ఫూల్ బాబా అంటారు ఆయనను. ఆ పూలు అలా మాలలు కట్టి, మాలలు కట్టి ఆయనకు ఇచ్చేవాడు. ఎంత కాలానికీ కనిపించడు. ఆయన కనిపించడు, అమ్మ కనిపించదు. ఇద్దరూ లేరు. ఇద్దరూ కనిపించటంలేదు. 'నేను

ఇంతకాలంగా మీ సేవ చేస్తున్నాను. నాకు మీ యొక్క దివ్యదర్శనం అనుభూతి కలగలేద'ని ఏడ్చేశాడు ఆయన. ఏడ్చేసి మూడు రోజులు భోజనం చేయలేదు. నాకు వాళ్ళ యొక్క దివ్య అనుభూతి కలగలేదు అని భోజనం చేయలేదట. అప్పుడు బిహార్జీ చెప్పాడు 'నువ్వు ఉత్తర దిశగా వెళ్ళు. ఉత్తర దిశగా వెళ్తే నీకు అక్కడ దొరుకుతుంద'ని అన్నాడు. ఆ ఉత్తర దిశలో ఏముంది ? బర్సానా ఉన్నది. ఆ బర్సానా కొండ దగ్గరకు వెళ్ళాడు. ఆ కొండపైకి వెళ్ళాడు. అక్కడకు వెళ్ళేసరికి అయిదేళ్ళ చిన్నపాప "అరే బాబా! ఇధర్ ఉపవాస్ నహీ హై! ఆప్ కీ నిరాహార్ దీక్ష ఇధర్ నహీహై! ఆప్ ఖావో, పీవో, ఐసాహెూనేతో హమ్ మిల్ జాయెగా. యే ప్రసాద్ లేలో, యే ప్రసాద్ పావో" అని ఆ చిన్నపిల్ల అన్నది. 'ఇక్కడ కఠినమైన నిరాహార దీక్షలు లేవు. ఉపవాసాలు లేవు. అవన్నీ చేస్తే దొరకదు ఇక్కడ. అవన్నీ చేస్తే దొరికే వస్తువు కాదు అది. ఈ ప్రసాదం తీసుకో. ఈ ప్రసాదం తిను' అని ఆ అమ్మాయి పళ్ళెం ఇచ్చిందట. ఆ పళ్ళెం పట్టుకుని అలా కళ్ళనీళ్ళు కారుతున్నాయి, చూస్తున్నాడు. ఆ చిన్నారి తల్లి చాలా సుందరంగా నడుస్తూ వెళ్ళిందిట అమ్మ. 'చిన్నారి రాధారాణే, నా తల్లే వచ్చింది. నా తల్లే వచ్చి నాకు ప్రసాదం ఇచ్చింది'. చూడండి. ఏ సాధన చేశాడు ఇక్కడ ? పూలు ఇవ్వటంతో రాలేదు. ఆయన లోపల భావము, వాళ్ళు కనిపించలేదు అనే ఒకరకమైన విరహవేదన లోపల వచ్చింది. వాళ్ళ కోసం విరహవేదన వచ్చేసింది. ఆ విరహవేదనే అమ్మ యొక్క సాధనం! అమ్మ నిలువలేదు ఇంక. తాను వచ్చింది, ప్రసాదం ఇచ్చింది. అతనిని ఎన్నుకున్నది ఫూల్ బాబాని. ఆ తర్వాత ప్రసాదం తీసుకున్నాడు. ఆ బర్సానాలో ఉండిపోయి అమ్మ దగ్గరకు చేరిపోయినాడు.

కాబట్టి అమ్మ దగ్గరకు వెళ్ళాలంటే అమ్మే సాధన! నాన్నగారు ఈ పుస్తకాలు, కథలు ఇవన్నీ ఏమీ చదవలేదు. చదవకముందే రాశారు నాన్న. 'నీ దివ్య ధామము చేర నీవే సాధనమమ్మా'. చూడండి! అమ్మ ధామం వెళ్ళాలంటే అమ్మే సాధన, రెండవది ఏదీ లేదు. కాబట్టి మన సాధన ఏమిటయ్యా అంటే అమ్మే! అమ్మ వినా రెండవది లేదు. మంత్రం అక్కరలేదు, నామం అక్కరలేదు, రూపం అక్కరలేదు, కేవలం "అమ్మ ఉన్నది, అమ్మ చూస్తూ ఉన్నది. అమ్మ చూపులో ఉన్నాను. నా తల్లిని పిలుస్తున్నాను, అమ్మా.... అని పిలుస్తున్నాను నేను. అమ్మా... అని పిలుస్తున్నాను, రాధే.... అని పిలుస్తున్నాను, చిన్నారీ.... అని పిలుస్తున్నాను" అని అమ్మను పిలుస్తూ ఉంటే చాలు అమ్మ కరిగిపోతుంది. ఆవిడకు కావలసింది ప్రేమ భావం కావాలి కానీ ఈ వస్తువులు కాదు, ఈ మంత్రాలు కాదు. ఈ మంత్ర తంత్రాలకు ఆవిడ లొంగదు. యజ్ఞయాగాది క్రతువులకు ఎలాగైతే ప్రహ్లాదుడు చెప్పాడే చిక్కడు వ్రతములకు క్రతువులకు అని. భగవంతుడు వాటి అన్నింటికి చిక్కడు. నిరంతరమైన స్మృతి, నిరంతరమైన ఆయన యందుండే అనురాగం అదే లభ్యమవుతుందని అన్నాడు. దానివల్లనే భగవంతుని యొక్క అనుభూతి కలుగుతుందని చెప్పాడు. అలాగే అమ్మ యొక్క అనుభూతి కలగాలి అంటే అమ్మతో attachment! నీదంటూ ఇక్కడ ఏమీ లేదు. మనం తీసుకురాలేదు, మనది కాదు, మనం తీసుకు వెళ్ళలేము. మనతో ఏది ఉంటుంది అంటే మనం చేసుకుండే యొక్క అమ్మ చింతనే మనతో వచ్చేది. అమ్మ చింతనే మనల్ని తీసుకువెళ్తుంది అక్కడికి. అదే మనకు లోపల ఉండవలసింది. ఇది తప్ప రెండవది లేదు. కాబట్టి ఆ భావంతో feel అవుతూ అమ్మ చింతన చేసుకోండి, అమ్మ మంత్రం చేసుకోండి, అమ్మ నామం చేసుకోండి, ఇది

అమ్మది, ఇది అమ్మ సొత్తు, అమ్మను పిలుస్తున్నాను అనే భావంతో విరహంతో తల్లితో లింకు పెట్టుకోండి. నిజంగా ధ్యానం మనకు కుదిరి ఆవిధమైన ధ్యానం చేసుకున్నామంటే తల్లి మనల్ని విడిచిపెట్టదు. మనం కూడా బ్రతకలేము. అమ్మకు దూరంగా ఉండలేము. ఎలాగు ? నాన్నగారు చెప్పారు "నిను విడచి క్షణమైన బ్రతుకలేనే ప్రియా" అన్నారు. క్షణం కూడా విడిచి పెట్టలేనని చెప్పారు నాన్న.

కాబట్టి ఆ రుచి అలాంటిది. ఆ రుచి అనుభూతిని పొందవలసిందే కానీ అది దర్శింపవలసింది కాదు. అది రూపం కాదు. రూపానికి, నామానికి, లీలకు అన్నిటికి అతీతమైన ఒక దివ్యమైన భావం! భావమే అమ్మ స్వరూపం! భావమే అమ్మ ప్రేమ! ఆ భావమే అమ్మ యొక్క క్రియ! ఆ భావమే అమ్మ యొక్క పూర్తి మధురమైన స్మృతి! కాబట్టి ఆ భావాన్ని మనం ఫీల్ కావాలి. ధ్యానం ఏముంది, ఈ రోజు ఒక గంట చేస్తే సరిపోతుందిలే. గంట చేస్తే సరిపోయేది ధ్యానం కాదు అది. మనమేమో అనవసరంగా ఇక్కడ ఏడు రోజులు పెట్టారు కాబట్టి ధ్యానం చేద్దాములే ఏదో ఒక time లో అని పెట్టుకున్నామంటే మనకు అమ్మతోటి అనుసంధానం ఎలా కలుగుతుంది ? లేదు ఎలాగైనా సరే అమ్మతో లింకు పెట్టుకోవాల్సిందే. ధ్యానం కుదరనీ కుదరకపోనీ అన్ని గంటలు కూర్చోవాల్సిందే! ఎప్పుడో ఇస్తుంది అమ్మ. ఎప్పుడు ఇస్తుందో తెలియదు. అదే గీతాంజలిలో రాశారు రవీంద్రనాథ్ ఠాగూర్. ఒక ప్రియురాలు ప్రియుడి కోసం ఎదురు చూస్తూ ఉంటుందట. ఆమెకు ఇంక వేరే లక్ష్యం ఏమీలేదు. తన ప్రియుడి రాకకోసమే చూస్తూ ఉంటుందట. గాలి వీచినా, ఆకులు కదిలినా, ఆకులు శబ్దమైనా, ఏదైనా

మంచి సుగంధం వాసన వచ్చినా, ఏది వచ్చినా అతను వస్తున్నాడనే భావం ఉంటుందట. కాబట్టి ఇతరత్రా ఏమీలేని అనన్య భావంతో ఆ నిరీక్షణ భావంతో ఉండిపోతుందట అని గీతాంజలిలో రాశారు. అలా ఇక్కడ కూడాను మనం నిరీక్షిస్తూ ఉందాము. అమ్మ కోసం నిరీక్షణ చేస్తూ, అమ్మ కావాలి అనే భావంతో లోపల చేస్తూ ఉండాలి. ఎప్పుడు ఇస్తుందో తెలియదు తల్లి. ఆ ఫూల్‌బాబాకు ఇవ్వలేదా ? పూలమాలలన్నీ కట్టి రోజూ ఇస్తూ అలా ఎన్ని సం॥లు చేశాడో తెలియదు. ఎన్ని సం॥లు అలా సమర్పించాడో తెలియదు 'నాకు వాళ్ళు కనిపించలేదు, నాకు వాళ్ళు దొరకలేదు, వాళ్ళను నేను చూడలేదు, వాళ్ళ అనుభూతిని నేను పొందలేదు' అని ఏడ్చేశాడు. తిండి మానేశాడు.

కానీ అమ్మ ఉండలేదు. తిండి మానేశాడని కాదు. అమ్మ 'నా కోసం తపన పడుతున్నాడే' అని వచ్చింది. కాబట్టి ఈ మనసు ఏకాగ్ర చిత్తంతో విషయాదులను దూరంగా ఉంచి, ఆ అమ్మ చింతన మనం విడవకుండా చేసుకుంటూ ఉంటే తప్పకుండా అమ్మ అనుగ్రహం కలుగుతుంది. అమ్మ మాట్లాడుతుంది. అమ్మ దగ్గర వచ్చి కూర్చుంటుంది. అదే నాన్నగారు చెప్పారు "ఆత్మార్పణ స్థితిలో అమ్మయే మాట్లాడు అమ్మయే నీలోన కూరుచుండును సదా". ఎప్పుడైతే పూర్తిగా అమ్మకు surrender ఔతామో, అమ్మకు శరణాగతి అయిపోతామో మనం, పూర్తిగా అమ్మ వచ్చి ఆక్రమించేస్తుంది. అక్కడ ఏ క్రియ చేసినా తల్లే చేస్తుంది కానీ వీడిది అక్కడ ఏమీ ఉండదు. సాక్షిగా ఉంటాడు. ఆ జీవుడు సాక్షిగా ఉంటూ ఉంటాడు. ఏ క్రియ చేసినా, ఏ పని చేసినా ఆ తల్లే చేస్తూ ఉంటుంది. నడుస్తున్నా, మాట్లాడుతున్నా, ఏం చేస్తున్నా

ఆ తల్లే చేస్తూ ఉంటుంది. తాను సాక్షిగా ఉంటాడు. అలాంటి ఆత్మార్పణ స్థితిలో తల్లి ఆ body ని ఎన్నుకుంటుంది. Body ని కాదు, ఆ మనస్సును ఎన్నుకుంటుంది. Body ఇవాళ్ళ ఉంటుంది రేపు పోతుంది. కాబట్టి అమ్మకై మనం ధ్యానం చేయాలి. రాధాభావ ధ్యానయోగం అని నాన్నగారు చెప్పారు. ఆ రాధాభావ ధ్యానయోగం మనం ఎంత శ్రద్ధగా చేస్తే అంత మంచిది.

మనం ఇవాళ ఈ పురాణం చదువుదాం, రేపు ఇంకొక పురాణం చదువుదాం, ఎల్లుండి ఇంకొక పురాణం! పురాణం పురాణం పుక్కిటి పురాణాలు చదువుతూనే ఉంటే మనసు నిలవదు. ఇవాళ ఇక్కడ బావి తవ్వుదాం, ఇంకొక చోట ఇంకొక బావి, అలా బావి తవ్వుకుంటూ పోతున్నాం కానీ నీళ్ళు ఎక్కడా పడవు. ఏకాగ్రంగా ఒకేచోట తవ్వండి అక్కడ నీళ్ళు పడతాయి. కాబట్టి ఇవాళ ఈ పురాణం, రేపు మరొక పురాణం ఇలా ఏ పురాణాలు చదివినా మనసుకు శాంతి లేదు. వేదవ్యాసులవారే మనకు తార్కాణం! ఆయన అష్టాదశ పురాణాలు అన్నీ రాశారు. ఎన్ని పురాణాలు రాసినా అందులో అంతా భగవంతుని తత్త్వమే రాశారు, శాంతి లేదు. శాంతి అనేది కలగలేదు. విచారంగా ఉన్నారు. అప్పుడు నారద మహర్షి వచ్చి అడిగాడు 'ఏమిటి నాయనా విచారంగా ఉన్నావు ?' 'ఏమో నాకు శాంతి లేదు. ఇన్ని పురాణాలు రాసినా నాకు శాంతిలేదు'. కాబట్టి అన్ని పురాణాలు చదివినా మనకు ప్రయోజనం ఏమీలేదు. ఏం చేయాలి ? అప్పుడు నారద మహర్షి అక్కడకు వెళ్ళి ఆయన దగ్గర చతుశ్శ్లోకాలు తీసుకుని వచ్చి అవి వేదవ్యాసుల వారికి ఇస్తే ఆయన భాగవతం రచించారు. భగవద్భక్తుల యొక్క చరిత్రే భగవంతుడికి ప్రాణం, ఇష్టం! వాళ్ళ చరిత్రను

చదువుతూ ఉంటే ఆయన ఏడుస్తూ ఉంటాడు. ఆయనకి అంత ప్రాణం, అంత ఇష్టం భగవద్భక్తుల యొక్క కథ చెప్తూ ఉంటే!

ఇక్కడ మహాత్ములు భక్తమాల అని కథలు చెప్తూ ఉంటారు. భక్తుల యొక్క చరిత్రలు చెప్తూ ఉంటారు. ఆ భక్తుల చరిత్రలో కథ చెప్తున్నాడట ఒకతను. రోజూ అక్కడకు ఒక పిల్లవాడు వచ్చి కూర్చుంటాడట. ఆ పిల్లవాడు రోజూ వింటూ ఉంటాడు, ఏడుస్తూ ఉంటాడు. వింటూ ఉంటాడు, ఏడుస్తూ ఉంటాడు. అక్కడ ఒక భక్తుడి కథ మొదలుపెట్టాడు ఆయన. ఆ భక్తుడి కథ చెప్తూ సగంలో ఆయన ఊరికి వెళ్ళవలసి వచ్చింది నాలుగు రోజులు. నాల్గవ రోజు వచ్చి కూర్చున్నాడు మళ్ళీ భక్తుల కథ చెప్పటానికి. అందరూ వచ్చి కూర్చున్నారు, 'నేను మొన్న ఎక్కడి వరకు చెప్పాను కథ' అని అడిగాడు. ఎవ్వరూ చెప్పలేదు. అందరూ వింటున్నారు కానీ ఒక్కడికి కూడా మనసులోపలికి పోలేదు. అక్కడ వందలమంది, వేల మంది కూర్చుని ఉన్నారు. ఆ పిల్లవాడు వచ్చి ఏడుస్తూ చెప్పాడట. ఆ కథ నుంచి మొదలుపెట్టాలి నాయనా అని చెప్పాడట ఆ పిల్లవాడు. కథలు వింటున్నారే కానీ కథలలోపల ఉండే భక్తి ప్రేమ, భక్తుడి యొక్క ప్రేమ, ఆ భక్తుడిని గురించి వివరించి చెప్తుంటే ఆ పిల్లవాడు ఏడుస్తున్నాడు అంటే ఎవరు ? భగవంతుడే సాక్షాత్తు వచ్చి కూర్చున్నాడుట. కాబట్టి భక్తుల చరిత్ర అంత ఇష్టం భగవంతుడికి. అందుకనే వేదవ్యాసుల వారు భక్త చరిత్ర రాయటానికి రాశారు అందులో. ఆ భక్తుల చరిత్రలు అన్నింటిలోను భగవంతుడు నిండి ఉన్నాడు. ఆ భగవంతుడితో పాటు అమ్మ కూడా నిండి ఉన్నది. రాధారసం కూడా నిండి ఉన్నది.

అందుకనే భాగవతాన్ని ప్రేమశాస్త్రం అని చెప్పారు. ప్రేమే అక్కడ! ఆ ప్రేమశాస్త్రం కాబట్టే భాగవతానికి అంత విలువ కలిగింది. కాబట్టి భగవంతుడు ప్రేమకు వశమైపోతాడు. "భక్తి వశః పురుషః"! భక్తి, ప్రేమ భక్తికే వశమైపోతాడు. వైధీ భక్తికి వశం కాడు. బిచ్చగాడు వస్తే బిచ్చం వేసి పంపించేస్తాడు. వైదీభక్తిలో కోరికలుంటాయి. ఆ కోరికలు ఆ బిచ్చగాడికి ఏంకావాలో ఆ కోరిక ఇచ్చి పంపించేస్తాడు. ప్రేమభక్తిలో కోరిక లేదు. 'నువ్వేకావాలి. నువ్వేకావాలి నాకు. ఇంకెవ్వరూ అక్కరలేదు. నువ్వు కావాలి' అంటే బందీ అయిపోయినట్టే. అందుకనే గోపికలకు చెప్పాడు 'నేను మీకు ప్రేమ ఋణం ఉన్నాను. మీ ఋణాన్ని నేను తీర్చుకోలేను' అని ఏడ్చేశాడు కన్నయ్య. కాబట్టి ప్రేమభక్తికి అంత విలువ ఉన్నది. అంత highest అని చెప్పారు. ఆ ప్రేమ స్వరూపమే అమ్మ! ఆ ప్రేమ స్వరూపమే కన్నయ్య! వారిద్దరూ కలసి ఒకే రూపం లీల కోసం రెండుగా అయినారు. అమ్మను తలుచుకున్నా కన్నయ్యను తలుచుకున్నట్టే, కన్నయ్యను తలుచుకున్నా అమ్మను తలుచుకున్నట్టే! వేరుకాదు. ఇద్దరూ ఒకే స్వరూపం! కానీ ఆ ప్రేమ యొక్క అసలైన భావం మహాభావం రాధారాణి అని చెప్పారు. "మహాభావ చింతామణి" అని చెప్పారు. కాబట్టి అమ్మ అంత highest! అలాంటి అమ్మను మనందరికీ నాన్నగారు చూపించారు. మనందరినీ ధ్యానం చేసుకోమని అన్నారు. ఈ అవకాశం ఎంతో గొప్పది! ఈ ఏడు రోజులే కాదు. మనం జీవించినంత వరకు ఆ అమ్మ చింతన చేసుకోవటం చాలా ఉత్తమం! అది నాన్నగారు ఇచ్చిన అవకాశం! మనం కూడా రోజూ అమ్మను ఈ ఏడు రోజులే కాకుండా, ఏదో ఒకటైము మీకు దొరికినప్పుడు ఆ time లో

కూర్చుని అమ్మతో చక్కగా మనసును నింపుకొని ధ్యానం చేసుకోవటం మంచిది. కాబట్టి ఇవాళ మూడవ రోజులో ఉన్నాం. రేపు నాల్గవ రోజు. ధ్యానం మటుకు ఎవరైనా మీరు విడవవద్దు. 'ఇంటి దగ్గరైనా అవకాశం లేదండీ, పని మనుషులు వస్తారు, పిల్లలు వస్తారు'. వాళ్లు వస్తారు, రానీ, ఆ పనులు చక్కబెట్టేసేసి, ఆ ఏడు రోజులు ఎవరికైనా అప్పజెప్పేసేసి కూర్చోండి చాలు. అమ్మతో కలపండి. అమ్మ యొక్క ప్రేమ భావంతో ధ్యానం చేసుకోండి!

– ం –

## ఆత్మార్పణ స్థితి

ప్రేమస్వరూపులైన నాన్నగారి దివ్య ఆశీస్సులతో ఇరువది రాధాభావ ధ్యానయోగ సప్తాహం ఇవాళ నాల్గవ రోజు! అమ్మ అనుగ్రహం వలన, నాన్న యొక్క ఆశీర్వచనంవలన ధ్యానం సాగుతున్నది. గురుకృప ఉంటే అమ్మ యొక్క అనుగ్రహం కూడా కలుగుతుంది. భగవంతుని రాజ్యంలో ప్రవేశించాలంటే జీవుడు ఏ విధమైన నడవడికతో ఉంటే అక్కడ ప్రవేశించ గలడు ? అది రెండు విధాలుగా ఉన్నది. ఒకటి వైధీ ప్రకారంగా, రెండవది ప్రేమ మార్గంగా! వైదిక ప్రకారంగా భగవంతుని అర్చన చేస్తూ, సంకీర్తన చేస్తూ, ఆయన గుణగణాలను కీర్తిస్తూ, ఆయన యందు మనసు లగ్నం చేసుకుని వెళ్లటం ఒకటి! రెండు ఆయన ప్రేమతో ఉపాసన! రసంతో ఉపాసన! రసోపాసన! అంటే వైధీభక్తి కలిగినవాడు ఆయన దగ్గరకు వెళ్తాడు కానీ ఆ ప్రాంగణంలో ఉంటాడు. ప్రేమ భక్తి, రసోపాసన భక్తిలో వెళ్ళేవాళ్ళు ఆయన అంతర్భాగం ఐన ఆ ప్రేమ గృహంలోకి ప్రవేశిస్తారు. వాళ్ళకు జన్మంటూ లేదు. వీళ్ళకి కోరుకుంటే జన్మ వస్తుంది అంతే! అది చాలా విచిత్రమైన భావన!

భక్తులు ఎంతో మంది వారివారి అభిరుచుల ప్రకారంగా వైదిక భక్తిలో భగవంతుని స్తుతిస్తూ, అర్చన చేస్తూ, గుణగానం చేస్తూ ఆయన ఐశ్వర్య స్వరూపమైన ఆ ప్రాంగణంలోకి వెళ్ళగలిగారు. అదీ భక్తే! కానీ ఎప్పటికైనా అక్కడి నుంచి క్రిందికి రావటానికి అవకాశం ఉంటుంది. ఇది అలా కాదు. కేవలం అమ్మ యొక్క సామీప్యంలోనే ఆ జీవుడు జీవిస్తూ ఉంటాడు. అమ్మ పంపగా ఈ క్రిందికి వచ్చి అమ్మయొక్క రసాన్ని, ప్రేమను పంచుతాడు.

అలా వచ్చిన వాళ్ళు ఇక్కడ హిత హరివంశ, హరిదాస్‌జీ మహరాజ్ వీళ్ళంతా అమ్మ పంపగా వచ్చారు. నాన్నకూడా ఆ కోవలోకి చెందినవారే! “అమ్మ నన్ను పంపించింది. నేను ఇక్కడికి వచ్చాను. మళ్ళీ అమ్మ దగ్గరకు వెళ్తున్నాను. ఇప్పట్లో నేను రాను. అమ్మ పంపిస్తే వస్తాను” అని నాన్నగారు అన్నారు. నా మాటలు కాదు, నాన్నగారు అన్న మాటలు ఇవి. ‘మళ్ళీ నేను ఇక్కడికి రాను. అమ్మ పంపిస్తే వస్తాన’న్నారు. కాబట్టి ఆ ప్రేమ రాజ్యం, ఆ ప్రేమ కుంజలోకి వెళ్ళినవారు జగత్తును ఉద్ధరించాలి, వీళ్ళు జగత్తుకు అంతా ప్రేమను పంచాలి అనే భావన కలిగి ఉంటే కిందికి పంపిస్తుంది అమ్మ. లేకపోతే అక్కడే ఉండిపోతారు.

అలాంటి సాధన చాలా కష్టం! కొంత వరకే ఆ సాధన. ఆ ప్రేమమార్గం యొక్క సాధన కొంత వరకే. ఆ తర్వాత లేదు. అమ్మ అనుగ్రహంతోనే అక్కడికి వెళ్ళగలుగుతారు. ఎంత విచిత్రమైనదో! బృందావనం అంతా అమ్మ యొక్క ప్రేమ చూపుతో నిండిపోయి, అమ్మ ప్రేమతో నిండి ఉన్నది. చెట్లు ఏమిటి ? పర్వతాలు ఏమిటి ? కుంజలేమిటి ? అన్నీ అమ్మ ప్రేమతో నిండిపోయి ఉంటాయి. అవన్నీ అమ్మకు సేవ చేసుకుంటున్నాయి. అలా వెళ్ళినవాళ్ళు ఆ విధమైన సేవలో అమ్మకు అంకితమై ఉన్నారు. వృక్షాలు వృక్షాలు కాదు, అవి కల్పవృక్షాలు. కల్పవృక్షాలు కూడా కాదు. అవి చాలా గొప్ప తపస్సు చేసుకున్న మహాత్ముల యొక్క ఆ భావాన్ని పొంది అందులో ఆ బృందావనంలో ఆ రూపాలను ధరించారు. అమ్మకు ఏ విధమైన అనుకూలంగా ఉండాలో ఆ విధంగా అనుకూలంగా ఆ వృక్షాలు ఏమిటి, ఆ లతలు ఏమిటి, ఆ పుష్పాలు ఏమిటి అవన్నీ ఆవిధంగా అమ్మకు సేవ చేసుకుంటున్నాయి. అలాంటి సేవలో వినియోగపడతారు.

కాబట్టి అమ్మ యొక్క సేవకు వినియోగపడేటట్లుగా మనం అమ్మ ధ్యానాన్ని చేసుకోవాలి. అంటే విచిత్రం ఏమిటి చెప్పలేము అసలు. అమ్మ నడుస్తూ ఉన్నదిట. ఒకతీగె అలా వచ్చింది. 'శ్యామ్ సుందర్‌కి నమస్కారం చేయి' అని ఆ తీగెతో అన్నది అమ్మ. తీగ అలాగే చేసింది. అలా ఉంటుంది అక్కడ. అమ్మ తేజస్సుతో పూర్తిగా నిండిపోయింది. అమ్మ ప్రేమ భావంతో పూర్తిగా నిండిపోయింది బృందావనం అంతా. అదే నాన్నగారు కూడా పాట రాశారు "నీ ప్రేమ వనమందు నా ప్రేమలత ఎపుడు నీకొరకే జీవించు నీ కొరకే పుష్పించు". ఎలా రాశారో చూడండి! 'నీ ప్రేమ వనము'. అమ్మ ప్రేమవనము బృందావనము. ఆ ప్రేమ వనంలో ఆ లత తానుగా భావించుకున్నారు నాన్న. 'నీ ప్రేమ వనమందు నా ప్రేమ లత ఎపుడు నీ కొరకే జీవించు. నీ కోసమే జీవిస్తుంది అమ్మా! లేకపోతే జీవం లేదు. నీ కొరకే పుష్పించు. ఆ పువ్వులు కూడా నీ కోసమే పుష్పిస్తాయమ్మా'! అంటే అలా మహాత్ములు ఆ విధమైన భావంతో బృందావనంలో ఆ వృక్షాల రూపంలో, ఆ లతల రూపంలో, ఆ పుష్పాల రూపంలో, ఆ ఫలాల రూపంలో అన్నీ నిండి ఉన్నాయన్నమాట. కాబట్టి ఆసేవకు జీవుడు ప్రయత్నం చేయాలి. ప్రయత్నం చేయాలంటే అక్కడ మంత్రతంత్రాలు లేవు. కేవలం భావం మాత్రమే! యజ్ఞయాగాదులు లేవు. క్రతువులు లేవు. హోమాలు లేవు. కేవలం ఆర్తి! ఆర్తితో, ప్రేమతో, భావంతో అమ్మచింతన చేసుకోవటం! అమ్మ ధ్యానం చేసుకోవటం! అమ్మ అది చూస్తుంది, నువ్వు ఏం చేస్తున్నావా అనేది చూడదు. నీ క్రియ అక్కరలేదు. నీలోపల ఉండే భావాన్ని చూస్తుంది అని చెప్పారు నాన్న. భావరూపిణి ఆవిడ! భావాన్నే చూస్తుంది. అలాంటి భావాన్ని చూచి అమ్మ తన దగ్గరకు లాగేసుకుంటుంది. ఆవిడే సాధన! ఆ సాధన వస్తువు

ఏ విధంగా ఉన్నదో బయట ఆ బయట ఉన్న దానిని తన వద్దకు లాగేసుకుంటుంది అమ్మ.

కాబట్టి ధ్యానం అనేది చాలా highest! అందులో అమ్మతో, అమ్మ ప్రేమతో, అమ్మ భావంతో, అమ్మ రసం తోటి ధ్యానం చేయాలి! ఇది మనకు చాలా కష్టం. అయినప్పటికి కూడాను ప్రయత్నం చేయాలి. ప్రయత్నం చేస్తే తల్లి అనుగ్రహం ఉంటుంది. అహేతుకమైన ప్రేమతో లాగేసుకుంటుంది ఆవిడ. విచిత్రంగా లాగేసుకుంటుంది, మనకు తెలియదు. ఆ గేహర్ వనంలో తిరుగుతూ కిశోరీ కిశోరీ అని ఏడ్చిన పంజాబీ అతనిని ఎలా లాగేసుకున్నది ? భార్య కోసం ఏడుస్తున్నా కానీ మరపు తెచ్చేసింది. తన ఇంటికి వచ్చిన వ్యక్తికి ఆ భార్యపట్ల మరపు ఇచ్చేసింది. వెంటనే మనసుకు కిశోరి యొక్క భావంతో నిండిపోయేటట్లుగా అమ్మచేసింది. లేకపోతే అతనికి వచ్చేది కాదు ఆ యోగ్యత! ఆవిడ ఇచ్చింది పాత్ర. కిశోరీ కిశోరీ అని ఏడుస్తున్నాడు. అమ్మ యొక్క పిలుపుతోటి తనలోపల ఉండే ఆ భావం పూర్తిగా మరపు వచ్చేసి అతనికి avoid అయిపోయింది. ఆ అమ్మ భావం నిండింది. అమ్మ దగ్గరకు వచ్చాడు, పాదాల మీద పడిపోయినాడు అంతే ప్రాణం వదిలేశాడు. ఆ అహేతుకమైన ప్రేమతో అలా లాగేసుకుని తన సఖిగా చేసుకున్నది.

కాబట్టి లోపల ఉండే భావం అమ్మ లాగేసుకుంటుంది. మనం ఎలా ఉన్నా ఆ భావాన్ని maintain చేసుకోవాలి అమ్మ కోసం. ఎందుకు జీవిస్తున్నాం ? జీవించేది దేనికి ? అమ్మకోసంగా ఉండాలి. నీకోసమే జీవిస్తున్నానమ్మా అన్నారు, నీ కోసమే పుష్పిస్తున్నాను అన్నారు నాన్న. అలాంటి భావాన్ని లోపల maintain చేసుకోవాలి ధ్యానానికి. కాబట్టి time

జరిగిపోతున్నది. జీవితంలో సగం రాత్రి అయిపోతున్నది, జీవితానికి సగం పగలు. ఆ సగం పగలులో కూడాను 99 ముక్కలు అంతా మనం పూర్తిగా ప్రాపంచికంగా ఉన్నాం. ఓ పావులో ఏమన్నా తలుచుకుంటే తలుచు కుంటున్నాం అంతే. అనుకోవటమే కానీ ఆ భావానికి ప్రయత్నం చేయలేక పోతున్నాం మనం. ఇందులో ఇంత తీపి ఉన్నది. ఆ విషయాదులలో ఉండే తీపి సామాన్యంకాదు. ఎలాంటిది అది ? దుర్గంధమైన వాసన లాంటిది అది. అయినప్పటికీ ఇందులోకి వెళ్ళిపోతున్నాం మనం. వెళ్ళిపోయిన time మళ్ళీరాదు. ఇప్పుడు ఉన్న time ని మనం సద్వినియోగం చేసుకోవాలి. దానిని ఉపయోగించుకోవాలి. ఎలా ఉపయోగించుకోవాలి ? అమ్మతో నింపుకోవాలి. అమ్మతో నింపుకున్నప్పుడే మనకు శాంతి కలుగుతుంది. లేకపోతే శాంతి లేదు. నాన్నగారు చెప్పారు ఒకపాటలో ఉన్నది. శాంతి లేదు నాకు ఎక్కడకు వెళ్ళినా కూడా అని. ఎక్కడికి వెళ్ళినా శాంతి అనేది లేదు, శాంతి అమ్మవల్లనే దొరుకుతుంది.

కాబట్టి మన ధ్యానానికి అమ్మతో నింపుకోవాలి. అమ్మ వినా రెండవది లేదు. ఏ మాత్రం పిల్లవాడు అటూ ఇటూ తిరిగినా తల్లి ఎక్కడ ఉన్నదని వెతుక్కుంటూ ఉంటాడు. తల్లిదగ్గరకు వెళ్ళిపోతాడు. తల్లిని చూస్తూ ఉంటాడు. వాడికి తల్లి దూరంగా ఉండిపోయి కనిపించకపోతే వాడికి ఎన్ని బొమ్మలు ఇచ్చినా ఎన్ని ఆట వస్తువులు ఇచ్చినా, ఎంత తీపి పదార్థాలు పెట్టినా ఏం పెట్టినా కూడాను వాడికి అవన్నీ అక్కరలేదు. అమ్మే కావాలి. అంత హఠం పట్టేస్తాడు. అమ్మను చూపించేంత వరకు వాడు దేనినీ స్వీకరించలేడు. ఆ విధమైన భావం తోటి అమ్మను మనం పట్టుకోవాలి.

నిజంగానే ఈ మనసు చాలా వికారాలకు లోనైపోయి ఉన్నది. ఎందుకంటే వికారమైన ప్రపంచంలో ఉన్నాం మనం. ఆ వికారాలకు లోనైపోయేసరికి దానిలో నుంచి బయటకు రావటానికి చాలా.... కష్టంగా ఉన్నది. ఏ విధంగా అయినా అమ్మతో నింపుకుంటే అమ్మ లాగేసుకుంటుంది. ఒక పెద్ద తాటిచెట్టు కింద ఉన్నది చిన్న చీమ. ఆ చీమ తాటి చెట్టు పైకి వెళ్ళటానికి ఎంత time పడుతుందో ? చాలా time పడుతుంది అది చెట్టు ఎక్కి పాకటానికి. ఒక పెద్ద గాలి వచ్చిందనుకో ఆ గాలికి ఆకు కిందపడింది. ఆ ఆకు ఎగిరిపోయి పైకి వెళ్ళిపోయింది. ఒక సాధనలాగా దొరుకుతుందట అది ఆపైకి వెళ్ళిపోతుందట. ఆ విధమైన అహేతుకమైన కృప కలుగుతుందట. భగవత్ కృప వలన, అమ్మ కృపవలన. కాబట్టి మనం అమ్మతో మనసును నింపుకుని అమ్మ నికుంజకు వెళ్ళటానికి ప్రయత్నం చేయాలంటే చాలా కష్టం. సాధనలేదు, కానీ మనసును ఆ సాధ్య వస్తువుతో పూర్తిగా మనసును నింపుకుని ఆ అమ్మతో ఉంటే మనకు ఎప్పటికైనా అమ్మ కృప కలుగుతుంది.

అందుకనే ధ్యానం అనేది fixed time అక్కరలేదు. ఈ ఏడు రోజులు అని ఎందుకు పెట్టామంటే ఆ టైమ్‌లోనైనా కూర్చుంటారేమో అని పెట్టారు. Fixed time అక్కర్లేదు, ఏ time లో నీకు మనసు కుదిరిందో ఆ time లో వెళ్లి కూర్చో. నాన్నగారు చెప్పారే కళ్ళు మూసుకో, గది తలుపులు వేసుకో. గదిలోకి వెళ్ళు తలుపులు వేసుకో, నీ ఇష్టదైవాన్ని ప్రార్థించు అని చెప్పారు. అలాగే తలుపులు వేసుకోవటం అంటే కళ్ళు మూసుకోటం. ఇంద్రియాలన్నీ లోపలికి తీసుకోవటం. నీ ఇష్టదైవాన్ని లోపల చింతన చేసుకోవటం. ఆ ఇష్టదైవంతో పెట్టుకో, ఎప్పుడు ఏ టైమ్ దొరికినా ఫరవాలేదు. ఫలానా

ఫిక్సెడ్ టైమ్ అక్కరలేదు. అని మనం అనుకుంటే కాదు. విచిత్రంగా లాక్కుపోతుంది. బయట అంతా పెద్దగా మాట్లాడుతూ మాట్లాడుతూ అక్కడి నుంచి లాక్కుని వెళ్లిపోతుంది. ఇది మనకు అవసరంలేదు చెత్తకుండీని వెతుక్కున్నట్టే అవుతుంది, ఇది మనకు అవసరం లేదు అని వెళ్ళిపోతుంది మనసు. ఆ విధంగా మనసును మనం practice లో పెట్టుకోవాలి మరి. పెట్టుకున్నా కూడా అమ్మ అనుగ్రహం కావాలి. అమ్మ అనుగ్రహం ఉంటేనే తప్పకుండా వస్తుంది.

ఏ విధమైన లింకు బాహ్యంతో పెట్టుకోవద్దు. బాహ్యలింకు మనకు కిందకు పతనానికి తీసుకువస్తుంది. అమ్మతో లింకు శాశ్వతమైనది! ఆ లింకు మనం ఏర్పరచుకోవాలి. అందుకని నాన్నగారు 'అమ్మను ధ్యానించుకోండి. అమ్మను నిరంతరం స్మృతిలో పెట్టుకోండి. 'అహరహము నీమదిలో అమ్మ సంస్మృతి లేక ఆత్మార్పణమె నీకు సాధ్యమగుటయెకల్ల' అన్నారు. అమ్మ స్మృతి లేకపోతే surrender కాలేము మనం. అమ్మకు ఆత్మార్పణం కాలేము. ఆత్మార్పణం అంటే పూర్తిగా ఆవిడకు అర్పణం ఐపోవటమే. అర్పణం అయిపోతే ఆవిడే చూసుకుంటుంది జీవితాన్ని. 'ఆత్మార్పణ స్థితిలో అమ్మయే మాట్లాడు అమ్మయే నీలోన కూర్చుండును సదా'. ఎప్పుడైతే అమ్మకు ఆత్మార్పణం అయిపోతావో ఆ అమ్మే చూసుకుంటుంది. ఇంక వీడు బాహ్యంగా ఆలోచించటానికి ఉండదు. తల్లి దగ్గరే ఉండిపోతాం. కానీ మనసును అమ్మకు అర్పణం చేయాలంటే మొదలు ఈ ఉన్న ఆలోచనలను ఇవన్నీ మనం avoid చేస్తూ ఉండాలి. Avoid చేయటానికి సాధ్యంకాదు. కాకపోయినా సరే మనం దానికి ప్రయత్నం

చేయాలి. ఎలా ఉందంటే ఒకతాడు పేనినట్టుగా అలా పేనుకుపోయింది మనకు అంతా లోపల విషయాదులన్నీ. ఎప్పటెప్పటివో ఎప్పటెప్పటివో మనకు గుర్తువస్తూ ఉంటాయి. వాటి అన్నింటితో మనసు తాదాత్మ్యం చెందుతూ ఉంటుంది. ఆ దానితోనే చర్చిస్తూ ఉంటుంది మనసు. దీనిలోకి రాదు. ఆ చర్చలోకే వెళ్ళిపోతుంది. అక్కడ మనుష్యులు ఉండ నక్కరలేదు. అప్పుడు జరిగిన ఆ టైము ఉండనక్కరలేదు, అవేవీ ఉండనక్కరలేదు. కానీ అందులోకి వెళ్ళిపోతుంది. దానిని అలా వెళ్ళనివ్వకుండా పక్కకు తీసుకురావాలి. అదెంత కష్టమో, చాలా కష్టం! అయినప్పటికీ కూడా ప్రయత్నం చేయాలి.

ధ్యానం బృందావనంలోనే కాదు ఇంటి దగ్గర కూడా సాధ్యమైనంత వరకు అమ్మతో ఉండేటట్లుగా మనం ప్రయత్నం చేద్దాం. ‘మాకు టైము లేదండీ ఎన్నో పనులుంటాయి.’ ఉంటాయి పనులు ఉండకుండా ఉండదు. ఉన్నది విషయాదులలో ఉన్నాము. ఆ విషయాదులలో ఉన్నప్పుడు అన్నీ విషయాదులు వస్తూ ఉంటాయి. వచ్చినా వాటికి సాక్షిగా ఉండు. సాక్షిగా ఉండి ఆ క్రియ ఏదో చేసేసెయ్. ఆ పనేదో చెయ్యి. అమ్మతో ఉండు, అమ్మే తీసేస్తుంది. అమ్మే అన్నీ చూసుకుంటుంది అని అన్నారు నాన్నగారు. కాబట్టి మనం ధ్యానం చేసేటప్పుడు ‘అమ్మ ఉన్నది. అమ్మచూస్తూ ఉన్నది. అమ్మ చూపులో ఉన్నాను. నేను తల్లిని చూడలేకపోయినా తల్లే నన్ను చూస్తూ ఉన్నది. అమ్మను పిలుస్తున్నాను. అమ్మా! రాధే! కిశోరీ! అని అమ్మను పిలుస్తున్నాను! ఆ పిలుపు ఎలా ఉండాలంటే అమ్మ వినా ఇంక రెండవది ఉండకూడదనే భావం ఉండాలి ఆ పిలుపులో. ఆ భావంలో ఉండాలి ఆ పిలుపు. వెంటనే అమ్మ లాగేసుకుంటుంది. వాడు ఎక్కడో ఏడుస్తూ ఉంటే

అమ్మకు వినబడింది ఏడుపు. ఎలా వినబడింది ? శబ్దం కాదు, ఆ భావ తరంగాల నుంచి వినబడింది. ఆ ఏడుపు యొక్క భావతరంగాల నుంచి అమ్మకు వినబడింది. అక్కడ మనిషి ఉండనక్కరలేదు దగ్గరలో.

కాబట్టి ఆ భావం అమ్మకు తెలుసు లాగేసుకుంటుంది తల్లి. వీడు నావాడు. వీడు ఏడుస్తున్నాడు రెహమాన్. శ్యామా శ్యామా అని ఏడుస్తున్నాడు. అమ్మ విన్నది. అమ్మ ఎక్కడున్నది ? అంతటా ఉన్నది తల్లి. అమ్మ విని 'వీడు నావాడు, నా సొత్తు' అని ఆ చంపకలతని పంపించి తీసుకువెళ్ళింది. అలా కనిపెట్టుకుని చూస్తూ ఉంటుంది. చూడండి ఎంత గొప్ప సేవో అమ్మది! మనం చిన్న సేవ చేయాలంటే ఎంతో ఆలోచించుకుని ఎంతో కష్టమే అది అనుకుంటాము. అమ్మ అలా అనుకోదు. సేవ కోసం రెడీగా ఉంటుంది. "భక్తానుగ్రహకాతరామ్" భక్తులను అనుగ్రహించటానికి అలా ఎదురు చూస్తూ ఉంటుందట తల్లి. ఆ తల్లి ఎప్పుడూ 'నావాడు, నావాళ్ళు ఎక్కడున్నారా, నావాళ్ళెవరు ? నావాళ్ళను నేను దగ్గరకు తీసుకోవాలి' అని ఎదురు చూస్తూ ఉంటుందట అమ్మ. అలా అమ్మవాళ్ళం అవటానికి ప్రయత్నం చేయాలి. ధ్యానం అనేది ఏడు రోజులు, పిల్లవాడు school కి వెళ్ళటానికి మభ్యపెట్టినట్లుగా చేయటమే కానీ అలా కాదు. ఇది continue. Continuation గా ఉండాలి. వెంటనే ఆ thought రాగానే లోపలికి వెళ్ళిపోవటం. లోపలికి వెళ్ళిపోయి కూర్చుని చేసుకోండి. ఆవిధమైన భావంతో మనం అమ్మ చింతన చేసుకుంటూ ఉంటే ధ్యానం చేసుకుంటే అమ్మ యొక్క అనుగ్రహం కలుగుతుంది. అమ్మే నడిపిస్తుంది జీవితాన్ని. మనం నడవలేము. అలా ఉన్నవాళ్ళకు అమ్మే వాళ్ళ జీవితాన్ని నడిపిస్తూ ఉంటుంది.

నాన్నగారు అంటూ ఉండేవారు. “నాకు 70, 80 వేల మంది శిష్యులు ఉండేవాళ్ళు పూర్వకాలంలో. రాధాకృష్ణ తత్వంలోకి రాకముందే 70, 80 వేల మంది శిష్యులు! అందరూ ప్రాణాలర్పించే ప్రేమ. ఆ ప్రేమ సామాన్యమైన ప్రేమకాదు వాళ్ళది. అంత గొప్ప ప్రేమ. నా యందు అంత ప్రేమ చూపించారు వాళ్ళు అన్ని వేలమంది. ఇప్పుడు లేరు అన్ని వేలమంది. అప్పుడున్నారు అన్ని వేల మంది. అందరూ ఎలాంటి వాళ్ళు ? కోటీశ్వరులు, పెద్దపెద్ద అధికారులు కాదు అందరూ చాలా చిన్నచిన్న పనులు చేసుకుని ఉండేవాళ్ళు. ఎంత బీదవాళ్ళుగానో ఉండేవాళ్ళు. కానీ అనంతమైన ప్రేమ వాళ్ళది. అలాంటి అనంతమైన ప్రేమ చూపించేవాళ్ళు. ఇంత చిన్న పిల్లలతో సహా ఏం పెట్టినా తీసుకువచ్చి నాన్నకు పెట్టేవాళ్ళు. నాన్నగారు తినాలని. అన్ని వేలమంది శిష్యులుండేవారు. ఇప్పుడు ఎవరూ లేరు అంత మంది. ఇప్పుడున్న వాళ్ళు నా వల్ల ఏం ఉపయోగం పొందుదామా అని చూసుకునేవాళ్ళే కానీ అలా ఉన్నవాళ్ళు ఎవరూ లేరు” అని చెప్పారు నాన్న.

కానీ ఎప్పుడైతే తన రూటుమారి ఈ సాధనలోకి ఇందులోకి వచ్చేశారో వాళ్ళందరూ దూరమైపోయినారు. ఎంత విచిత్రమో చూడండి. నాన్నగారు బృందావనం వస్తుంటే అందరూ ఏడుస్తున్నారు. “నాన్నా! చూడు ఎంత మంది ఏడుస్తున్నారో నీకోసం” అంటే, “నా కోసం ఏడ్చేవాళ్ళు నావాళ్ళు కాదమ్మా. నా తల్లి కోసం ఏడ్చేవాళ్ళు నావాళ్ళు” అని చెప్పారు నాన్న. వాళ్ళంతా నా కోసం ఏడ్చారు 70, 80 వేల మంది. నా తల్లి కోసం ఏడవలేదు. వాళ్ళు నావాళ్ళు కాదన్నారు. కాబట్టి అది లెక్కకాదు. అమ్మ కోసం ఏడ్చేసే వాళ్ళంటే ఆయనకు ప్రీతి. అమ్మసేవ కోసం ఉండేవాళ్ళంటే

ఆయనకు ప్రీతి నాన్నకు. ఆ భక్తుడి ప్రీతే అమ్మకు ప్రీతి! ఇవాళ పొద్దున ఆయన చెప్పారు. భక్తుడికి దుఃఖం వస్తే భగవంతుడు ఉండలేడట. తనకు ఏదన్నా బాధవచ్చినా ఫరవాలేదు కానీ భక్తుడి దుఃఖాన్ని చూసి ఉండలేడట. కాబట్టి భగవంతుడి ప్రేమ ఎలాంటిదంటే నిరంతరం సేవ చేయాలనే ఉంటుంది ఆయనకు. కానీ ఈ జీవుడికి ఆ సేవ వైపుకు పోవటం లేదు మనసు. దానికి పోకుండా సంసారానికి సేవ చేయుటానికి రెడీగా ఉంటున్నాడు. ఆ సేవకు వెళ్ళటానికి మనసు ఒప్పటంలేదు. ఎంత కష్టమో చూడండి. అది గురుకృప వలన భగవంతుని యొక్క అనుగ్రహం వలన కలగాల్సిందే ఆ సేవ! ఆ సేవ దొరకటం కూడా చాలా కష్టం. నాన్నగారు మనందరికీ 'అమ్మను చింతన చేసుకోండి. బృందావనం రండి, ధ్యానం చేసుకోండి. అమ్మను ధ్యానం చేసుకుని సంకీర్తన, అర్చన చేసుకోండి' అని చెప్పారు అది నాన్న ఇచ్చిన గొప్పవరం! మనం అది చింతన చేసుకుంటూ, అమ్మను మనసులో పూర్తిగా నింపుకుని ధ్యానం చేసుకుందాము!

- o -

# అమ్మతో అనుసంధానం

పరమపూజ్యులైన నాన్నగారి దివ్యఆశీస్సులతో 20వ రాధాభావ ధ్యాన సప్తాహం, 5వ రోజు ధ్యాన సప్తాహం జరుగుతున్నది. ఇదంతా నాన్నగారి అనుగ్రహం! ధ్యానం చేయాలని లోపల ఒక కుతూహలం కూడా చాలా గొప్పదే! ఎందుకంటే అమ్మతోటి ఎటాచ్‌మెంట్ అవటానికి తగిన అవకాశం కలుగుతుంది. ధ్యానం 5వ రోజు వచ్చేసిందంటే ఇంక టూడేసే ఉన్నదే, ఇంతసేపు కూర్చోవటానికి కూడా తరవాత మనకి అవకాశం వినియోగించు కోవటంలేదు, వినియోగించుకోలేకపోతున్నాం, ఈ రెండు రోజులైనా చేసుకొనటానికి అయిపోతున్నదే అని లోపల ఒక రకమైన ఇది మనకి కలుగుతుంది. ఎందుకు ? అక్కరలేదు. చేసుకోవచ్చు! 8 గంటలు కాకపోయినా, 4 గం॥ అయినా, 6 గం॥ అయినా ధ్యానం చేసుకోవచ్చు. అది మన యొక్క అవకాశాన్ని బట్టి వినియోగించుకోవటమే!

ధ్యానం చాలా విశిష్టమైనదని నాన్నగారు చెప్పారు. "శ్రీరాధా పరమ కరుణామయీ హైఁ, వే కేవల్ ధ్యాన్ మాత్ర్ సేహీ అపనీ భక్తోంకీ సామీప్యదర్శన్ దేతీ హైఁ" –

ధ్యానం చేతనే భక్తుల సమీపంలోకి వస్తుందిట అమ్మ! నాన్నగారు బృందావనంలో నింబార్కాచార్యుల వారి గ్రంథాలలో చదివి, తల్లి ధ్యానం చేతనే అమ్మ యొక్క అనుగ్రహానికి, అమ్మ దగ్గరికి వస్తుందని చెప్పి, నాన్న చాలా సంతోషపడి, ఆనందంగా ఇంకా తీవ్రంగా ధ్యానం చేయాలి, ధ్యానానికి ధ్యానకుటీరాన్ని నిర్మించాలి, అందరూ ధ్యానం చేసుకోవాలి; అందరికీ అవకాశం కలిగించాలని నాన్నగారికి చాలా ఉత్సాహం కలిగింది. ధ్యానం

అంటే అంత విశేషమైనది! ఆ ధ్యానంలో కూడా మానసికంగా అమ్మని సేవ చేస్తున్న భావంతో ధ్యానం చేసుకోవచ్చు!

మానసిక సేవలో కూడా గొప్ప విశేషం ఉన్నది. మానసికసేవ అంత గొప్పదని కూడా నాన్నగారు చెప్పారు. ఎలాగూ అంటే, మనం ప్రతిపనీ చేసేటప్పుడు ఆ సేవలో ఉన్నప్పుడు ఆ స్మృతి కలుగుతూ ఉంటుంది. 'ఇది అమ్మకి ఇష్టం, అమ్మకి ఇలా చేయాలి, అమ్మకి ఈ విధంగా నీళ్లుపోయాలి, అమ్మకి ఈ విధంగా స్నానం చేయించాలి, అమ్మకి ఈ బట్టలు కట్టాలి' అని అన్నీ అలా ఆ లింకు, ప్రతి లింకు అమ్మ సేవలో నిమగ్నమైపోతుందన్న మాట! కాబట్టి ధ్యానంలో కూడా అమ్మ సేవ మానసిక సేవగా, మానసిక సేవని చింతన చేసుకోవచ్చు. మంత్రం, నామం, మానసిక సేవ, అమ్మ లీలా చింతన ఇవన్నీ ధ్యానంలో చేర్చుకోవచ్చు. అన్నిటి కంటే highest భావం! ఆ భావంతో అమ్మ ధ్యానం చేసుకోవచ్చు.

బృందావన ధామంలో మహాత్ములు అందరూ రాత్రి 12 గం॥ నుండి కూర్చొని, మానసిక సేవలో ఉండేవారు. తెల్లవారి 3 గం॥కి లేచి, స్నానాదులు చేసుకొని మళ్లీ మామూలు ధ్యానానికి కూర్చుండే వాళ్లు. ఆ 12 గంటల టైములో అనేక రకాలైన ఆసురీ శక్తులు పని చేస్తూ ఉంటాయిట. ఆ ఆసురీ శక్తులని దరిదాపులకి రానివ్వకుండా ఉండటానికి అమ్మ చింతన హైయ్యెస్ట్ అని చెప్పారు. రాధాకృష్ణ చింతన హైయ్యెస్ట్ అనిచెప్పారు. ఎందుకంటే ఎలాంటి యొక్క ఆసురీగణాలు, ఎలాంటి వికారాలు నిర్మూలన చేసేది రాధాకృష్ణతత్వం ఒక్కటే!

ఎలాగయ్యా అంటే, భాగవతంలో దశమస్కంధం, అందులో రాస! ఆ రాస టైముకి భగవంతుడు మన్మథుడిని జయించేశాడు. అంటే, లోపల ఉండే వికారాలనన్నిటినీ జయింపజేశాడన్నమాట! అందుకని 'కామ విజయలీల' అంటారు దశమస్కంధంలో వచ్చే రాసని గురించి. మన్మథుడు వచ్చాడు. "నేను అందరినీ ఓడించేశాను. శివుడిని, బ్రహ్మ దేవుడిని, ఇంద్రుడినీ అందరినీ ఓడించేశాను. ఇంక నువ్వు ఉన్నావు. నిన్ను ఓడించాలని వచ్చాను" అని మన్మథుడు అడిగాడు. "బహిరంగంగానా, ఆంతరంగికంగానా" అడిగాడు కృష్ణుడు. "నువ్వు ఎలాగంటే అలాగు" అని మన్మథుడు చెప్పాడు. అప్పుడు కృష్ణుడు చెప్పాడు "శరత్పూర్ణిమ రోజున మహారాస జరుగుతుంది. ఆ టైములో ఆంతరంగికంగా ఉండే వాసనని అప్పుడు నువ్వు జయించుదువు గాని" అని చెప్పాడు. అంటే, మహారాసలో కొన్ని వేలమంది గోపికలు, వాళ్లంతా మహారాసలో పాల్గొంటారు. ఒక్కరికి వాసన వచ్చిందంటే, ఆ వాసన ఉన్నదీ అంటే కృష్ణుడు ఓడిపోయినట్లే! ఆ వాసన లేకపోతే కృష్ణుడు గెలిచినట్లు! అదే అక్కడ ఉండే సూచన! మన్మథుడు వచ్చాడు. మహారాస జరుగుతున్నది. మహారాసకి ముందు కన్నయ్య అమ్మని ప్రార్థన చేశాడు. "నేను మన్మథుడికి మాట చెప్పాను ఇలా! అక్కడ ఏ వికారమూ లేకుండా నువ్వు చెయ్యమ్మా హ్లాదినీ శక్తీ నువ్వు" అని అమ్మని ప్రార్థన చేశాడు. అమ్మ యొక్క ప్రేమ ఆచ్ఛాదన అక్కడ కంప్లీట్‌గా కవర్ అయిపోయింది. ఆ సమయంలో మన్మథుడు వచ్చి, కృష్ణుడి యొక్క సౌందర్యాన్ని చూచి తాను మోహించాడు కృష్ణుడిని. 'ఇంత సుందరమైనవాడా కన్నయ్య' అని తాను మోహించాడు.

ఇలా అందరి మీద, అక్కడ ఉండే గోపికలందరి మీదా మన్మథ బాణాలు వేశాడు. ఒక్కటీ పని చేయలేదు. అందరి మనసులూ కన్నయ్య మీదే ఉన్నాయి. ఆ కన్నయ్య మీద కూడా ఎలాంటి భావం అంటే వికారమైన భావం కాదు. కన్నయ్య సుఖం కోసం, కన్నయ్యే మనకి కావలసినవాడు అనే భావంతోటి ఉన్నారు. ఎక్కడా వికారం అనేది ఏదీ లేదు. అలాంటి స్థితి ఉన్నది. అప్పుడు మన్మథుడు కన్నయ్య పాదాల మీద పడిపోయి, “నేను ఓడిపోయినాను. నేను మన్మథుడినైతే నీవు మన్మథ మన్మథుడివి” అని బిరుదు ఇచ్చాడన్నమాట కన్నయ్యకి. కాబట్టి రాసలో అలాంటి వికారం లేకుండా చేయగలిగిన శక్తి అది! కాబట్టి ఏ జీవుడైతే కన్నయ్యతో, అమ్మతో అనుసంధానం పెట్టుకుంటారో వాళ్లకి ఈ వికారమైన సంబంధం నిర్మూలమై పోతుందట! ఆ కృష్ణభక్తిలో ఉండే విశేషం అలాంటిది! కృష్ణభక్తి అలాంటిది అయినప్పుడు రాధాదేవిది ఇంకా హైయ్యెస్ట్ అది! ఆ ప్రేమకి కళంకం లేదు. అది ప్యూరిటీ అయిన ప్రేమ అది! చాలా సుందరమైన ప్రేమ! కాబట్టి ఏ భక్తిలోనైనా సరే ఈ వికారం ఉంటుంది కానీ రాధాకృష్ణ భక్తిలో ఇలాంటిది ఉండదు. మనకి భాగవతంలో ఉండే దశమస్కంధమే తార్కాణం! అందుకనే ‘కామ విజయలీల’ అని చెప్పారు దానిని!

అలాంటి అమ్మ మనకి దొరికింది నాన్నగారి దయవలన. మనకి అమ్మని ధ్యానంచేసుకోవటానికి అవకాశం ఇచ్చారు. నిజంగా మనం మనస్ఫూర్తిగా అమ్మకి సరెండర్ అయి, అలా ధ్యానం చేశామంటే అమ్మ మనకి ఎం....తో.... ఆనందాన్ని ఇస్తుంది. అతీంద్రియమైన ఆనందాన్ని ఇస్తుంది తల్లి! ఆ ఆనందాన్ని పొందటమే మన యొక్క ధ్యేయం! ఎలా ?

రోజూ అమ్మని గురించి ధ్యానం చేసుకోవాలి! అన్నిటిలో అమ్మతో అనుసంధానం, క్షణక్షణం అమ్మతో అనుసంధానం, ప్రతిదానిలో అమ్మతో అనుసంధానం! ఈ విధమైన జీవితం గడుపుతూ ఉంటే అదే ఒక గొప్ప సాధన అని చెప్పారు. అది మనం చేయలేము. కొంచెంసేపటిలోనే మన మనసు చెదిరిపోయి, ఇంకొకదానికి లగ్నమైపోతుంది. క్షణంలోనే మారిపోతూ ఉంటుంది. ఈ పరిణామం చెందే జగత్తులో ఉన్నాం కాబట్టి, ఈ మనసు కూడా పరిణామం చెందుతూ ఉంటుంది. దానికి మనం సాక్షిగా ఉండాలి! పరిణామం చెందే జగత్తుతోటి సాక్షిగా ఉండి, అమ్మతో తాదాత్మ్యం చెందాలి! సాక్షిత్వాన్ని నిలబెట్టుకోవటం అంటే చాలా కష్టం! పెద్దపెద్ద మహనీయులు కూడాను చెదిరిపోయి, పడిపోయినారు. ఆ సాక్షిత్వం చాలా కష్టం! అమ్మ యొక్క అనుగ్రహం ఉంటే సాక్షిభావం స్థాయిగా నిలబడుతుంది. ఆ స్థాయీ భావంలో నిలబడిపోతుంది.

కాబట్టి ధ్యానం చాలా హైయ్యెస్ట్! ఆ ధ్యానాన్ని మనం ప్రతిరోజు, ప్రతీరోజూ ఒక టైము నిర్ణయం చేసుకొని ధ్యానానికి కూర్చుంటే, రోజురోజుకి మనలోపల ఒక రకమైన వేదన కలుగుతుంది. ఆ వేదనే మనకి గొప్ప సాధన! ఆ సాధన వల్లనే ఆసాధ్యమైన అమ్మ ప్రేమ మనకి లభ్యం ఔతుంది. ఆ సాధన ఏమిటీ అంటే అమ్మే! ఇంక రెండవది లేదు. అందుకనే అమ్మని "వాంఛా చింతామణి" అన్నారు. వాంఛా చింతామణి అంటే సామాన్యమైనది కాదు. మన మనసుని, మన కోరికని, 'నీవు కావాలి' అనే కోరికని అమ్మ సిద్ధింపజేస్తుందిట! అలాంటి ప్రేమమయి అమ్మ! సామాన్యం కాదు!

బృందావనానికి దగ్గరలో ఒక రాజ్యం ఉన్నది. అది జైపూర్ రాజ్యానికి దగ్గర! అక్కడ ఒక రాజుగారి కూతురి పెళ్లి! పెళ్లి నిర్ణయం చేశారు. ఇంక రేపో, ఎల్లుండో పెళ్లికొడుకు వాళ్లు వస్తారు. ఆ అమ్మాయి రాత్రికి రాత్రి పారిపోయింది. పారిపోయి, 'బృందావనం వెళ్లిపోతే బాగుంటుంది. అక్కడ కన్నయ్య, అమ్మ ఇద్దరూ ఉంటారు. వాళ్లు నన్ను చూసుకుంటారు. నేను అక్కడికి వెళ్ళిపోతాను' అని అనుకొని బయలుదేరి పరిగెత్తింది. పరిగెడుతూ వెళ్లిపోతున్నది. తెల్లవారి చూసేసరికి ఇక్కడ అమ్మాయి లేదు. రాజభటులు అందరూ కలసి, అన్నివైపులకి పంపించారు. ఇటు బృందావనం వైపు కూడా కొంతమంది వచ్చారు. ఆ అమ్మాయికి గుర్రపు శబ్దాలు వినబడుతున్నాయి. గుర్రపు అడుగుల శబ్దాలు వినబడుతున్నాయి. 'అమ్మో, వీళ్లు చాలా దగ్గరికి వస్తున్నారే! నన్ను పట్టేసుకుంటారు. అమ్మా! కరుణామయీ! రాధే! నన్ను ఏవిధంగా తీసుకుంటావమ్మా నీ దగ్గరికి ? కన్నయ్యా! ఎలా తీసుకుంటారు మీరు నన్ను ? నేను వీళ్లకి అనవసరంగా బలైపోతున్నాను' అని ఏడుస్తూ, పరిగెత్తుతూ; 'వాళ్లు దగ్గరికి వస్తున్నారు. ఇంక నేను ఎలా తప్పించుకోవాలి' అని చూసింది. అక్కడ ఒక ఒంటె, ఆ ఒంటె చచ్చిపోయింది. ఆ ఒంటె దగ్గర నుంచి దుర్గంధం వాసన, కంపు! అది ఎప్పుడు చచ్చిపోయిందో తెలియదు. ఆ అమ్మాయి వెళ్లి, ఆ ఒంటె కడుపులోపలికి దూరిపోయింది. చాలా కంపు కొడుతున్నది. అందులో దూరిపోయింది. వీళ్లు చాలా దూరంగా ఉండి, ఆ వాసన భరించలేక, వెనక్కి తిరిగి వెళ్లిపోయినారు. ఆ అమ్మాయి అందులోకి వెళ్లగానే కమ్మటి వాసనలు వచ్చేసినాయి ఆ అమ్మాయికి. ఆ దుర్గంధం అంతా పోయింది. నిజంగా తను నమ్ముకున్న, తను ఆరాధిస్తున్న ఆ యుగళం రాధాకృష్ణులు తనని అలా కాపాడుకున్నారు. లోపల ఎంత

వేదనగా ఆ అమ్మాయి ఉన్నదో, ఆ వేదనకి తగ్గట్లుగా వాళ్లు ఆ అమ్మాయిని చూసుకున్నారు.

గుర్రాల మీద వచ్చిన వాళ్లందరూ వెళ్లిపోయినారు. ఆ అమ్మాయి బృందావనం వచ్చింది. బృందావనం వచ్చి, ఇక్కడ బ్రహ్మకుండ్ అని రంగనాథ మందిరం దగ్గర ఉన్నది. ఆ బ్రహ్మకుండ్ దగ్గిర స్నానం చేసి, అక్కడ ఒక చెట్టు ఉంటే ఆచెట్టు కింద కూర్చొని రాధాకృష్ణుల గురించి విలపిస్తున్నది. చూడండి! భగవంతుడు ఏవిథమైన అవకాశాన్ని ఇచ్చాడు!? ఆ ఉన్న దుర్గంథమైన వాసనని కూడా మంచి పరిమళాలతో ఏర్పాటు చేశారు. ఆ అమ్మాయిని రక్షించారు. బృందావనం వచ్చింది. అక్కడ ఒక సంతు మహాత్ముడు ఆ అమ్మాయికి గురువైనారు. రాజుగారు అంతటా వెతికించాడు. వెతికితే ఇక్కడ దొరికింది, బృందావనంలో ఉన్నది. “రా అమ్మా! వెళ్దాము”. “నేను రాను. నాకు వివాహం అయిపోయింది. రాధాకృష్ణులు ఇద్దరితో వివాహం అయిపోయింది. నేను రాలేను. వాళ్లని విడిచి వస్తే తప్పు! పతిని విడిచి, భార్య బయటికి రావచ్చునా! రాకూడదు. నేను రాను” అని ఆ అమ్మాయి చెప్పింది. సబరమతి అంటారు ఆ అమ్మాయి పేరు! ఇక్కడే ఉండి పోయింది బృందావనంలోనే! ఆ అమ్మాయికి తగిన ఏర్పాట్లు చేశాడు తండ్రి. “ఈ ఏర్పాట్లు ఇవన్నీ, ఈ రాజ సౌఖ్యాలూ నాకు అక్కరలేదు. నా సౌఖ్యం, నాకు ఏది కావాలో అమ్మ చూసుకుంటుంది. ఆవిడ చూసుకుంటుంది. నాకు అక్కరలేదు ఇవన్నీ” అని వాటినన్నిటినీ పంపించేసింది వెనక్కి, తనకు ఏర్పాటు చేసినవన్నీ! ఇక్కడ వాళ్లిద్దరినీ చింతన చేసుకుంటూ గొప్ప మహాత్మురాలు అయింది.

కాబట్టి నిరంతరం వాళ్లతో మనం అనుసంధానం పెట్టుకుంటే, జీవితం వాళ్లే మలుచుకుంటారు. ఆ జీవితాన్ని ఏ విధంగా మలుచుకోవాలో వాళ్లకే తెలుస్తుంది. కోరిక అంటూ లేదు, కోరిక ఒకటే! వాంఛా చింతామణి – కోరిక ఏమిటి ? 'నువ్వు కావాలి' అనే కోరిక ఒకటే! ఆ నువ్వు కావాలి అనేది వాళ్లే నెరవేరుస్తారు. కాని, వాళ్లతో ఎటాచ్‌మెంటు ఉండాలి! అదే ధ్యానంలో కూడా, అమ్మతో లింకు, ఆ అమ్మతో లింకు ఉండాలి! "అమ్మా! నీ సేవ నేను ఇలాగ చేసుకుంటాను. ఏ విధంగా నీ సేవలో నన్ను వినియోగించుకుంటావో వినియోగించుకో తల్లీ" అని లోపల భావన అమ్మ కోసం, ఆ లోపల వేదన కలగాలి! ఆ వేదనతోటి లోపల అమ్మ భావాన్ని ఫీల్ ఔతూ, ధ్యానం చేసుకోవాలి! ధ్యానం వలన అమ్మ యొక్క అనుగ్రహం తప్పకుండా కలుగుతుంది. ఆవిడే ఇస్తుంది! అప్పుడు బలం, అమ్మబలం, ఆ బలం అంతా తనే ఇస్తుంది.

కాబట్టి రాధాభావ ధ్యానయోగంలో రాధాజీ భావాన్ని పూర్తిగా మనసులో నింపుకొని, ఆ భావంతో ధ్యానం చేసుకోవాలి! అమ్మ అనుగ్రహం కలుగుతుంది. ఎలా కలిగింది ఆ రాజుగారి కూతురికి ? చక్రవర్తిలాగా హాయిగా పెళ్లిచేసుకొని సుఖంగా ఉండవలసింది, శారీరకమైన సుఖంగా! కానీ ఆత్మ సుఖం ఉండదుగా! ఇక్కడ అమ్మతో ఉన్నది కాబట్టి ఆత్మ సుఖం కలిగి, వాళ్లు తమ దగ్గరికి తీసుకున్నారు. అమ్మ, భగవంతుడు ఎంత విచిత్రమైన ఏర్పాటు చేస్తాడో తెలియదు. తనని నమ్ముకున్న వాళ్లకి ఆవిధమైన విచిత్రమైన ఏర్పాట్లు ఉంటాయి.

అలాగే చైతన్య మహాప్రభువు యొక్క షడ్గోస్వాములు కూడాను సర్వసంగ పరిత్యాగం చేసుకున్నారు. రాజు గారి దగ్గర మంత్రులుగా ఉండే వాళ్లు రూప, సనాతన గోస్వాములు! వాళ్లు అంతా వదిలేసేశారు. సర్వస్వాన్ని అంతా వదిలేసి, బృందావనంలో వచ్చి ఉన్నారు. అమ్మ చూసుకున్నది వాళ్లని. ఎలా చూసుకోవాలో, ఏ విధంగా చూసుకోవాలో తల్లి చూసుకున్నది. ఆ రాజు పదవిలో ఉండే భోగం కన్నా, అమ్మ దగ్గిర ఉండే దివ్యమైన ఆనందం వాళ్లు రుచి చూశారు. ఇక్కడే ఉండి, అమ్మని చింతన చేసుకుంటూ, అమ్మ ప్రసాదం తీసుకుంటూ, అమ్మతో లింకుతో ఉన్నారు.

కాబట్టి ధ్యానంలో అమ్మతో లింకు, అమ్మతో ఎటాచ్‌మెంట్, అమ్మ వినా రెండవది లేదు. ఆ విధమైన భావంతో ధ్యానం చేసుకోవాలి! నాన్నగారి కోరిక కూడా అలాగే! ఎవరో అడిగారు "ఏమండీ! ఆ మూల ఖాళీగా ఉన్నది. మేము ఒక గదివేసుకొని, ఆ మూల ఉంటాము. తరువాత మీకే ఇస్తాము గది" అన్నారు. ఇక్కడ రాధామహలక్ష్మిగారి ఇటుకరాయే ఉండాలి కాని, ఇంక ఎవరిదీ ఉండకూడదు! ఇంక ఎవరిదన్నా పెట్టుకున్నారనుకోండి; వాళ్ల గురువులు, వాళ్ల దేవతలు, వాళ్ల పూజలు, వాళ్ల అనుష్ఠానాలు అన్నీ ఉంటాయి. ఇక్కడ అనన్యనిష్ఠ అనేది చెదిరిపోతుంది. అమ్మవినా, రెండవది ఉండకూడదు. చెదిరిపోతుంది. అందువలన ఎవరినీ అలా ఒప్పుకోలేదు.

ఒకసారి ఒకతను వచ్చి, "ఇక్కడ మీ దగ్గర ధ్యానం చేసుకొని, ఇక్కడే వెళ్ళిపోతాను" అని వచ్చాడు. పాపం, సరే అన్నారు నాన్న. తనకి కావలసిన గురువుని, ఆ ఫొటోలు, పుస్తకాలు అవన్నీ పెట్టుకొని ఉన్నాడు. తెలిసింది నాన్నగారికి. రిక్షా పిలిపించారు. వాళ్లవాళ్లు ఎవరో వచ్చారన్నమాట! రిక్షా

పిలిపించి; 'నేను రమ్మనే దాకా నువ్వు బృందావనం రావద్దు నాయనా' అని చెప్పారు స్పష్టంగా. ఖాళీ చేయించి పంపించేశారు. 'అమ్మ వినా రెండవది ఉండకూడదు. అనన్యమైననిష్ఠతో ఉండాల'ని నాన్నగారి భావన, అదీ! కాబట్టి 'అమ్మ చింతనే ఉండాలి! అమ్మతో లింకు ఉండాలి! అదే ధ్యానానికి మూలం! అదే highest' అని చెప్పారు. కాబట్టి మనం అందరం అమ్మతో లింకు పెట్టుకొని; జగత్తుతో సాక్షిగా, అమ్మతో తాదాత్మ్యం! ఇది మాటలు చెప్పుకోవటంచాలా తేలిక! కాని క్రియలలో చాలా కష్టం! బాహ్యంగా తాదాత్మ్యం చెందకుండా ఏ జీవుడూ ఉండలేడు. ఎందుకంటే తాదాత్మ్య జగత్తులో ఉన్నాం మనం! జగత్తుతో సాక్షిగా ఉండటం మనం ప్రాక్టీస్ చేసుకోవాలి! ఎప్పుడైతే అమ్మతో తాదాత్మ్యం కలిగి ఉంటామో, ఆటోమాటిక్‌గా సాక్షిభావం వచ్చేస్తుంది. అది సాధన చేస్తేనే కాని రాదు. మాటలు చెప్పుకోవటం, మాటలు వినటం ఇవి చాలా తేలికగా ఉంటుంది. కాని సాధనలో చాలా కష్టం! చాలా కష్టం ఇది! ప్రతి చిన్న విషయానికీ తాదాత్మ్యం చెంది, మనలోపల ఉండే అరిషడ్వర్గాలు బయటికి వచ్చేస్తూ ఉంటాయి ఆ తాదాత్మ్యం వలన! అది కంట్రోల్‌కి రావాలంటే అమ్మతో ఉండే చింతన వల్లనే కంట్రోల్‌కి వస్తాయి. లేకపోతే రాలేవు. అందుకనే నాన్న చెప్పారు 'జగత్తుతో సాక్షీభావంగా ఉండు, అమ్మతో తాదాత్మ్యం చెందు! అమ్మతో తాదాత్మ్యం అనేది highest' అని చెప్పారు. ఎప్పుడైతే అమ్మతో తాదాత్మ్యం పొంది అదే చింతనలో ఉంటారో అదే ధ్యానం! అదే నిరవధిక ధ్యానం అయిపోతుంది. అమ్మ ప్రీతి! ధ్యానం అంటే అమ్మకి ప్రీతి! కాబట్టి మనం ధ్యానాన్ని అమ్మతో నింపుకొని, అమ్మ భావాన్ని నింపుకొని ధ్యానంచేసుకుందాము. అది నాన్న ఇచ్చిన వరం!

ఈ రెండు రోజులతో అయిపోయింది అనుకోవద్దు! మనకి ఆఖరి ఊపిరి ఉన్నంత వరకు ఆ అమ్మ యొక్క చింతనతో ఉండాలని ప్రయత్నం చేద్దాము. ఎందుకో చెప్పలేము; ఎప్పుడు, ఏ టైములో ఎప్పుడు వెళ్లిపోతుందో తెలియదు. ఎప్పుడు వెళ్తుందో ఎవరికి తెలుస్తుంది ? తెలియదు! కాబట్టి ఈ లింకు ఇలా కంటిన్యూ ఔతూ ఉంటే అమ్మ చూసుకుంటుంది 'వీడు నా వాడు, నా సొత్తు, వీడిని నా దగ్గరికి తీసుకువెళ్దాం' అని అమ్మ చూసుకుంటుంది. కాబట్టి అమ్మతో లింకు అనేది శాశ్వతమైనది. నాన్న అన్నారు "నాకు, అమ్మకి eternal link, శాశ్వతమైన లింక్, సామాన్యమైన లింక్ కాదు" అని నాన్నగారు చెప్పారు. అలా మనం అమ్మతోటి లింకు బలపరచుకుందాము. ఆ లింకు బలపరచుకుంటేనే మనకి ధ్యానం బాగా సాగుతుంది. రేపు ఆరవ రోజు, ఎల్లుండి ఏడవ రోజు! ఇంకా మనం ఇంకా బాగా తీవ్రంగా చేయటానికి ప్రయత్నం చేద్దాము!

**జయ జయ శ్రీరాధే!**

– o –

# దృఢ స్మృతి

పరమపూజ్యులైన నాన్నగారి దివ్యఆశీస్సులతో ఈ రోజు రాధాభావ ధ్యానయోగ సప్తాహంలో ఆరవ రోజు! ధ్యాన స్థితిని అందుకోవటం అంటే చాలా కష్టం! దానికి మనసు ఏకాగ్రచిత్తం కావాలి! చంచలమైన మనసు ధ్యానానికి కూర్చోలేదు. ఆలోచనతో కూడిన మనసు ధ్యానానికి కూర్చోలేదు. ఆలోచనా రహితమైన మనసే, ఆ మనసు ఉంటేనే ధ్యానానికి కూర్చోగలుగుతారు. స్థిరం లేకపోతే మనకి నిష్ఠ కుదరదు. స్థిరత్వం కావాలి! మనసు చంచలం కాకూడదు. చంచలమైన కొద్దీ మనం దూరమైపోతూ ఉంటాం అమ్మకి. అమ్మ దగ్గరికి వెళ్లటానికి దూరమైపోతూ ఉంటాం. కాని నిశ్చలత్వం కావాలి! నిశ్చలమైన మనసుతో ఉండాలి! ఆలోచనా రహితమైన మనసుతో ఉండాలి! అలా అయితేనే ధ్యానానికి మనం కూర్చోగలుగుతాము.

"ఆహారశుచో సత్వశుచిః సత్వశుచో దృఢ స్మృతిః" – దృఢమైన స్మృతి కలిగి ఉండాలి. ఆహారం కూడా రజోగుణానికి మూలం ఔతూ ఉంటుంది. రజోగుణ సంబంధమైన ఆహారం తీసుకుంటే ఆలోచనలు కూడా రజోగుణ సంబంధంగానే వచ్చేస్తాయి. సాత్విక ఆహారం తీసుకుంటే సత్వపరంగా ఉంటుంది. దృఢత్వం కావాలి! దృఢ స్మృతి! దృఢమైన మనసు కలిగి ఉండాలి. చంచలమైన మనసు ఉండకూడదు. దానికి మనం ప్రయత్నం చేయాలి. మనసుని అమ్మతో నింపుకోవాలి! మనసు కూడా చాలా చంచలమైనది. అది అనేక రకాలైన మలుపులు తిరగటానికి రెడీగా ఉంటుంది ఆ మనసు! అమ్మతో నింపుకున్నప్పుడే అది ఎక్కడికీ తిరగదు.

కాబట్టి సరైన సద్గురువు దొరికితే, ఆ సద్గురువు యొక్క సాంగత్యంలో ఆ మనసుని అలవరచుకుంటే, ఆ సద్గురువు యొక్క వైబ్రేషన్స్ వలన మనసుకి స్థిరత్వం వస్తుంది. ఆ స్థిరత్వం వచ్చినప్పుడు ధ్యానానికి మనం కూర్చో గలుగుతాము. ధ్యానం అంటే ధ్యేయ వస్తువుని మనసు నందు లగ్నం చేసుకొని; ఆ ధ్యేయ వస్తువు కోసమే మనసు ధ్యానం చేస్తూ, చింతన చేస్తూ, నెమరు వేసుకుంటూ ఆ లోపలే జరుగుతూ ఉండాలి ఆ ధ్యానస్థితిలో!

కాబట్టి ధ్యానానికి ఆలోచనలు ఉండకూడదు. బాహ్యమైన విషయాదులు లోపల అసలు పని చేయకూడదు. మనసుని ఏకాగ్రంగా, మనం దేనిని చింతన చేస్తున్నామో ఆ చింతన ప్రకారంగా కూర్చోవాలి! ఆలోచనలు వస్తూ ఉంటాయి. అవి తెంపులు తెంపులుగా వస్తూనే ఉంటాయి ఆలోచనలు! కాని, ఏ మాత్రం మనం అవకాశం ఇవ్వకూడదు ఆలోచనలకి. వాటిని avoid చేస్తూ ఉండాలి! ఎప్పుడైతే మన యొక్క మనసు పూర్తిగా అమ్మ మీద లగ్నమై ఉంటుందో అమ్మ, గురువు ఇద్దరూ మనకి సహకరిస్తారు. తప్పకుండా వాటిని మన దగ్గరికి రానివ్వకుండా చూసుకుంటారు కూడా. కానీ మన ప్రయత్నం కావాలి కదా! దానియందు లగ్నం కావాలి కదా మనసు! కాబట్టి సద్గురు కృప! ఆ సద్గురువు తప్పకుండా మనకి అండగా ఉంటారు. ధ్యానానికి తగిన మనసునిఏర్పరచటానికి కూడా సద్గురువు ఏర్పాటు చేస్తారు. కాని మొదట కలగవలసింది మనకే! నాన్నగారు అన్నారు "మీ అందరి గురించి నేను అమ్మకి రికమండేషన్ చేస్తాను. వీళ్లంతా నీ కోసం ఉన్నవాళ్లమ్మా అని". ఎప్పుడు చేస్తారు ? మనం తగ్గ స్థితిలో అమ్మతో లింకు పెట్టుకొని ధ్యానం చేస్తే, మన యొక్క ప్రోగ్రెస్‌ని బట్టి నాన్న రికమండేషన్

చేస్తారు అమ్మకి! 'నాన్న మనవాడే కదా, నేను ఎలా ఉంటేనేమి ? తప్పకుండా నాన్న రికమండ్ చేస్తారని అనుకుంటాం. అలా కుదరదు!

నాన్నగారు ఒకసారి బృందావనం వస్తుంటే, అందరూ ఏడుస్తున్నారు. "ఎందుకు నాన్నా వీళ్లందరూ ఏడుస్తున్నారు పాపం మీ కోసం" అంటే; "నా కోసం ఏడ్చేవాళ్లు నావాళ్లు కాదు. నా అమ్మ కోసం ఏడ్చేవాళ్లు నా వాళ్లు" అన్నారు. అలాగే ఇక్కడ కూడాను అమ్మచింతన చేసి, అమ్మచింతన చేస్తూ ఉన్న వాళ్ల యొక్క వైబ్రేషన్స్‌ని బట్టి నాన్న ఆ రకమైన రికమండేషన్ చేస్తారు. చేయాలి, మనం చేయాలి! మనలో లోపం పెట్టుకొని, నాన్న చేస్తారనుకోవటం తప్పు! కాబట్టి ధ్యానం చాలా విశిష్టత కలిగినది. అమ్మతో ఉండే ఆనందం జగత్తులో లేదు. కన్నయ్యని గురించి, గోపికలు అందరూ సంసారంలో ఉన్నప్పటికి కూడా సంసారంలో ప్రతి చిన్న విషయం ప్రతి పనిలో కూడా వాళ్లు కన్నయ్యనే చూసుకున్నారు. 'కన్నయ్య పని, ఇది కన్నయ్యకి ఇష్టం, ఇది కన్నయ్యకి చాలా ఇష్టం, ఇది కన్నయ్యకి సంబంధించినది' అని ప్రతిపనినీ వాళ్లు కన్నయ్య భావంతో, ఆ ఆనందంతో వాళ్ల కార్యక్రమాలు నిర్వహించారు. అలా నిర్వహించారు వాళ్లు. కాబట్టి ప్రతి పనిని కూడాను అమ్మతో లింకు వేసుకో! అమ్మతో లింకు వేసుకొని చేస్తూ ఉండు పని! అమ్మతో లింకు ఉంటేమటుకు అమ్మచూస్తుంది 'వీడు నావాడ'ని. తప్పకుండా చూస్తుంది.

సేవ అనేది ప్రతి చిన్న విషయంలో అమ్మతో ఉండి సేవ చేసుకుంటే అమ్మ వస్తుంది. సుల్తాన్ అనే అతను ఒక మహమ్మదీయుడు. జైపూర్ మహారాజా దగ్గర జాబ్ చేస్తున్నాడు, ఉద్యోగం. జైపూర్ మహారాజా బృందావనం వస్తుంటే తాను కూడా వచ్చాడు. జైపూర్ మందిరాన్ని దర్శనం

చేసుకోవటానికి వచ్చారు. ఈ సుల్తాన్ మహమ్మదీయుడు కదా, బయటనే ఉన్నాడు. రాజుగారు లోపలికి వెళ్లి దర్శనం చేసుకొని ఆనందంగా బయటికి వచ్చారు. అప్పుడు ఆ సుల్తాన్ అనుకున్నాడు 'మహారాజా, లోపల ఇంతకంటే గొప్ప మహారాజా ఉన్నట్టు ఉన్నాడు. అందుకనే ఆయన దగ్గరికి వెళ్లి దర్శనం చేసుకొని, సేవ చేసుకొన్నారు. ఒక్క రాత్రి అయినా, ఒక్క రోజైనా ఇలాంటి గొప్ప మహనీయుడి సేవ చేసుకొని ధన్యం అవటం ఎంతో బాగుంటుంది! మహారాజుకి రాజు, చక్రవర్తి వంటివాడు లోపల ఉన్నాడు. ఆయనని దర్శనం చేసుకొని ఆనందంగా వస్తున్నారు. ఆయన దర్శనంలో ఆనందం పొందుతూ, సేవ చేసుకొని వచ్చారు. కాబట్టి ఒక్కరాత్రి అయినా నేను కూడా సేవ చేసుకోవాలి' అని ఆ సుల్తాన్‌కి కలిగింది పాపం!

రాజుగారు దర్శనం చేసుకొని వెళ్తుంటే, "నేను ఇక్కడ ఇవాళ ఉండి రేపు వస్తాను" అని చెప్పాడు. అందరూ వెళ్లిపోయినారు. ఈ సుల్తాన్ మాత్రం ఇక్కడే ఉన్నాడు. కాపలా కాస్తున్నాడు. 'ఇక్కడ నేను సేవ, కాపలా కాసే సేవ చేయాలి' అని వాడికి కలిగింది. 'అంత గొప్ప మహారాజాకి చక్రవర్తి ఈయన! ఈయనకి సేవ చేయటం నాకు చాలా ఇష్టంగా ఉన్నది'. అంటే భావం! తాను ఎవరో ఆలోచించటం లేదు. భావంలో ఉన్నాడు అతను. భావపరంగా ఆనందంగా ఉన్నాడు. 'లోపల ఉన్నాడు చక్రవర్తి! ఎప్పుడు బయటికి వస్తాడో, ఎప్పుడు దర్శనం చేసుకుంటానో! ఎప్పుడు వస్తారో బయటికి ? ఎప్పుడు నేను దర్శనం చేసుకుంటానో' అని ఎదురు చూస్తున్నాడు. రాత్రి 12 గం॥కి ఆ చక్రవర్తి బయటికి వస్తున్నాడు మహారాణిగారితో లోపలి నుండి.

'ఎంత సుందరమైన స్వరూపం! మహారాణిగారిది, చక్రవర్తి గారిది ఎంత సుందరమైన స్వరూపం! ఎంత కోమలమైన స్వరూపం! ఎంత మృదువుగా ఉన్నది వాళ్ల నవ్వు! ఎంత సుకుమారంగా ఉన్నారు' అని, తాను సైడ్‌కి వెళ్లిపోయినాడు. ఆ చక్రవర్తి కన్నయ్య, అమ్మ బయటికి వచ్చారు. చూడండి, ఎంత అదృష్టమో! ఎప్పుడూ తనకి ఈ చింతన లేదు. ఎప్పుడూ తనకి ఆ రాధాకృష్ణుల గురించి తెలియదు. కాని లోపల ఎన్ని జన్మల సంస్కారం ఉన్నదో చూడండి! అతనికి సేవ చేసుకోవాలని కలిగింది, ఆ చక్రవర్తి సేవ చేయాలని! దృఢమైన సంకల్పంతో నిద్రలేదు, అలాగే ఉన్నాడు. వాళ్లిద్దరూ వచ్చారు బయటికి, యమునానది వైపు వెళ్తున్నారు. తాను కూడా అక్కడి దాకా వెళ్లాడు, దూరంగా ఉన్నాడు. వాళ్లిద్దరూ స్నానం చేశారు. 12.30, 1 గం., 2 గం., 3 గం. ఔతున్నది. మళ్లీ తిరిగి వచ్చేస్తున్నారు వాళ్లిద్దరూ. తడి బట్టలు, ఇసుకతో ఉన్నది శరీరం అంతాను. మళ్లీ లోపలికి వస్తున్నారు. తాను సైడుకి వెళ్లాడు. లోపలికి వెళ్లిపోయినారు. తలుపులన్నీ వేసుకున్నారు, మళ్లీ పడుకున్నారు. కరెక్ట్‌గా 4 గంటలకల్లా పూజారి వచ్చాడు తలుపులు తీయటానికి. "తీయకండి తలుపులు! పాపం వాళ్లు ఇప్పుడే పడుకున్నారు. చాలా అలసిపోయారు. నిద్రలేదు. తలుపు తీయవద్దు" అంటున్నాడు సుల్తాన్ పూజారిని. "అదేమిటయ్యా నువ్వు ఎవరు, తలుపు తీయవద్దు అంటున్నావు! మా డ్యూటీ తెల్లవారు జామున 4 గం.కి వచ్చి తలుపు తీస్తేనే కాని అక్కడ పూజ చేయాలి. వాళ్లిద్దరికీ సేవ చేయాలి. బలే చెప్పవచ్చావులే" అని అతనిని అరిచారు. లేదని చాలా హఠం పట్టి, వాళ్లని ఎంతో మొండిగా మాట్లాడాడు సుల్తాన్. "వాళ్లు ఇప్పుడే వచ్చి పడుకున్నారు. అలిసిపోయి ఉన్నారు. వాళ్లకి

నిద్రాభంగం చేస్తారా మీరు” అని చాలా గట్టిగా మాట్లాడాడు. “ఇప్పుడే స్నానం చేసి లోపలికి వెళ్లారు”. “నీకు పిచ్చా, చాదస్తమా అలా మాట్లాడుతున్నావు” అని అన్నాడు పూజారి. అయినా సరే, వాళ్లు బలవంతాన తలుపు తీశారు. నిజంగానే కాళ్లనిండా ఇసక, తడిబట్టలు! లోపలికి వెళ్లి పూజారి చూసేసరికి అంతా తడిగా ఉన్నది. సుల్తాన్ చాలా బాధపడ్డాడు. ‘ఇప్పటి వరకు పాపం వాళ్లు విహరించి, నదిలో స్నానం చేసి ఇప్పుడే లోపలికి వెళ్తే వాళ్లని భంగపరిచారు. సేవట సేవ! ఇదేం సేవ! వాళ్లు సుకుమారమైన స్వరూపాలు! సుకుమారమైన భావాలు కలిగినవాళ్లు! వాళ్లని ఇంత ఇబ్బంది పెడతారా ఈ పూజారులు’ అని చాలా దుఃఖించాడు. చూడండి, ఆభావం highest! ఆ భావం చూశారు రాధాగోవిందులు! ఆ భావం చూసి, ఆయనకి దర్శనం ఇచ్చారు. ఎంత అదృష్టమో చూడండి!

కాబట్టి సేవలో గొప్ప అనుభూతిని ఇస్తారు వాళ్లు. ఆ అనుభూతి సామాన్యం కాదు. జీవితం మారిపోతుంది. జీవితం మారిపోతుంది. అలాంటి అనుభవం ఇస్తారు వాళ్లు! జీవితం మారాలంటే మామూలు వాటికి మారదు. వాళ్ల అనుభూతే మార్పిస్తుంది. కాబట్టి భావం highest! ఆ రాత్రంతా ఏకాగ్ర చిత్తంతో; ఆలోపల ఉన్న చక్రవర్తి పేరు తెలియదు, వాళ్ల రూపం తెలియదు, వాళ్ల నామం తెలియదు, వాళ్ల పేరే తెలియదు. తెలియకపోయినా భావం హైయ్యెస్ట్‌తో “వాళ్ల సేవ నాకు కావాలి! వాళ్ల సేవ highest అది! చక్రవర్తులకి చక్రవర్తి మా రాజుగారు, మహారాజుగారు! అలాంటి ఆయనే వచ్చి దర్శనం చేసుకున్నాడంటే ఎంత గొప్ప చక్రవర్తో ఆయన! ఆయనకి సేవ చేయని

జీవితం వ్యర్థం!" అనే గొప్ప భావాన్ని తీసుకున్నారు వాళ్లు. ఆ భావానికి వాళ్లు అనుభవం ఇచ్చారు, సుల్తాన్‌కి ఇచ్చారు.

కాబట్టి భావం మనసులో పెట్టుకొని; పేరు తెలియక్కరలేదు, రూపం తెలియక్కరలేదు. వాళ్ల యొక్క ప్రేమభావాన్ని తెలుసుకున్నాడు. కాబట్టి ఆ భావమే highest అన్నమాట! రాత్రంతా ఏకాగ్రంగా ఆ రాధాగోవిందులను చింతన చేసుకున్నాడు ఆయన! కాబట్టి, మనసు ఒక్క క్షణంచాలు; గంటలు, రోజులు, సంవత్సరాలు అక్కరలేదు. ఒక్క లిప్తకాలం చాలు! మనమనసు మారటానికి, మన జీవితం మారటానికి ఒక్క లిప్త కాలం చాలు వాళ్లతో ఉండే అనుసంధానం! ఆ భావాన్ని maintain చేసుకోవాలి! కాబట్టి రాధాగోవిందులు, వాళ్లిద్దరి మనసులు అతిసుకుమారం! వాళ్ల లీలలు అతిసుకుమారం! వాళ్ల ప్రేమ అతిసుకుమారం! మనకి పేరు తెలిసింది, ఆ సుల్తాన్‌కి పేరు కూడా తెలియదు. చూడండి! నామరూపరహితమైన భావంలో ఆయన చింతన చేశాడు. ఆయన కరుణించాడు. వాళ్లిద్దరూ కరుణించారు.

కాబట్టి ధ్యానానికి భావం ప్రధానం! ఆ భావంతో మనం అమ్మని ధ్యానం చేసుకోవాలి! 'రాధాగోవిందులు ఇద్దరూ కూర్చొని ఉన్నారు. అమ్మ కూర్చొని ఉన్నది. అమ్మని ఈ విధంగా సేవించాలి. అమ్మ ప్రేమ అనంతమైనది' అనే భావంతో వాళ్లని చింతన చేసుకోవాలి! అది highest! అందుకనే నాన్నగారు "రాధాభావ ధ్యానయోగం" అన్నారు. అమ్మ ప్రేమని, అమ్మ లీలని, అమ్మ యొక్క స్మృతిని మనం పెట్టుకుంటే ధ్యానం బాగా సాగుతుంది. ఎందుకని ? 'ఏదో కూర్చున్నాము, అయిపోయింది. ఏడు రోజులు

కూర్చున్నాము, ఇంకేముంది ? మళ్లీ వచ్చేదానికి కాలక్షేపంగా' అని అనుకోకూడదు. లోపల ఒక రకమైన వియోగం రావాలి లోపల! "వాళ్లకి ఎంత దూరమైపోతున్నాము ? జీవితం, కాలం వ్యర్థమైపోతున్నదే! ఇంతవరకు నా మనసు వాళ్లతో లింక్ కాలేదే! ఎందుకు ఈ జీవితం' అని లోపల ఒక రకమైన తపన ఏర్పడాలి! ఆ తపన ఏర్పడితేనే అమ్మతో లింక్ దొరకటానికి అవకాశం! కాబట్టి అమ్మ ధ్యానం highest అని నాన్నగారు చెప్పారు. మనం కూడా ఈ ఏడు రోజులూ చేసుకున్న ధ్యానం కంటిన్యూగా అవకాశం ఉన్నప్పుడల్లా కూర్చొని అమ్మతో లింకుని బలపరచుకోవాలి! బాహ్య ప్రపంచంతో తాదాత్మ్యం చెందకుండా, అమ్మతో లింకుని బలపరుచుకోవాలి! బలపరుచుకుంటే అమ్మ ప్రేమకి పాత్రులం ఔతాము! అమ్మ మనకి తప్పకుండా అనుభవం ఇస్తుంది. అనుభవం ఇస్తుందంటే అది రూపం కాదు, లీలకాదు; జీవితాన్ని మార్పే చేస్తుంది. జీవితాన్ని మార్పు చేస్తుంది! విచిత్రంగా మార్పు చేస్తుంది. హితహరివంశజీ దగ్గరికి ఆ నరవాహనుడు ఎలావచ్చాడు ? పరీక్ష చేయటానికి వచ్చాడు. 'ఎవరోనట వచ్చి ఇక్కడ పూజలు చేస్తున్నాడు, ఉపన్యాసాలు చెప్తున్నాడు. ఇలా ఉన్నాడట, నేనూ చూస్తాను. నా దగ్గరి నుంచి వచ్చిన వాళ్లంతా ఇక్కడే ఉండిపోయినారు. నేనే వెళ్లి ఆయనని స్వయంగా చూస్తాను'.

కిరాతకుడు అన్నారు. ఎంతో మంది మనుషులను చంపిన పాపాత్ముడు అన్నారు. అలాంటివాడు ఆయన దర్శనానికి వెళ్లాడు. అక్కడ పూర్తిగా అమ్మ చింతనతో కూడి ఉన్నారు హితహరివంశజీ! ఆ వైబ్రేషన్స్, పూర్తిగా అమ్మ వైబ్రేషన్స్ ఉన్నాయి. వెళ్లటంతోటే ఆయన మారిపోయినాడు. ఎలా

మారిపోయినాడు ? అమ్మ ఆడుతున్న లీల! అలాంటి కిరాతకుడిని కూడా అమ్మ అవలీలగా మార్చేసింది. మార్చి, ఆయన శిష్యుడిగా చేసింది అమ్మ! అలాంటివాడికి అష్టయామి లీలలు చూపించాడు గురువు! మరి చూడండి! అదే నాన్నగారు రాశారు పాటలో. "అధమ జీవుల నెల్ల ఆదరమ్మున గాంచి పాప దూరుల జేయు భవరోగ హారిణీ". అధమజీవులని కూడా వాళ్ల పాపాలని దూరం చేసేస్తుందిట అమ్మ. అంత కరుణామయి!

అలాంటి అమ్మని మనం చింతన చేసుకోవటానికి టైము ఉండటం లేదు అసలు! టైము కాదు కదా, మనసు ఉండటంలేదు. ఆ మనసు తిరుగుతున్నది, విషయాదులు అనే వీథులలో తిరుగుతున్నది. దానికి అసలు ఒక స్థిమితం లేదు. ఆ విధంగా తిరిగి, తిరిగి, చుట్టూ తిరుగుతున్నది. తిరుగుతూ ఉంటే లాభం ఏమున్నది ? మేము, మా చిన్నప్పుడు మా దగ్గరికి ఒక ముస్లిమ్ అతను వచ్చి పాడాడు కృష్ణుడి పాట. "బూటకాలతో ప్రొద్దు పుచ్చుట మేటి, మాటి మాటికి జన్మ మరియింక రాదని శ్రీకృష్ణ భజనలు చేయవె ఓ మనసా!" బూటకంతోటి తిరుగుతున్నాం మనం. మనం బయట బూటకం ఆడినా, ఆంతరంగికంగా అసలు వాడు, ఆ బూటకం తెలుసు వాడికి బూటకాలు ఆడుతున్నాడని! అంతటా ఉండే, ఆ లోపల ఉండే అమ్మకి తెలుసు. కాబట్టి దానిని మనం చాలా జాగ్రత్తగా సరైన మార్గంలో అమ్మతో లింకు పెట్టుకొని, మనం ధ్యానం చేసుకోవాలి! అమ్మతో లింకు ఉంటే మనకి శాశ్వతమైన ఆనందం కలుగుతుంది. శాశ్వతమైన సుఖం కలుగుతుంది. అమ్మ దగ్గరికి చేరటానికి అవకాశం! ఈ ధ్యానం అనేది ఏడురోజులు కాదు, ఎన్ని జన్మలు ఎత్తినా కూడా అమ్మతో లింకు ఉండాలి!

ఎన్ని జన్మలు ఎత్తినా కూడా అమ్మతో లింకు! 'ఎందుకయ్యా ఇలా జన్మలు ఎత్తటం ఏమిటి ? అమ్మతో లింకు ఏమిటి' అని అనుకుంటారు. జన్మ అంటూ లేకుండా ఉంటే బాగుంటుంది. జన్మ అంటూ లేకుండా కాదు, జన్మలు ఉన్నా కూడా అమ్మతో లింక్ కలిగి ఉండటం చాలా విశేషం అన్నారు. రామకృష్ణ పరమహంస చెప్పారు కాళీమాతతో 'నాకు కుక్క జన్మ ఇచ్చినా ఫరవాలేదు, నేను నీతోనే ఉంటే చాలమ్మా నాకు! ఏ జన్మ ఇచ్చినా ఫరవాలేదు, నీతో ఉండాలి లింకు' అని కోరుకున్నారు. కాబట్టి ఎన్ని జన్మలైనా ఆవిడతో ఉండాలి లింక్! మనకి జన్మలు కావాలి అని కోరుకోనక్కరలేదు. కోరుకొనే ఇక్కడికి వచ్చాము. ఈ విషయాదులు కోరుకొనే ఇక్కడికి వచ్చేశాము. కోరుకోకుండా వాటంతట అవే మనం చేసుకున్న దానిని బట్టి జన్మ వచ్చింది అనుకో, అమ్మతో ఉండాలి అది! ఆలింక్, అలాంటి శాశ్వత లింకు మనకి ఉండాలి!

కాబట్టి ధ్యానం highest! మనకి ఏడురోజులు కాదు, మన ఊపిరి ఉన్నంతవరకు అమ్మతో లింకు ఉంటే అమ్మ యొక్క సాన్నిధ్యానికి వెళ్లటానికి అవకాశం ఉంటుంది. ఎప్పటికైనా ఆవిడ చెంత చేరటానికే ప్రయత్నం చేయాలి! అదే చెప్పారు "జన్మాంతర సహస్రేషు తపోధ్యాన సమాధిభిః నరాణాం క్షీణ పాపానాం కృష్ణభక్తి ప్రజాయతే" అన్నారు. ఎన్ని జన్మలు ఎత్తినా మనం చేసుకున్న కర్మలన్నీ, పాపాలన్నీ క్షీణిస్తేనే కాని లాస్ట్‌కి కృష్ణభక్తి వస్తుందిట! అది మరిగొప్ప అవకాశంగా మనకి అవన్నీ జన్మలు అయిపోయినాయేమో తెలియదు కాని; కృష్ణుడు, రాధమ్మ అనే ఒక దివ్యమైన అనుబంధం కలిగింది మనకి. ఆ అనుబంధాన్ని పెంచుకుంటూ,

అనుభవంలోకి వెళ్లాలి! ఆ అనుభవంలోకి వెళ్లాలంటే ధ్యానం important! కాబట్టి మనం ధ్యానం వదలకుండా చేసుకోవటం మంచిది. 8 గం॥లు అనే కాదు, మనకి ఎప్పుడు అవకాశం ఉంటే అప్పుడు ధ్యానానికి టైము వినియోగించుకుందాము!

**జయ జయ శ్రీరాధే!**

– ० –

# అతీంద్రియ ఆనందం

పరమపూజ్యులైన, ప్రేమస్వరూపులైన నాన్నగారి దివ్యఆశీస్సులతో "శ్రీరాధాభావ ధ్యానయోగ" సప్తాహం 20వది. ఈ రోజు ఏడవ రోజు. నాన్నగారు నిర్విఘ్నంగా, చక్కగా మననం చేసుకోవటానికి అవకాశం ఇచ్చి చేయిస్తున్నారు అందరి చేత! ధ్యానం నాన్నకి ప్రాణం! "నాన్నా! స్నానం చేద్దురుగాని రండి" అని అంటే, "లేదు, నాకు ధ్యానమే స్నానం! అమ్మ ప్రేమ భావంలో మునిగిపోయి ఉండటమే స్నానం! నాకు స్నానం ఈ బాహ్యస్నానం కాదు" అని చెప్పారు నాన్న. అంటే మహనీయులు ఆ భావంలో ఉండగలిగారు. మనం కూడా ఉండటానికి ప్రయత్నం చేయటానికి ఈ ధ్యాన సప్తాహం, ధ్యానం చేస్తున్నాము.

ధ్యానానికి కూర్చోవటానికి ఎన్ని ఆటంకాలు వస్తూ ఉంటాయో చెప్పలేము. అన్ని ఆటంకాలు వస్తున్నా మనసుని ఏకాగ్రం చేసుకొని, అమ్మతో నింపుకొని అమ్మ ధ్యానం చేసుకోవాలి! సహజం! విషయాదులను కోరుకొని వచ్చాం మనం. ఈ విషయాదులలో తిరుగుతున్నాము. తప్పకుండా ఇవన్నీ అలలలాగా మనసుకి వస్తూ ఉంటాయి. వాటిని avoid చేయటమే మన యొక్క ధర్మం! ఏదైనా చిత్రం చూశామంటే ఆ చిత్రం మళ్లీ మన మనసులో ప్రింట్ ఔతుంది. ఆ ప్రింట్ అయ్యేది అవసరం వచ్చినప్పుడు, ధ్యానానికి కూర్చున్నప్పుడు ఆ ప్రింటు, ఆ రీల్ తిరుగుతూ ఉంటుంది. ఆ విషయాదులు ప్రింట్ అయి, లోపల ముద్రపడిపోతున్నాయి. ముద్రపడిపోయిన వెంటనే రీలుగా తిరుగుతూ ఉంటాయన్నమాట! అది మన మనసుకి వచ్చేసి, ధ్యానానికి ఆటంకం వస్తూ ఉంటాయి. కాబట్టి ఆ చిత్రాన్ని మనం రానివ్వకుండా

చూడాలి! అది చాలా కష్టం! చెప్పటం తేలిక, వినటంతేలికే! కాని అది ఆచరణలో, సాధనలో చాలా కష్టం! అతి కష్టం అది, కూర్చోలేము. 'అబ్బ, కాసేపు అటు వెళ్లిపోదాం, ఇటు వైపు వెళ్లిపోదాం' అని మనసు అలా చెదిరిపోతూ ఉంటుంది.

కాని నిజంగా మన మనసే కనుక ధ్యానానికి కుదిరితే లేవాలని అనిపించదు. ఎంత ఆనందంగా ఉంటుందో అది అనుభవమేకాని, చెప్పటానికి లేదు. అందుకనే చెప్పారు ప్రేమ యొక్క లక్షణాలు! అది అనుభవించేదే, ఇదీ అని నిర్వచించి చెప్పటానికి లేదు. ఇలా ఉంటుంది అని నిర్వచించటానికి ఉదాహరణగా, ఒక పోలికగా చెప్పటానికి లేనే లేదు. అలాంటిది ధ్యానం! కాబట్టి అనుభవరూపమే ధ్యానంలో కలిగేది. అదే ధ్యానంలోనే కాదు, నిరంతర నిత్యజీవితంలో కూడా అమ్మతో అనుసంధానం అనుభవం కలిగిస్తూ ఉంటుంది. చాలా విచిత్రంగా ఉంటుంది. నాన్నగారు అనేవారు 'నా జీవితం మలుపులు ఎలా తిరుగుతున్నదో నాకే తెలియదమ్మా! నా తల్లి ఎలా తిప్పుతుందో నాకే తెలియదు. ఎలా తీసుకువెళ్తుందో తన దగ్గరికి, చిత్రంగా ఉన్నది' అని అప్పుడప్పుడు అంటూ ఉండేవారు నాన్న. అది అయాచితంగా ఆ మలుపు అమ్మే తిప్పేస్తుంది. ఎందుకంటే తనవాడు కదా అని,తనవాడిని తన దగ్గరికి తీసుకోవటానికి అమ్మే ఆ విధమైన మలుపు తీసుకువస్తుంది. అంత విచిత్రంగా ఉంటుంది. కాబట్టి ధ్యానం అమ్మతో లింకు! ఎన్ని జన్మలు ఎత్తినా కూడా అమ్మతో లింకు అనేది శాశ్వతమైనది. కర్మను బట్టి జన్మ వస్తుంది. ఆ జన్మలో మళ్లీ కర్మ చేస్తున్నాం, మళ్లీ కర్మతో మళ్లీ తయారు ఔతున్నాము. అదే కర్మని మనం అమ్మపరంగా తిప్పుకొని,

అమ్మపరంగా కర్మని మనం అనుభవిస్తూ, అమ్మతో లింకుతో, 'ఇది కూడా అమ్మ యొక్కలీలే! అమ్మ యొక్క లీలలో ఒక భాగం ఇది' అనే భావంతోటి దాన్ని మనం జీవిస్తూ ఉండాలి! 'ఇది నా కర్మ, నేను చేసిన కర్మ' అని మనం అనుకొని, అనుభవిస్తూ ఉంటాం! ఆ అనుభవం కూడా అమ్మపరంగా తీసుకుంటే జీవితం చాలా ఆనందంగా ఉంటుంది. కర్మ తప్పదు. "కర్మాణాం భోగతో నశ్యేత్" – కర్మ భోగించక తప్పదు, అనుభవించక తప్పదు.

కాని అమ్మతో లింకు ఉన్నప్పుడు అది ఎంత ఆనందంగా ఉంటుందో! అది అనుభవిస్తున్నామనే బాధకలగదు. అదే రామకృష్ణ పరమహంస తాను హాస్పిటల్‌లో ఉన్నారు. గొంతంతా రక్తం కక్కుతున్నారు. కంఠానికి వచ్చింది ఆయనకి కాన్సర్! రక్తం కక్కుతూ, చాలా బాధపడుతున్నారు. వివేకానందుల వారు చూశారు. 'అబ్బ! ఎంత బాధపడుతున్నారో!' అని ఆయనకి చాలా బాధ కలిగింది. ఇంతలోకి విజయకృష్ణగోస్వామి అని గొప్ప మహనీయుడు, ఆ మహనీయుడు రామకృష్ణపరమహంసగారి దర్శనానికి వచ్చారు. ఇలా విజయకృష్ణగోస్వామి వచ్చారని చెప్పారు వివేకానందస్వామి. లేచి గబగబ, కూర్చొని ఆ స్వామిని ఆహ్వానించారు. ఇద్దరూ కనీసం 2, 3 గం॥లు చర్చించుకున్నారు ఆధ్యాత్మికంగా! నిమిషం కూడా దగ్గు ఆగకుండా, రక్తం కక్కుతూ ఉండే ఆయన నోరు ఆ భగవచ్చింతన చేస్తూ ఉంటే, ఆ భగవంతుని యొక్క చర్చలో ఉండేసరికి ఇద్దరూ; ఆయనా గొప్ప మహానుభావుడు, ఈయనా గొప్ప మహానుభావుడు! ఆ చర్చలో ఈ రక్తం కక్కటం అదీ ఏమైపోయిందో, దగ్గు ఏమయిందో! ఏదీ లేదు. చూడండి, అమ్మ ఏ విధంగా తన చింతన చేసుకొనేవారి కర్మకి ఏ విధంగా ఉపశాంతి కలిగించిందో!

చాలా చిత్రం ఇది! నాన్నగారు చెప్తూ ఉండేవారు. అలా 2, 3 గంటలు వాళ్లు మాట్లాడుకున్న తరువాత ఆయన వెళ్లిపోయినారు, విజయకృష్ణ గోస్వామిగారు తిరిగి వెళ్లిపోయినారు. అప్పుడు మళ్లీ మొదలుపెట్టింది దగ్గు. చూడండి! అయినప్పటికీ ఏమీ బాధలేదు. ఆ యొక్క నిత్య ఆనందస్థితిలో, ఆ భావంలో ఉన్నారు. కర్మ తప్పదు! ఒంటరిగా వచ్చారు, ఒంటరిగా అనుభవిస్తున్నారు, ఒంటరిగానే వెళ్లిపోవాలి! కర్మ తప్పదు, అనుభవించ వలసిందే! కాని ఆ ఆనందం, ఆ మహాత్ముల యొక్క ఆనందం ఆ స్థితిలో ఉంటారు. భగవత్ సంయోగస్థితిలో వాళ్లు జీవిస్తూ ఉంటారు. దాని వలన కర్మ యొక్క అనుభవం వాళ్లకి బాధగా ఉండదు. ఆ నిత్య సంయోగస్థితి కలగాలంటే దానికి మూలం, ఆ నిరంతర స్మృతి ధ్యానంలో ఉంటూ ఉంటుంది. అమ్మతో లింకు ఉంటుంది. "ఎన్ని కోట్ల జన్మలు ఎత్తినా నీతో లింకు ఉంటే చాలమ్మా" అని కోరుకుంటారు మహాత్ములు! ఎలాంటి కర్మలు అనుభవిస్తున్నా, ఆ కర్మ అనుభవాన్ని వాళ్లు చింతించరు. అమ్మని చింతిస్తూ ఉంటారు. అది, అమ్మచింతన అంత highest అన్నారు.

కాబట్టి ధ్యానంలో మనసుని స్థిరత్వంగా చేసుకొని, ఆ స్థిరత్వంలో ప్రశాంతంగా, స్థిరత్వంగా ఉండి అమ్మని మనసులో నింపుకోవాలి! అక్కడ మంత్రం ఏదీ అక్కర లేదు. ఎలాగైతే హితహరివంశులవారు అమ్మ ఇచ్చిన మంత్రాన్ని 'నీ కుంజలో నేను ఒక పరికరాన్ని అమ్మా! నన్ను కరుణించు. నీ కుంజలో ఒక పరికరంగా భావించి నేను అక్కడ ఉండి నిన్ను తలుచుకుంటున్నానమ్మా' అని చెప్పారు. అమ్మ చెప్పింది అలా చేయమని! ఎలా చేయాలి మంత్రం అని అడిగారు హితహరివంశులవారు. 'నా కుంజలో

ఒక పరికరంగా భావించుకొని చేయి ఈ మంత్రాన్ని' అని అమ్మ చెప్పింది. ఆయన ఆ విధంగా పరికరంగా భావించుకొని చేశారు. ఎప్పుడైతే ఆ భావంతో, 'అమ్మ కుంజలో ఉండి ధ్యానం చేస్తున్నాను' అనే భావంతో ఉన్నారో నిజంగా ఆయన అమ్మకి సఖి అయిపోయినారు. 'హితసఖి' అయిపోయినారు ఆయన. కాబట్టి అమ్మపరికరాలలో ఏదో ఒక పరికరంగా, అమ్మకి ఉపయోగపడే ఏదో ఒక పరికరంగా భావించుకొని, అమ్మ చింతన చేసుకొమ్మన్నారు.

కాబట్టి ధ్యానానికి మనసు ప్రశాంతం కావాలి! మనసుని అటువైపు, ఇటువైపు, ఎటువైపూ తిరగనీయకూడదు. ఆ ప్రశాంతస్థితిలో నీవు, అమ్మ ఇద్దరే! ఇంక ఎవరూ అక్కడ ఉండరు. అమ్మ, నీవు ఇద్దరే ఉంటారు. అమ్మతో ఉంటున్నప్పుడు ఇంక ఎంత ఆనందం ఉంటుందో చూడండి! కాబట్టి ధ్యానానికి మనసు చంచలం కాకుండా స్థిరంగా అమ్మభావాన్ని నింపుకొని, అమ్మతో ఉన్నాననే భావంతో, ఆ భావాన్ని maintain చేస్తూ ధ్యానం చేయి. మనం చాలా సార్లు, చాలాసార్లు ప్రతిరోజూ చెప్పుకుంటున్నాము. కాని ఇది పూర్తిగా ధ్యానానికి అలవరచుకోవటానికి సాధ్యపడటం లేదు. ఎందుకు సాధ్యపడటం లేదంటే మన మనసు చాలా విషయాదులలో తిరగటం వలన సాధ్యపడటం లేదు. వింటున్నాం కాని, వినే దానిని ఆచరణలోకి రావటానికి ఈ విషయాదులు అన్నీ అడ్డుపెడుతున్నాయి. అందుకని వాటిని మనం సాధ్యమైనంత వరకు avoid చేస్తూ ఉండాలి! అప్పుడు ధ్యానం కుదురుతుంది! ఎప్పుడైతే అలా చేస్తామో అమ్మ యొక్క వైబ్రేషన్స్‌తో అంతా అదే వాతావరణం ఏర్పడుతూ, చుట్టుపక్కల అంతా అదే ఆనందం కలుగుతూ ఉంటుంది.

అది, నాన్నగారి దగ్గరికి ఒకావిడ, కలెక్టర్ ఆఫీసులో పనిచేసే ఆవిడ, కల్యాణి అనే ఆవిడ, గౌడీ సంప్రదాయం ఆవిడది, ఆవిడ వచ్చేది. ప్రతి sunday నాడు నాన్నగారి దగ్గరికి వచ్చి కూర్చుండేది. మాటలు ఏమీ మాట్లాడదు. అలా కూర్చొని ఉంటుంది. నాన్నగారు ఏదో చెప్తూ ఉంటారు, ఆ చెప్పినది వింటూ ఉంటుంది. "నాన్నగారూ! మీ దగ్గర కూర్చుంటే ఏదో ఒక దివ్యమైన వైబ్రేషన్స్ వస్తున్నాయి. అక్కడ ఏమీ మాట్లాడనక్కరలేదు. ఒక ఆనందం కలుగుతుంది. ఎంత సేపు కూర్చున్నా కూడా ఒక దివ్యమైన ఆనందాన్ని అనుభవిస్తున్నట్లే ఉంటుంది కాని, వేరే భావన లేదు" అని ఆ అమ్మాయి చెప్పింది. అలా సత్పురుషులు, మహాత్ములు, అమ్మభావంతో ఉన్నవాళ్ల దగ్గర ఆ వైబ్రేషన్స్ అలా వాళ్లకి వస్తూ ఉంటాయి. వారికి శాంతి కలుగుతూ ఉంటుంది. ఎంత ఆందోళన, ఎంత ఇది ఉన్నా ప్రశాంతమైన అమ్మ వైబ్రేషన్స్ వస్తూ ఉంటాయి. కాని అవి రిసీవ్ చేసుకొని, ఆనందపడే యుక్తి మనకి ఉండాలి! కాబట్టి నిరంతరం అమ్మ ఉండే బాడీలో, అందరిలో ఉన్నది. "ఈశ్వరః సర్వభూతాని హృద్దేశే అర్జున తిష్ఠతి" అని అందరి హృదయంలో అమ్మ ఉన్నది. అమ్మ సాక్షిగా ఉన్నది! తనని తలచుకొనే వారితో ఆడుకుంటూ ఉంటుంది. నిరంతరం తనకోసం విలపించేవారితో ఆడుకుంటూ ఉంటుంది. ప్రతి జీవుడిలో ఉన్నది అమ్మ! అలాంటి మహాత్ములు అమ్మతో మాట్లాడుతూ, అమ్మతో వాళ్లు నిరంతరం సంయోగస్థితిలో ఉండటం వలన ఆ పక్కన ఉండే వైబ్రేషన్స్ కూడా అలా వస్తూ ఉంటాయి.

కాబట్టి ధ్యానం అంత highest! అమ్మతో నింపుకొని అమ్మతో ఉండాలి! కాని మనం అలా 24 గంటలూ కాదుకదా, ఒక లిప్తకాలం

కూడా ఉండలేము. ఏదో ఒకటి ఆటంకం వచ్చేసి, మనసుని అటులాగేస్తుంది. అదే నాన్నగారు ఒకసారి చెప్పారు – ఒకడికి అంత్యకాలం వచ్చిందిట. చివర్రిటైము, మరణస్థితి! దూడ చీపురు కట్టని తింటున్నదిట. అతనికి కొడుకు చెప్తున్నాడు 'నారాయణ మంత్రం చదువుకో; నారాయణ నారాయణ అని చెప్పమ'ంటే; 'ఉండు, తరవాత! ముందు ఆ చీపురుకట్టని పాడు చేసేస్తున్నది దూడ. ఆ చీపురుకట్టతీయండి' అని చీపురుకట్ట గురించి చెప్తున్నాడు. టైమ్ అయిపోతున్నది, ప్రాణం పోయే టైము వచ్చింది. కాని వాడికి చీపురుకట్ట మీదే ఉన్నది మనసు. ఎంత భగవన్నామం చేయమని కొడుకు చెప్పినా, దాని మీదకు వెళ్లటం లేదు. మనసు వెళ్లకుండా, ఆ విషయాదులతో కూడుకున్న దాని మీద లగ్నమైపోయింది. ఎప్పుడు లాస్ట్‌కి ఏది మనసుకి లగ్నం ఔతుందో అదే జన్మకి కారణం ఔతుంది. కాబట్టి మనసు అలాంటి విషయాదులలో లగ్నమైపోతున్నది. దానిని మనం మళ్లీ తీసుకువచ్చి కూర్చో బెట్టాలి! 'ఇంట్లోనండీ ఎలా జరుగుతుందండీ ధ్యానం ? ఇంట్లో పిల్లలు ఉన్నారు, అది ఇది' అని చెప్తూ ఉంటారు. నిజమే! ఉంటారు. ఉండక ఎక్కడికి వెళ్లిపోతారు సంసారం అన్న తరువాత! ఉంటారు. వేరే ఒక రూము పెట్టుకొని, ఆ రూములో కూర్చొని 'ఇదీ టైము, ఈ టైములో నేను ధ్యానం చేసుకుంటాను' అని హాయిగా చేసుకోవచ్చు. వాళ్లేమీ కాదనరు కదా! కాని చేయటానికి మనసు రాదు. ఎందుకు రాదు ? ఆ మనసు పూర్తిగా విషయాలతో నిండి పోయి ఉంటుంది. 'కుదరదు' అంటారు.

కాని అమ్మ అనుగ్రహం ఉన్నది అని అలాంటి మనసుతోటి ధ్యానం చేసుకుంటే మనం ఎంతో అమ్మకి దగ్గిర ఔతూ ఉంటాము. ఒక

అతీంద్రియమైన ఆనందం కలుగుతూ, ఆ ఆనందం సామాన్యమైన ఆనందం కాదు. మనసు లాగేస్తూ ఉంటుంది, అందుకని ఇటు పడిపోతున్నాము. కాబట్టి ధ్యానానికి నాన్నగారు చెప్పినట్లుగా, ప్రతిరోజూ మనకున్న టైము సద్వినియోగం చేసుకొని, ఏ టైములో ఖాళీ ఉన్నా ఆ టైములో వెళ్లి అమ్మతో కూర్చోండి! మనసు నిలవదనుకోండి అమ్మపాట పాడుకోండి, అమ్మ లీల చదువుకోండి, అమ్మలీల చింతన చేసుకోండి, అమ్మని గురించి మాట్లాడుకోండి మనసులో! ఈ విధంగా మనసుని తిప్పుకుంటూ ఉంటే అలవాటు పడుతుంది. ధ్యానం అంత highest కాబట్టి నాన్నగారు చెప్పినట్లుగా ధ్యానాన్ని మనం చేసుకుంటూ, ఆనందాన్ని మనం పొందుదాం, అమ్మ అనుగ్రహాన్ని పొందుదాము! అమ్మకి ప్రీతి ధ్యానం అన్నారు. "రాధా పరమ కరుణామయీ హైఁ, వే కేవల్ ధ్యాన్ మాత్ర్ సేహీ అపనీ భక్తోంకీ సామీప్య్ దర్శన్ దేతీ హైఁ". అమ్మ ధ్యానం చేతనే అమ్మ దర్శనం ఔతుందని చెప్పారు.

కాబట్టి ధ్యానాన్ని మనం భావపరంగా చేసుకుందాము. భావమే చాలా గొప్పది! మంత్రం చేసుకోవచ్చు. "హరేరామ హరేరామ రామరామ హరేహరే", "రాధే రాధే రాధే" అని అనవచ్చు. మనసు, వాక్కు, మాల మూడూ ఒకటిగా ఉండాలి! మూడూ మూడువైపులకి వెళ్లిపోతాయి. ఈ మాల, మాట, మనసు భావంతో నింపుకుంటూ చేసుకోవాలి! అప్పుడే ఆనందం కలుగుతుంది. అమ్మకి ప్రీతి! 'వీడు నావాడు, నేను వాడిని నావద్దకు తీసుకోవాలి' అని అమ్మకి కలుగుతుంది. ఆ రెహమాన్ ఏం చేశాడు ? 'శ్యామా శ్యామా శ్యామా' అన్నాడు. వాడికి శ్యామా అంటే తెలియదు. రాధ అంటే తెలియదు,

రాధాకృష్ణులు అంటే తెలియదు. ఆ నామం కూడా తెలియదు. ఆ పూజారి చెప్పాడు, 'శ్యామా' అని పేరు చెప్పాడు అంతే! అమ్మని చూడలేదు, అమ్మ ప్రేమ తెలియదు. అయినప్పటికీ ఆ శ్యామా అనే ఆ శబ్దంలో ఒక రుచి, ఒక భావం అతనికి టచ్ అయింది హృదయానికి! ఆ రుచి, ఆ భావం వలన శ్యామా, శ్యామా, శ్యామా అని ఆ చింతనలో ఉన్నాడు. 'నా దగ్గరికి తీసుకు వెళ్లాలి వీడిని, వాడు ఎలాగైనా నా దగ్గరికే రావాలి' అని అమ్మ ఈ విధంగా తిప్పింది. తల్లికి కలగటం, తల్లి 'నాయనా! నువ్వు ఎక్కడైనా బాగుంటే చాలు' అని అర్ధరాత్రి వేళ బయటికి పంపించేయటం, బృందావనం రావటం, యమునా నది ఒడ్డున అమ్మని గురించి విలపిస్తూ ఉండటం, అమ్మ సఖిని పంపించటం చంపకలతని, ఆ సఖి వచ్చి మరుసటి రోజు తీసుకువెళ్లటం అమ్మ దగ్గరికి! అమ్మ సొత్తు కాబట్టి తీసుకొని వెళ్లింది. ఆ భావం, ఆ 'శ్యామా' అనే మధురమైన భావం అతనిలో టచ్ అయింది. అది ఎలా టచ్ అయిందంటే అనుభవంగా తెలియవలసిందే కాని; దాని ప్రాసెస్ అలా ఉంటుంది, ఇలా ఉంటుంది అని ఎవరూ నిర్వచించి చెప్పలేరు. "యతో వాచో నివర్తంతే అప్రాప్య మనసా సహ" – ఎవరూ దానికి పోలిక లేదు, ఉదాహరణ లేదు, ఉపమానం లేదు ఆ భావాన్ని వర్ణించి చెప్పటానికి! ఎవరు మటుకు వాళ్లు ఆ భావాన్ని అనుభవంలో తెలుసుకోవలసిందే!

కాబట్టి "రాధాభావ ధ్యానయోగం"లో రాధాదేవిని, రాధమ్మతల్లిని హృదయంలో నింపుకొని; "అమ్మ ఉన్నది, అమ్మ చూస్తూ ఉన్నది, అమ్మ చూపులో ఉన్నాను, అమ్మని పిలుస్తున్నాను, అమ్మా అని పిలుస్తున్నాను, 'రాధే' అని పిలుస్తున్నాను. 'శ్యామా' అని పిలుస్తున్నాను అమ్మని. అమ్మ

వింటున్నది, ఎప్పటికైనా వింటుంది, అమ్మ పిలుస్తుంది. అమ్మ కనికరిస్తుంది తప్పకుండా!" మన యొక్క వేదనని బట్టి అమ్మ వేగంగా పరిగెత్తుకుంటూ వచ్చేస్తుంది. రాకుండా ఉండదు. కాని లోపల అమ్మ భావంతో ఆ వేదన కలగాలి! తల్లి వింటుంది. ఇతరత్రా ఏమీ మనసులో ఆలోచనలు రాకూడదు. అన్నీ avoid చేసేయాలి! తాను, తన ఇష్ట – ఇద్దరే! వాళ్లిద్దరే ఆ ధ్యానంలో ఉండాలి, ఇంక రెండవది రాకూడదు. ఇది ధ్యానం!

కాబట్టి మనం ప్రతిసారీ చెప్పుకుంటూనే ఉన్నాం. ఇవన్నీ చెప్పిన మాటలే! చెప్పిన మాటలే రిపీట్ ఔతున్నాయి. రిపీట్ అయినప్పటికి కూడా మనకి మననం చేసుకోవటానికి రావటం లేదు మననానికి. "శ్రవణ, మనన, నిధి ధ్యాస, ధారణ, ధ్యాన, సమాధి" అన్నారు. శ్రవణం – వింటున్నాము. మననం చేసుకోవటానికి అక్కడ మనం ఏమీ చేయలేకపోతున్నాము. మననం చేసుకుంటేనే మనసుకి పట్టుకుంటుంది. మనసుకి పట్టుకుంటేనే కాని భావం ఉత్పన్నం కాదు. భావం వస్తేనే కాని భావస్వరూపిణి అయిన అమ్మని నిలుపుకోగలం! కాబట్టి ఆ భావం కావాలి! కాబట్టి మనం అమ్మ ధ్యాన సప్తాహాన్ని ఆనందంగా చేసుకున్నాము. ఇంకా బాగా, ఇంకా బాగా రావాలి! ఎందుకంటే బాగా ధ్యానం సాగుతున్నదని వైబ్రేషన్స్ రావటం లేదు. 'అమ్మ ధ్యానం బాగా చేస్తున్నారు' అనే వైబ్రేషన్స్ బాగా రావటంలేదు. ఎందుకు రావటం లేదంటే అక్కడ ఉండే పరిస్థితిని బట్టి రావటంలేదు. టైమ్ ప్రకారంగా కూర్చోవటం, ఆ టైమ్ ప్రకారంగా మనం అమ్మతో లింకు పెట్టుకోవటం, ధ్యానం చేసుకోవటం అవి perfect గా ఉంటే అమ్మ పంపిస్తూ ఉంటుంది ఆ వైబ్రేషన్స్! కాబట్టి బాగా మనం ఈ ధ్యానసప్తాహమే కాకుండా మీకు

దొరికిన టైమ్, అవకాశం ఉన్న టైములో అమ్మ ధ్యానం చేసుకోండి! అది మీకే మంచిది, ఎవరిమటుకు వాళ్లకే! "ఉద్ధరేదాత్మనాత్మానామ్ ఆత్మైవ రిపురాత్మనః" ఎవరిమటుకు వాళ్లే ఉద్ధరించుకోవటానికే ఇది, ఇంకొకళ్లని ఉద్ధరించటానికి కాదు. సామూహికంగా చేశామంటే అదొక ఇది. ఏకాంతంగా చేసుకున్నది perfect అది! సామూహికంగా కూర్చొని చేసుకున్నది అందులో ఎన్నో మాటలు వస్తూ ఉంటాయి నీకెలా ఉన్నది, నీకెలా ఉన్నది, నువ్వెలా చేస్తున్నావా, నేనెలా చేస్తున్నానా అని మాటలే కాని అక్కడ క్రియ ఉండదు. ఏకాంతంగా చేసుకున్నది అది perfect గా, బాగా ఉంటుంది.

కాబట్టి మనం అమ్మని చింతన చేసుకోవటానికి నీవు, తల్లి ఇద్దరే! ఇంక ఎవరూ, రెండవ ఆలోచన రాకూడదు. రెండవ ఆలోచనకు తావు ఇవ్వకు. అమ్మతో, అమ్మ భావాన్ని ఫీల్ అవండి! అమ్మ ధ్యానం నాన్నగారు ఇచ్చినది మనం సద్వినియోగం చేసుకొని, మనమటుకు మనం ఉద్ధరింప బడటానికి, అమ్మకి దగ్గర అవటానికి మనం ప్రయత్నం చేద్దాము!

**జయ జయ శ్రీరాధే!**

– ० –



శ్రీ రాధామహాలక్ష్మి అమ్మ

శ్రీరాధే

# రసవాణి

ధ్యానం highest! బృందావనంలో మహాత్ములు అందరూ నిరంతరం అమ్మతో లింకు పెట్టుకొని, ఆ చింతనలోనే ఉంటారు. అమ్మ యొక్క టచ్ అనుభవంలోకి వస్తే బాహ్యంగా ప్రదర్శన ఏమీ ఉండదు. అది భావస్థితి! నిరంతర స్మృతితో మనసును అమ్మతో లింక్ చేసుకోవాలి!

గోపికలది నిస్సాధన సాధన! వాళ్లు ఏ పని చేస్తున్నా మనసులో కన్నయ్యే ఉండేవాడు! అలాగ భగవంతుడితో లింకు పెట్టుకుంటే ఈ జన్మలు, కర్మలు, బంధాలు ఏదీ ఉండవు. ప్రేమమయి అయిన అమ్మతో శాశ్వతమైన అనుసంధానం ఉండాలి! సేవ చాలా ప్రధానం! మానసీ సేవలో పూర్తి స్మృతి, పూర్తి ధ్యానం ఉంటాయి. 'నేను, నాది' అనేది ధ్యానానికి పెద్ద అడ్డుగోడ! గురుకృపతో ఆ ఆటంకాన్ని దాటాలి. మనసును అమ్మతో లగ్నం చేసుకొని, భావాన్ని feel ఔతూ continuous గా ధ్యానం చేస్తూ ఉంటే ఒక అతీంద్రియమైన ఆనందం లోపల టచ్ ఔతుంది.

ఒకే సాధన – భావధ్యానసాధన! ఒకే కోరిక – అమ్మకావాలి! ఒకే దైవం – రాధాజీ! అప్పుడు పంచమ పురుషార్థమైన ప్రేమతత్వానుభవం కలుగుతుంది. విషయాదులతో తాదాత్మ్యం చెందకుండా, రాధా ప్రేమ భావాన్నే చింతన చేయాలి! అప్పుడు నామ, రూప, గుణ, లీలాతీతమైన ఒక దివ్యభావం టచ్ ఔతుంది. అదే భావస్వరూపిణియైన శ్రీరాధా స్వరూపం! అదే జన్మ సాఫల్యమంత్రం!

రాధే రాధే